IRS PUBLICATIONS
irspublications12@gmail.com

Truth of News
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మహ్మద్ షఫీ అహ్మద్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

శనివారం, 10 ఆగస్టు 2024 | విజయవాడ | సంపుటి 1 | సంచిక 62 | పేజీలు 8+8 | వెల: రూ. 6.50
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi



# వయనాడ్ బాధితులకు అండ

క్షతగాత్రులకు మోడీ పరామర్శ

ఏరియల్ సర్వే ద్వారా విలయప్రాంత వీక్షణం

సిఎం పినరయ్‌తో కలసి సమీక్ష

అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ

తిరువనంతపురం,ఆగస్ట్10(సూర్యవాస్తవం): కేరళలో ప్రకృతి ప్రకోపానికి బలైన వయనాడ్ బాధితులకు అండగా ఉంటామని ప్రధాని మోడీ ప్రకటించారు. వారికి తగి సహాయం అందిస్తామని అన్నారు. వయనాడ్ విలయ ప్రాంతంలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటించారు. భారీ వర్షాలు, వరదలతో కొండచరియలు విరిగిపడిన ఘటనలో బాధితులు, ప్రాణాలతో బయటపడిన వారిని మోదీ పరామర్శించారు. అనంతరం కేరళ సీఎం పినరయి విజయన్, గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్, కేంద్రమంత్రి సురేష్ గోపి, ఇతర యవనాడ్ ఉన్నతాధికారులతో ప్రధాని సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. వయనాడ్‌లో కొండచరియలు విగిరిపడినప్పటి నుంచి ఘటనకు సంబంధించిన

మిగతా 2లో..

## ఎస్సీ రిజర్వేషన్లను అన్ని రాష్ట్రాలు అమలుచేయాలి

నాలుగు రాష్ట్రాల సిఎంలు ఇప్పటికే ముందుకువచ్చారు

రిజర్వేషన్ల అమలుకు ప్రధాని మోడీ నిర్దుష్ట హామీ

రిజర్వేషన్లు అన్ని కుటుంబాలకు అందుబాటులోకి రావాలి

ఢిల్లీలో మీడియాతో మందకృష్ణ మాదిగ

న్యూఢిల్లీ,ఆగస్ట్10(సూర్యవాస్తవం): ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలుకు రాష్ట్రాలు త్వరగా ముందుకు రావాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఈ రిజర్వేషన్ల వర్గీకరణపై ప్రధాని మోదీ నిర్దిష్టంగా హామీ ఇచ్చారని చెప్పారు. దిల్లీలో మందకృష్ణ మీడియాతో మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాకారంలో మోదీ, అమిత్‌షా పాత్ర ఎంతో ఉంది. ప్రధాని, కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నాం. ఎస్సీ రిజర్వేషన్ల

మిగతా 2లో..



# తెలంగాణలో టిడిపి బలోపేతానికి కృషి

త్వరలోనే కొత్త అధ్యక్షుడి నియామకం

సభ్యత్వ నమోదు తదితర అంశాలపై చర్చించిన బాబు

హైదరాబాద్,ఆగస్ట్10(సూర్యవాస్తవం): తెలుగు ప్రజల కోసం పుట్టిందే తెలుగుదేశం పార్టీ అని, తెలంగానలోనూ పార్టీ బలోపేతం కావాల్సి ఉందని టిడిపి అధినేత, ఏపి సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. శనివారం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్లో ముఖ్య నేతలతో చంద్రబాబు నాయుడు సమావేశం అయ్యారు. తెలంగాణాలో పార్టీ పునర్నిర్మాణం పై చర్చ జరిగింది., ప్రస్తుతం ఉన్న పార్టీ పదవులు అన్ని రద్దు చేసినట్లు.., రాష్ట్ర నూతన అధ్యక్ష ఎన్నికకు త్వరలో నిర్ణయం తీసుకోబోతున్నట్లు ఆయన తెలిపారు. గ్రామ స్థాయిలో సభ్యత్వాల నమోదు కార్యక్రమం చేపట్టాలని చంద్రబాబు సూశించారు. తెలంగాణలో టీడీపీకి పూర్వవైభవం తెచ్చేలా పని చేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. అందరినీ చూడడానికి ఇక్కడికి వచ్చాను. ముఖ్యమంత్రి అయ్యాక ఒక్క సారే వచ్చాను. మరోసారి ఇక్కడ అందరినీ కలిసి రెండు గంటలు గడుపుదామని వచ్చాను. ఇక్కడ వచ్చిన తరువాత నాకు ఇచ్చిన ప్రతి అప్లికేషన్ తీసుకున్నాను. ఇక్కడ పార్టీ నీ మరోసారి బలోపేతం చేయాలని అందరూ కోరుకుంటున్నారు.. ఇక్కడ పార్టీలో పని చేయడానికి చాలా మంది సిద్ధంగా ఉన్నారు.. వారందరి కోసం పార్టీ బలపర్చాలని అనుకుంటున్నాము.. పార్టీ ఎలా బలపర్చాలనేది ఆలోచన చేస్తున్నాము.. కొన్ని ప్రత్యేకమైన పరిస్థితిలో ఇక్కడ అధ్యక్షున్ని పెట్టలేదు.. ఇక్కడ గత రెండు ఎన్నికలకి దూరంగా ఉన్నాము.. ఊహా జనిత ప్రశ్నలకు సమాధానం చెప్పాను..పార్టీ ని ఎలా బలోపేతం చేయాలని, ప్రజలకు ఎలా సేవలు అందించాలి అనేది ఆలోచిస్తునాం.. తెలుగు ప్రజల కోసం నిరంతరం పని చేసిన పార్టీ టీడీపీ. ఆంధ్రప్రదేశ్ లో వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. దానిని దారిలోకి తెచ్చుకోవాలి. తెలంగాణలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తాను. తెలుగు ప్రజల మనోభావాల కోసం



పని చేస్తాము. ఇప్పుడు ఏపీలో ఆలయాలపై దాడులు జరగడం లేదు.
గత ప్రభుత్వంలో ఆలయాలపై దాడి చేసిన వారిని పై చర్యలు తీసుకుంటాం. తెలంగాణలో తెలుగు జాతి ఎదగాలి. విజన్ 2047 కోసం పనిచేస్తాం. 2047 వరకు ప్రపంచంలో ఉన్న తెలుగు వారు ఉన్నత స్థాయిలో ఉండేలా చేయడం నా లక్ష్యం. ఆ రోజు 2024 అని మాట్లాడితే నన్ను 420 అన్నారు. సెల్ ఫోన్ గురుంచి మాట్లాడితే నన్ను హేళన చేశారు. రానున్న రోజుల్లో తెలుగు రాష్ట్రాలు టెక్నాలజీలో ప్రపంచంలోనే అగ్రగామిగా ఎదుగుతాయని ఆయన అన్నారు. అరవింద్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## బంగ్లాలో మరోమారు అల్లర్లు

సుప్రీం జడ్జిలు లక్ష్యంగా నిరసనలు

తక్షణం జడ్జిలు రాజీనామా చేయాలంటూ ఆందోళన

ఢాకా,ఆగస్ట్10(సూర్యవాస్తవం): బంగ్లాదేశ్‌లో మరోసారి అల్లర్లు చెలరేగాయి. ఈసారి నిరసనకారులు సుప్రీంకోర్టును లక్ష్యంగా చేసుకున్నారు. ప్రధాన న్యాయమూర్తి వెంటనే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ఇతర న్యాయమూర్తులు దిగిపోవాలంటూ కోర్టు వద్ద నిరసనలు చేశారు. దాంతో ఆయన దిగొచ్చారు. తాను రాజీనామా చేస్తానని వెల్లడించారు. బంగ్లా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి.. ఇతర న్యాయమూర్తులతో సమావేశానికి పిలుపునిచ్చారు. అయితే దీనికి తాత్కాలిక ప్రభుత్వం అనుమతి లేదని, అలాగే ఆయన దేశం విడిచి పారిపోవచ్చనే వార్తలతో ఈ నిరసనలు ఒక్కసారిగా చెలరేగాయి.

మిగతా 2లో..

# ఎపిలో రెడ్‌బుక్ రాజ్యమేలుతోంది

హామీలకు.. నాది గ్యారెంటీ అని దగా

అబద్దపు లెక్కలు..శ్వేత పత్రాలతో మోసం

ట్విట్టర్ వేదికగా మండిపడ్డ జగన్



అమరావతి,ఆగస్ట్10(సూర్యవాస్తవం): ఏపీలో రెడ్‌బుక్ రాజ్యామేలుతోందన్నారు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి. ఎన్నికలకు ముందు సంపద సృష్టిస్తానని.. హామీలను నాది గ్యారంటీ అని చంద్రబాబు పదే పదే చెప్పారు. ఇప్పుడు హామీల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇది పచ్చిమోసం కాదా చంద్రబాబు? అని వైఎస్ జగన్ ప్రశ్నించారు. అలాగే, అబద్దపు లెక్కలతో, తప్పుడు శ్వేతపత్రాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, వైఎస్ జగన్ ట్విట్టర్ వేదికగా..'చంద్రబాబు.. ఎన్నికలప్పుడు ఈ రాష్ట్రం బాధ్యత నాది అన్నారు. పైపెచ్చు రాష్ట్రానికి రూ.14లక్షల కోట్ల అప్పులున్నాయని, అయినా సంపద సృష్టిస్తానని, హామీలకు గ్యారెంటీ నాదే అని పదే పదే చెప్పారు. తీరా అధికారంలోకి వచ్చాక రాష్ట్రం బాధ్యత ప్రజల దంటూ నైజాన్ని బయటపెట్టారు.

మిగతా 2లో..



## బ్రెజిల్‌లో ఘోర విమాన ప్రమాదం

సావోపాలో వద్ద కుప్పకూలిన విమానం

61మంది ప్రయాణికుల దుర్మరణం

న్యూఢిల్లీ,ఆగస్ట్10(సూర్యవాస్తవం): బ్రెజిల్‌లో ఘోర విమాన ప్రమాదం జరిగింది. సావోపాలో వద్ద ఓ విమానం అదుపు తప్పి కుప్పకూలింది. ఈ ప్రమాదంలో విమానంలో ఉన్న 61 మంది ప్రాణాలు కోల్పోయారు. సోషల్ మీడియాలో ఈ ప్రమాద దృశ్యాలు వైరల్ అవుతున్నాయి. గాల్లో అదుపు తప్పి చక్కర్లు కొట్టిన విమానం ఒక్కసారిగా

మిగతా 2లో..

## కేంద్ర క్యాబినెట్ కార్యదర్శిగా టీవీ సోమనాథన్

రెండేళ్లపాటు పదవిలో ఉండేలా ఉత్తర్వులు

న్యూఢిల్లీ,ఆగస్ట్10(సూర్యవాస్తవం): కేంద్ర క్యాబినెట్ కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి టీవీ సోమనాథన్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర క్యాబినెట్ నియామకాల కమిటీ శనివారం నిర్ణయం తీసుకున్నది. ఈ నెల 30 నుంచి రెండేండ్ల పాటు స్వామినాథన్.. కేంద్ర క్యాబినెట్ కార్యదర్శిగా ఉంటారు. 1987 బ్యాచ్ క్యాడర్ ఐఏఎస్ అధికారి అయిన టీవీ సోమనాథన్ ప్రస్తుతం ఆర్థిక శాఖ కార్యదర్శిగా సేవలందిస్తున్నారు. క్యాబినెట్ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టే వకూ క్యాబినెట్ సెక్రటేరియట్‌లో

మిగతా 2లో..




# దేశంలో పెరుగుతున్న సైబర్ నేరాలు

చదువుకున్న వారు సైతం మోసపోతున్నారు

అవగాహనా వాక్ థాన్‌లో హోంమంత్రి అనిత

విజయవాడ,ఆగస్ట్10 : దేశంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, చదువుకున్న వారు సైతం మోసపోతున్నారని ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. 4 నెలల్లోనే దేశవ్యాప్తంగా రూ.1730 కోట్ల విలువైన సైబర్ నేరాలు జరిగాయని అనిత తెలిపారు. సైబర్ నేరాలపై అవగాహన కోసం విజయవాడలో వాకథాన్ నిర్వహించారు. 16 రకాల సైబర్ మోసాలపై అవగాహన, ఫిర్యాదుల కోసం రూపొందించిన యాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశంలో 24 శాతం వరకు సైబర్ నేరాలు పెరిగాయని పేర్కొన్నారు. నిత్య జీవితంలో వినియోగించే అనేక యాప్‌ల ద్వారా మోసాలు జరుగుతున్నాయని తెలిపారు. అనేక సామాజిక మాధ్యమాలు, యాప్‌లకు పౌరులు అందిస్తున్న వ్యక్తిగత సమాచారమే ఈ మోసాలకు కారణమవుతోందన్నారు. లోన్‌యాప్‌లు, హనీట్రాప్, ఇతర యాప్‌ల ఊబిలో పడి పలువురు ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారని చెప్పారు. ఈ నేరాల నియంత్రణకు రాష్ట్రస్థాయిలో సైబర్ సమన్వయ బృందం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రతి జిల్లాలోనూ సైబర్ సెల్ చురుగ్గా పనిచేయాలని ఆదేశించారు. రోజుకు 5 నుంచి 6 సైబర్ నేరాల ఫిర్యాదులు అందుతున్నాయని విజయవాడ సీపీ రాజశేఖర్ బాబు తెలిపారు. విద్యార్థులు, వైద్యులు, ఐఏఎస్‌లు.. ఇలా చాలా మంది మోసపోతున్నారని తెలిపారు. సైబర్ నేరం జరిగిన వెంటనే 1930కు ఫోన్ చేయాలని సూచించారు. జాతీయ స్థాయిలో సైబర్ క్రైమ్ పోర్టల్.. మోసగాళ్ల ఆర్థిక లావాదేవీలను నిలిపివేస్తుందని చెప్పారు. 1930 పోర్టల్‌కు 98 బ్యాంకులతో అనుసంధానం ఉందని వివరించారు. సైబర్ మోసాల అవగాహన మహాయజ్ఞాన్ని ప్రజలంతా విజయవంతం చేయాలని సీపీ కోరారు.

## రచ్చకెక్కిన ఎమ్మెల్సీ దువ్వాడ ఫ్యామిలీ

భర్త ఇంటిముందు భార్యాపిల్లల ఆందోళన

తన భార్య వాణి తీరుపై మండిపడ్డ శ్రీనివాస్

శ్రీకాకుళం,ఆగస్ట్10(సూర్యవాస్తవం): ఆంధ్రప్రదేశ్‌లో ఓ ఎమ్మెల్సీ కుటుంబ వ్యవహారం ఇప్పుడు రచ్చ చేస్తోంది. వ్యక్తిగత వివాదాలు కాస్తా రాజకీయంగా దుమారం రేపుతున్నాయి. వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అక్రమ సంబంధాలు, ఫ్యామిలీ గొడవలు రచ్చకెక్కాయి. ఇంటిముందు భార్యా పిల్లల ధర్నా, ఆందోళనతో వార్త ఒక్కసారిగా దుమారం రేపింది. ఇంట్లో ప్రియురాలు.. ఆ పక్కింట్లో ఇల్లాలు అన్నట్లుగా దువ్వాడ వ్యవహారం దుమారం రేపింది. ఈ విషయంపైనే శ్రీనివాస్ ఇంటి ముందు ఆయన భార్య, కుమార్తెల నిరసన వ్యక్తం చేస్తున్నారు. భార్య, కూతుళ్లని చూసి ఇంటి గేటు

మిగతా 2లో..

## మహనీయుల జీవిత చరిత్రతో మ్యూజియం

అమరావతిలో ఏర్పాటు చేయడం సముచితం

కుప్పస్వామి చౌదరి విగ్రహావిష్కరణలో వెంకయ్యనాయుడు

బాపట్ల,ఆగస్ట్10(సూర్యవాస్తవం): రాజధాని అమరావతిలో మహనీయుల జీవిత చరిత్రతో మ్యూజియం ఏర్పాటు చేయాలని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆకాంక్షించారు. మహనీయుల జీవిత చరిత్రలు నేటి తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని

మిగతా 2లో..

## బంగ్లాలో మరోమారు అల్లర్లు

మొదటిపేజీ తరువాయి..

విద్యార్థులతో పాటు పలువురు నిరసనకారులు సుప్రీంకోర్టు వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. దీంతో న్యాయమూర్తుల సమావేశం అర్ధంతరంగా ఆగిపోయింది. అక్కడితో శాంతించని ఆందోళనకారులు కోర్టును చుట్టుముట్టారు. చీఫ్ జస్టిస్ గంటలో దిగిపోవాలంటూ డిమాండ్లు చేయగా.. ఆయన అందుకు అంగీకరించాల్సి వచ్చింది. రిజర్వేషన్లపై విద్యార్థుల నిరసనలు హింసాత్మకంగా మారడంతో.. ప్రధానిగా ఉన్న షేక్ హసీనా ఇటీవల వైదొలిగిన విషయం తెలిసిందే. ఆమె ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. మరోవైపు దేశాధ్యక్షుడు పార్లమెంటును రద్దు చేశారు. తాత్కాలిక పరిపాలన యంత్రాంగానికి యూనస్‌ను సారథిగా నియమితులయ్యారు. జులై నుంచి దశలవారీగా జరుగుతోన్న ఆందోళనల్లో 400 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. వీటిన వెనక విదేశీ హస్తం ఉందంటూ కథనాలు వెలువడ్డాయి. మరో రెండు నెలల్లో మహిళల టీ20 ప్రపంచకప్ జరగనుంది. అందుకు వేదిక బంగ్లాదేశ్. ఇప్పుడు అక్కడ అల్లర్లు కొనసాగుతూనే ఉండటంపై క్రికెట్ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో ప్లేయర్ల భద్రతపై తమకు హామీ ఇవ్వాలని ఆ దేశ ఆర్మీ చీఫ్‌కు బంగ్లా క్రికెట్ బోర్డు విజ్ఞప్తి చేసింది. ఆర్మీ చీఫ్ వాకెర్ ఉజ్ జమాన్‌కు బీసీబీ లేఖ రాసినట్లు కథనాలు వచ్చాయి. అక్టోబరు 3వ తేదీ నుంచి 20 వరకు పొట్టి కప్ జరగనుంది. సెప్టెంబర్ చివరివారంలో వార్మప్ మ్యాచ్‌ల సందడి మొదలుకానుంది. బంగ్లాదేశ్‌లో పరిస్థితులపై ఐసీసీ కూడా నిరంతరం పర్యవేక్షిస్తోంది. ఒకవేళ అక్కడ వీలుకాకపోతే.. భారత్‌తోపాటు యూఏఈ, శ్రీలంకను ఇతర ఛాయిస్‌గా ఐసీసీ భావిస్తున్నట్లు క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి.

## రచ్చకెక్కిన ఎమ్మెల్సీ దువ్వాడ ఫ్యామిలీ

మొదటిపేజీ తరువాయి..

వేసుకుని లోపలే ఉన్న దువ్వాడ శ్రీనివాస్‌ను ఆయన కుటుంబ సభ్యులు నిలదీశారు. తన భర్త వివాహేతర సంబంధం కారణంగా పరువు పోతోందని భార్య వాణి ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు.. ఒక మహిళ కారణంగా తమ తండ్రి తమకు దూరంగా ఉంటున్నారని ఆయన కూతురు హైందవి ఆవేదన వ్యక్తం చేస్తోంది. అయితే, ఈ వివాదానికి కారణమైన మాధవి.. దువ్వాడ వాణిపై తీవ్ర ఆరోపణలు చేయగా.. వాణి తిరిగి ఎదురు సమాధానం ఇచ్చింది. కుటుంబాలను కూల్చే బాపతు మాధవి అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇతరుల జీవితాతల్లో ప్రవేశించి.. కుటుంబాలను నాశనం చేయడమే మాధురి పని అని విమర్శించారు. తమ జీవితంలోకి రాకముందు.. అనేక మంది జీవితాలను ఇలాగే నాశనం చేసిందని వాణి ఆరోపించారు. శ్రీనివాస్, మాధురి తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి అబద్ధాల మీద అబద్ధాలు చెబుతున్నారని వాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే దువ్వాడ వాణి తనను ట్రాప్ చేసి.. తన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుందని మాధురి ఆరోపించింది. శ్రీనివాస్‌తో స్నేహంగా ఉండేదానని చెప్పుకొచ్చింది. ఎమ్మెల్యే టికెట్ కోసం దువ్వాడ వాణి తను బ్యాడ్ చేసిందని మాధురి ఆరోపించింది. అవిడ చెబుతున్నవన్నీ అబద్ధాలేనని అన్నారు. తమ మధ్య ఇల్లీగల్ రిలేషన్ లేదని చెబుతోంది. మరోవైపు భార్య వాణితీరును దువ్వాడ శ్రీనివసా÷– వ్యతిరేకిస్తున్నారు. ఏ రంగంలో తాను ఎదిగినా అందులో దాన్ని లాక్కునే దువ్వాడ వాణికి తనపై మొదటి నుంచి ద్వేషం ఉందని తీవ్ర విమర్శలు చెప్పుకున్నారు. తన భార్య అని ఎక్కడా చెప్పని దువ్వాడ శ్రీనివాస్ తన భార్యగా ఆమె చెప్పుకుంటోందని అంటూ విమర్శలు చేస్తూ వచ్చారు. తన భార్యగా చెప్పుకొనే వాణి అంటూ ఎదురుదాడి ప్రారంభించారు. పాతికేళ్లుగా రాజకీయాల్లో ఉన్న తాను ఎప్పుడూ అక్రమాలు చేయలేదని ప్రజల కోసమే పని చేశాను అన్నారు. ఓడినా గెలిచినా తనకు ప్రజల శ్రేయస్సే ముఖ్యమని వివరించారు. ఎన్నికల ముందు నుంచి మొదలైన తన కుటుంబ వివాదం ఇప్పుడు మరింత రచ్చకెక్కిందన్నారు. తానేమీ స్థితిమంతుడిని కానని... ప్రజలకు ఎంతోకొంత సాయం చేయాలని రాజకీయాల్లోకి వచ్చానన్నారు. రాజకీయాలను కుటుంబాన్ని ఏనాడు నిర్లక్ష్యం చేయలేదన్నారు. భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలను అల్లారు ముద్దుగా పెంచానన్నారు. వారికి వైద్యవిద్యను అందించాని వివరించారు. పెళ్ళైన మొదటి నుంచే తనపై వాణి అసూయ ద్వేషం పెంచుకున్నారని శ్రీనివాస్ అన్నారు. రాజకీయాలనే కాదు, లాభాల్లో ఉన్న తన వ్యాపారాలను లాక్కునేందుకు కూడా ఆమె పేరు మీద రాయించేందుకు కూడా ఒత్తిడి చేశారని గుర్తు చేశారు. నిత్యం తనను ఎన్నో రకాలుగా వేధించారని ఆరోపించారు. తనపై లేనిపోని ఆరోపణలు చేసి కుమార్తెల మెదళ్లలో వాణి విషం నింపారని ఆరోపించారు ఇప్పుడు వాళ్లే తనపై తిరుగుబాటు చేసేలా చేసి ఘనత వాణిదేనన్నారు. 2019 ఎంపీ ఎన్నికల్లో తనకు వ్యతిరేకంగా ఫ్యామిలీని మరికొందరి ప్రోత్సహించి తన ఓటమికి వాణి కారణయ్యారని ఆరోపించారు దువ్వాడ. ఓ సందర్భంలో తనపై డంబెల్‌తో దాడికి యత్నించిందన్నారు. ఆ టైంలో తాను తప్పించుకో బోయే క్రమంలో కింద పడి కాలు విరిగిపోయిందన్నారు. ఆ ఎన్నికల్లో కాలికి కట్టుతోనే ప్రచారం చేశానన్నారు. టెక్కలి టికెట్ విషయంలో కూడా చాలా చర్చలు జరిగాయన్నారు శ్రీనివాస్. దువ్వాడ శ్రీనివాస్‌కు టికెట్ ఇస్తామని జగన్ చెప్పడంతో తాను ఆత్మహత్య చేసుకుంటానని వాణి బెదిరించారని అన్నారు. అప్పుడు తన రాజకీయ జీవితాన్ని ఫణంగా పెట్టి టికెట్ కూడా ఇచ్చానని అన్నారు. అయితే ఆమెను అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత పార్టీ గ్రాఫ్ పడిపోవడంతో అధినాయకత్వం మళ్లీ తనకే టికెట్ కేటాయించదన్నారు దువ్వాడ శ్రీనివాస్.

## శ్రీశైలం ప్రాజెక్టుకు తగ్గిన వరద

### పదిగేట్లు మాత్రమే ఎత్తి నీటి విడుదల

శ్రీశైలం,ఆగస్ట్10(సూర్యవాస్తవం):కృష్ణ ఎగువ పరివాహక ప్రాంతాల నుండి శ్రీశైలం జలాశయానికి నీటి ప్రవాహం తగ్గు ముఖం పట్టింది. శనివారం సాయంత్రం 6 గంటల సమయానికి ఎగువ జూరాల నుండి 1,84,786 క్యూసెక్కులు, తుంగభద్ర ద్వారా 17,916 క్యూసెక్కుల నీటితో కలిపి 2,02,702 క్యూసెక్కులు శ్రీశైలం జలాశయానికి చేరుతున్నాయి. శ్రీశైలం పది గేట్లను పది అడుగుల మేర ఎత్తి దిగువ నాగార్జునసాగర్‌కు 2,69,280 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం నీటి మట్టం 885 అడుగులకు గాను ప్రస్తుతం 882.50 అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 215 టిఎంసిలకుగాను ప్రస్తుతం 201.588 టిఎంసిలుగా నమోదయింది. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి హంద్రీనీవా సుజల స్రవంతికి (ముచ్చుమర్రి)కి 1203 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు 25,000 క్యూసెక్కులు, మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 1020 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఎడమ గట్టు భూగర్భజల విద్యుత్తు కేంద్రంలో 37,540 క్యూసెక్కుల నీటితో 16.649 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిని చేస్తున్నారు. 29,888 క్యూసెక్కుల నీటితో 15.215 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని చేస్తూ దిగువ సాగర్‌కు 67,428 క్యూసెక్కులు, పది గేట్లతో కలుపుకొని 2,36,708 క్యూసెక్కులన్నిటిని విడుదల చేస్తున్నారు.



## ఎస్సీ రిజర్వేషన్లను అన్ని రాష్ట్రాలు అమలుచేయాలి

మొదటిపేజీ తరువాయి..

వర్గీకరణ అమలుకు రాష్ట్రాలు త్వరగా ముందుకు రావాలి. వర్గీకరణ డిమాండ్ ఉన్న ప్రతి రాష్ట్రంలో ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలి. వెంటనే అమలయ్యేలా రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించాలని మోదీకి విజ్ఞప్తి చేశా. సుప్రీంకోర్టు ధర్మాసనంలోని ప్రతి జడ్జికీ పేరుపేరునా ధన్యవాదాలు. రాజ్యాంగం అమలులోకి వచ్చి 70 ఏళ్లు దాటినా రిజర్వేషన్ల ఫలాలు చాలా కుటుంబాలకు అందలేదు. వర్గీకరణకు మద్దతుగా నిలిచిన ప్రతి నాయకుడికీ కృతజ్ఞతలు చెబుతున్నా. ఎస్సీ వర్గీకరణను దక్షిణాదిలో నలుగురు సీఎంలు వెంటనే స్వాగతించారు. సుప్రీంకోర్టు తీర్పుపై ఏపీ సీఎం చంద్రబాబు ముందుగానే స్పందించి స్వాగతిస్తున్నట్లు చెప్పారని మందకృష్ణ మాదిగ అన్నారు. గతంలో నారా చంద్రబాబు నాయుడు ఎస్సీ వర్గీకరణ అమలు చేశారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ అన్నారు. శుక్రవారం జరిగిన టీడీపీ పోలిట్‌బ్యూరో సమావేశంలో కూడా ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారని సంతోషం వ్యక్తం చేశారు. ఆయనను కలిసి ధన్యవాదాలు తెలుపుతామన్నారు. విదేశీ పర్యటన నుంచి రాగానే సీఎం రేవంత్ రెడ్డిని కూడా కలిసి ధన్యవాదాలు చెబుతామని మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. కాగా మందకృష్ణ మాదిగ శుక్రవారం రాత్రి ఢిల్లీలో ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చిన నేపథ్యంలో వారిని కలిసారు. . దాదాపు 30 నిమిషాలపాటు ప్రధానితో భేటీ అయిన మందకృష్ణ ఎస్సీ వర్గీకరణకు సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే, మంద కృష్ణను ఆప్యాయంగా పలకరించి హత్తుకున్న ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ. తెలుగు రాష్ట్రాల్లో వర్గీకరణ త్వరితగతిన అమలు అయ్యేలా చూడాలని కోరారు. వర్గీకరణ అంశంపై కొందరు సుప్రీం కోర్టుకు వెళ్లే ఆలోచనలో ఉన్న నేపథ్యంలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణకు దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టుగ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విద్యాసంస్థల్లో ప్రవేశాలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన రిజర్వేషన్లను ఉప వర్గీకరణ చేసే అధికారం.. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుందని సుప్రీంకోర్టు తీర్పును వెలువరించింది.

# వయనాడ్ బాధితులకు అండ

మొదటిపేజీ తరువాయి..

వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నట్లు చెప్పారు. ఈ విపత్తులో వందలమంది తమ సర్వస్వాన్ని కోల్పోయారని అన్నారు. ప్రకృతి విలయంలో వాళ్ల కలలన్నీ కల్లలైపోయాయని అన్నారు. ఈ దుఃఖ సమయంలో మీకు అండగా ఉంటామని బాధితులకు చెప్పినట్లు తెలిపారు. 'ఈ రోజు నేను రిలీఫ్ క్యాంపులో బాధితులను స్వయంగా కలిశాను. గాయపడిన వారిని ఆసుపత్రిలో పరామర్శించాను. వారు చాలా కష్ట పరిస్థితిలో ఉన్నారు. వయనాడ్ విలయంలో చిక్కుకున్న వారికి అండగా నిలవాలి. అంతా కలిసి పనిచేస్తేనే బాధితులకు అ అండ దక్కగలదు. ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు అంతా కలిసి పనిచేయాలి. ఆప్తులను కోల్పోయిన వారికి అండగా నిలుద్దాం. రాష్ట్ర ప్రభుత్వం నష్టం అంచనాలు పంపిన వెంటనే ప్రకృతి విపత్తు సాయం అందిస్తాం అన్నారు. సంఘటన జరిగిన రోజు ఉదయం నేను సిఎం పినరయి విజయన్‌తో మాట్లాడాను. మేము సహాయం అందజేస్తామని, వీలైనంత త్వరగా సంఘటనా స్థలానికి చేరుకోవడానికి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చాను. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్. సైన్యం, పోలీసులు, వైద్యులు, ప్రతి ఒక్కరూ బాధితులకు వీలైనంత త్వరగా సహాయం చేయడానికి ప్రయత్నించారు. మృతుల కుటుంబీకులు ఒంటరిగా లేరని నేను హామీ ఇస్తున్నాను. వారికి మేము అండగా ఉన్నాం. కేరళ ప్రభుత్వంతోపాటు కేంద్ర ప్రభుత్వం వారికి సాయం చేస్తోందని తెలిపారు. వయనాడ్ కొండచరియల ప్రకృతి విపత్తును ప్రధాని మోదీ శనివారం హెలికాప్టర్ ద్వారా వీక్షించారు. ఢిల్లీ నుంచి విమానంలో కేరళకు బయలుదేరిన ప్రధాని.. ఉదయం 11 గంటలకు కన్నూర్ ఎయిర్ పోర్ట్ కు చేరుకున్నారు. ఆయన్ని కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ రిసీవ్ చేసుకున్నారు. అక్కడ నుంచి ఓ ప్రత్యేక విమానంలో వయనాడ్ బయలుదేరారు. కొండచరియలు సంభవించిన చూరల్ మలా, మండక్కై ప్రాంతాలలో ఏరియల్ సర్వే నిర్వహించారు. రెస్క్యూ ఆపరేషన్, సహాయక చర్యలు, పునరావాస కేంద్రాల గురించి అధికారులను ప్రధాని మోదీ అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధితులను కలుసుకోని మాట్లాడారు. వయనాడ్ ప్రాంతంలో ప్రకృతి విళయ తాండవం వల్ల జరిగిన నష్టాన్ని పరిశీలించారు. అధికారులతో కేంద్ర సహాయం గురించి చర్చించారు. ఆస్పత్రిలో క్షతగాత్రులను కలుసుకున్నారు. తర్వాత ప్రాణాలతో బయటపడిన వారిని కలిసి కొండచరియల విధ్వంసం గురించి తెలుసుకోనున్నారు. ఆయనతోపాటు కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్, ప్రభుత్వ అధికారులు ఉన్నారు.



## మహనీయుల జీవిత చరిత్రతో మ్యూజియం

మొదటిపేజీ తరువాయి..

అన్నారు. జాగర్లమూడిలో మాజీ ఎమ్మెల్యే కుప్పుస్వామి చౌదరి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఆయనకు ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య.. చీరాల రైల్వేస్టేషన్‌లో ఘనస్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం వెంకయ్య నాయుడు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు మాట్లాడుతూ.. నిస్వార్థ సేవా మూర్తి మాజీ ఎమ్మెల్యే కుప్పుస్వామి చౌదరి. దాతృత్వం, మానవత్వం, పాలన దక్షత, స్నేహ సౌరభం కలిగిన వ్యక్తి కుప్పుస్వామి. అన్నదానం కన్నా విద్యా దానం గొప్పదని చెప్పిన మహనీయుడు. అలాంటి వారి గురించి నేటి తరాలకు తెలియాలి. అమరావతిలో వారి చరిత్రలతో మ్యూజియం ఏర్పాటు చేయాలి. ప్రభుత్వాలు సైతం పల్లెల వైపు చూడని సమయంలో గ్రామాల అభివృద్ధికి వారు కృషి చేశారు. ÷ాజకీయ నాయకులకు సానుకూల దృక్పథం ఉండాలి. గత ప్రభుత్వంలో ఏపీ అసెంబ్లీలో బూతులు మాట్లాడారు. అలాంటి వారికి బూత్‌లో ఓట్లు వేయకుండా ప్రజలు బుద్ధి చెప్పారు. ప్రజా జీవితంలో ఉన్న నాయకులు హుందాగా వ్యవహరించాలి. రాజకీయాల్లో నేను ఒక్కటే మార్గం.. ఒక్కటే పార్టీలో ముందుకు సాగాను. పిల్లలందరూ అమ్మమ్మ, తాతయ్య, నాయనమ్మలతో గడిపే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. అలా చేస్తేనే వారికి మన సంప్రదాయాలు, విలువలు తెలుస్తాయి. నా చిన్నతనంలోనే మా అమ్మ గేదె పొడిచి చనిపోయారు. అమ్మమ్మ, తాతయ్యల వద్దే లోకజ్ఞానం నేర్చుకున్నా. తాతతో కలిసి పొలం పనులకు వెళ్లేవాడిని. వ్యవసాయం మన సంస్కృతి, సంప్రదాయం అని తెలిసేలా పిల్లలను తీర్చిదిద్దాలి' అని అన్నారు.

## బ్రెజిల్‌లో ఘోర విమాన ప్రమాదం

మొదటిపేజీ తరువాయి..

కూలిపోయింది. భారీ ఎత్తున మంటలు చెలరేగాయి. ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ అలుముకుంది. ఘటనా స్థలానికి పక్కనే ఇళ్లున్నాయి. వాటి వెనకాల చెట్ల పొదల్లో కూలిపోయింది. విమానంలో ఉన్న వాళ్లలో ఒక్కరు కూడా ప్రాణాలతో లేరని అధికారులు వెల్లడించారు. ఈ ప్రమాదంలో ఓ ఇల్లు ధ్వంసమైనట్లు తెలిపారు. స్థానికులకు ఎలాంటి గాయాలు కాలేదని స్పష్టం చేశారు. ఈ ఘటనపై బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాకియో లూలా డా సిల్వా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులకు సంతాపం తెలుపుతూ ఓ నిముషం మౌనం పాటించాలని పిలుపునిచ్చారు. ఈ ఘటనపై స్పందించింది. కాస్కావెల్ నుంచి టేకాఫ్ అయిన విమానం..విన్హెడో టౌన్‌లో ప్రమాదానికి గురైనట్లు వెల్లడించింది. అయితే...ఈ ప్రమాదానికి కారణమేంటన్నది మాత్రం ఇంకా తెలియలేదని వివరించింది. విచారణ జరుగుతోందని, త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని తెలిపింది. ప్రస్తుతానికి అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పుతోంది. ప్రమాదానికి ముందు చేసిన ట్రాకింగ్ ప్రకారం విమానం 4,100 అడుగుల ఎత్తులో ఉంది. సావోపాలోకి వచ్చే సమయంలోనే ఇలా కుప్ప కూలిపోయింది. ప్రత్యక్ష సాక్ష్యులు ఈ ప్రమాదాన్ని తలుచుకుని వణికిపోతున్నారు. కొంచెంలో పెను ప్రమాదం తప్పిందని, లేకపోతే విమానం నేరుగా తమ ఇళ్లపై పడిపోయేదని వివరిస్తున్నారు. ఈ శబ్దం వినగానే ఒక్కసారిగా గుండె ఆగిపోయినట్టుగా అనిపించిందని అంటున్నారు. ఈ శబ్దం విన్న వెంటనే చాలా మంది బయటకు పరిగెత్తుకుంటూ వచ్చారు. ఇళ్ల వెనకాలే పొదల్లో విమానం పడిపోవడాన్ని చూసి షాక్ అయ్యారు.



## కేంద్ర క్యాబినెట్ కార్యదర్శిగా టీవీ సోమనాథన్

మొదటిపేజీ తరువాయి..

'ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ)'గా విధులు నిర్వర్తిస్తారని కేంద్ర క్యాబినెట్ నియామకాల కమిటీ జారీ చేసిన నోటిఫికేషన్‌లో తెలిపింది. కేంద్ర ఆర్థికశాఖలో 2019 నుంచి వ్యయ విభాగం కార్యదర్శిగా కొనసాగుతున్న టీవీ సోమనాథన్.. 2021లో ఆర్థికశాఖ కార్యదర్శిగా నియమితులయ్యారు. నాటి నుంచి బ్జడెట్ తయారీలో కీలక పాత్ర పోషిస్తున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సర బ్జడెట్‌లో సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామ్య పక్షాల డిమాండ్లలో సమతుల్యత పాటిస్తూనే బ్జడెట్‌లో ఆర్థిక క్రమశిక్షణకు పెద్ద పీట వేశారు. 1987 బ్యాచ్ తమిళనాడు క్యాడర్ ఐఏఎస్ అధికారి అయిన సోమనాథన్ 2015 ఏప్రిల్ నుంచి 2017 ఆగస్టు వరకూ ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ)లో పని చేశారు. గతంలో కార్పొరేట్ వ్యవహారాల శాఖ సంయుక్త కార్యదర్శిగా, ప్రపంచ బ్యాంకు డైరెక్టర్ గానూ పని చేశారు.

# ఎపిలో రెడ్‌బుక్ రాజ్యమేలుతోంది

మొదటిపేజీ తరువాయి..

ఇచ్చిన హామీల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇది పచ్చి మోసం కాదా? చంద్రబాబూ? ప్రమాణస్వీకారం చేసిన తొలి క్షణంనుంచే మీరు ప్లేటు ఫిరాయించారు. ఖజానా ఖాళీ అయిపోయిందంటూ తప్పుడు శ్వేతపత్రాలు జారీచేసి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. అప్పులకు వడ్డీలు కట్టాలి, అవి కట్టడానికే డబ్బుల్లేవు అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతూ లేని అప్పులు ఉన్నట్టుగా, వాటికి లేని వడ్డీలు కడుతున్నట్టుగా పదే పదే మాట్లాడి ప్రజలను మాయచేసే ప్రయత్నం చేస్తున్నారు. తల్లికి వందనం కింద స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15వేలు ఇవ్వలేదు, రైతు భరోసా కింద ప్రతి రైతుకు రావాల్సిన రూ.20వేలు రాలేదు, ఫీజు రియింబర్స్‌మెంట్ కింద రెండు త్రైమాసికాల డబ్బులు పెండింగ్, వసతి దీవెనా లేదు, సున్నా వడ్డీ లేనే లేదు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి అక్క చెల్లెమ్మకూడా నెల రూ.1500 చొప్పున ఏడాదికి రూ.18వేలు జాడే లేదు. ప్రతి ఇంటికీ ఉద్యోగం లేదా రూ. 3వేల నిరుద్యోగ భృతి ఊసే లేదు. చివరకు రూ.20వేలు ఇస్తానన్న మత్స్యకార భరోసా అడ్రస్సే లేదు. పేదలకు అత్యవసరమైన ఆరోగ్యశ్రీ చెల్లింపులు రూ.1600 కోట్లు పెండింగ్. ఇంటికి వచ్చి పెన్షన్ ఇచ్చే విధానం ఆగిపోయింది.

ఇంటికి వచ్చే రేషన్ నిలిచిపోయింది. వాలంటీర్లను మోసం చేశారు, విత్తనాలకోసం రైతులు క్యూలో నిలబడే పరిస్థితిని తీసుకువచ్చారు. పంటలకు ఉచిత బీమా ఎగరగొట్టారు. బడుల్లో టోఫెల్ పీరియడ్ రద్దుచేశారు. విద్యా కానుక కిట్లు పంపిణీ అరకొరగానే, అదికూడా అస్తవ్యస్తం. మధ్యాహ్న భోజనం పథకంలో రోజుకో మెనూ పద్ధతి పోయింది. ఇంగ్లిషు మీడియం గాడితప్పింది, బడుల్లో, గ్రామాల్లో పరిశుభ్రత పడకేసింది. లా అండర్ ఆర్డర్ పూర్తిగా గాడితప్పింది. రెడ్‌బుక్ రాజ్యమేలుతోంది. రాష్ట్రం మూడు హత్యలు, ఆరు విధ్వంసాలుగా వర్ధిల్లుతోంది. మహిళలకు రక్షణే లేదు. దిశయాప్ అటకెక్కింది. రెండున్నర నెలల్లోనే ప్రజలను ఇంతలా దగా చేస్తారా చంద్రబాబూ?. ఎన్నికలకు ముందు రూ.14 లక్షల కోట్ల మేర రాష్ట్రం అప్పులపాలైందని, శ్రీలంక అయిపోయిందని, ఆర్థిక విధ్వంసం జరిగిందని మీరు ఊరూరా విష ప్రచారం చేశారు. అయినా సరే అపార అనుభవం ఉంది, నన్ను మించినవారు లేరు, అమలు చేసే బాధ్యత నాదీ అని, సూపర్ సిక్స్ అంటూ సూపర్ టెన్ అంటూ చాలా చాలా వాగ్దానాలు చేశారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక రాష్ట్రం అప్పులు రూ.10 లక్షల కోట్లు అంటున్నారు. అదికూడా అసత్యమే అయినా సాక్షాత్తూ గవర్నర్‌గారితో అసెంబ్లీలో ఇలాంటి అనేక అవాస్తవాలను చెప్పించారు. నిజాలు ఏంటంటే.. రాష్ట్ర ప్రభుత్వం రుణాలు, విద్యుత్ కంపెనీల రుణాలతో కలిపి, గ్యారంటీ రుణాలు, నాన్ గ్యారంటీ రుణాలు ఇవన్నీ జూన్ 2024నాటికి ఉన్న మొత్తం అప్పులు అక్షరాల రూ.7,48,612కోట్లు. ఇందులో 2019లో మీరు దిగిపోయేనాటికి ఉన్న అప్పులు రూ.4,08,170 కోట్లు. దీనికిపైన ఉన్నవి మాత్రమే మా హయంలో చేసిన అప్పులు. మీ హయాంలో అప్పుల వృద్ధిరేటు (సీఏజీఆర్) 21.63శాతం అయితే, కోవిడ్ కారణంగా ఆర్థిక వ్యవస్థలో మహా సంక్షోభం వచ్చినా, మా హయాంలో అది కేవలం 12.9 శాతం. ఈ వాస్తవాలన్నింటినీ కూడా గవర్నర్‌గారికి లేఖ రూపంలో తెలియజేశాం. అందులో కేంద్ర ప్రభుత్వ ప్రకటనలు, ఆర్‌బీఐ నివేదికలు, కాగ్ లెక్కలలాంటి ఆధారాలతో కూడిన సమగ్ర వివరాలు ఉన్నాయి. జాగ్రత్తగా చదువుకోండి చంద్రబాబు. ఇకనైనా రాష్ట్రంలో హత్యలు, విధ్వంసాలను ఆపేసి, అబద్ధపు లెక్కలతో ప్రజలను మోసం చేయడం మాని, సూపర్ సిక్స్ సహా ఇచ్చిన హామీలను తూ.చా తప్పక అమలు చేయండి. ఇప్పటికే దిగజారిన పాలనను గాడిలో పెట్టండి' అంటూ హితవు పలికారు.



## సోమశిల పనులు అర్ధాంతరంగా నిలిపివేత

### గత వైసిపి ప్రభుత్వ నిర్వాకంతో జిల్లాకు నష్టం
### మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడి

నెల్లూరు,ఆగస్ట్10(సూర్యవాస్తవం): సోమశిల ప్రాజెక్ట్ హైలెవల్ కెనాల్ పనులను జగన్ ప్రభుత్వం ఎందుకు నిలిపివేసిందని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రశ్నించారు. కాంట్రాక్టర్ ప్రాజెక్ట్ పనులు పూర్తి చేయకుండా పారిపోయారని ఆరోపించారు. శనివారం నాడు జెడ్పీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం అనంతరం మీడియాతో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. జగన్ ప్రభుత్వం సోమశిల పనులు చేయలేదు కాబట్టే, తాను ఆ పార్టీ నుంచి బయటకు వచ్చానని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వంలో చాలా పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయని అన్నారు.ఎమ్మెల్యేలతో కలసి స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు ముందుకు వస్తే, ఆ పనులను పూర్తి చేయడానికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. నెల్లూరు జిల్లాలో 80 శాతం వ్యవసాయ ఆధారిత ప్రాంతమేనని వెల్లడించారు. సోమశిలకు వరద వచ్చి సోమేశ్వర ఆలయం కొట్టుకుపోతే, వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఉద్ఘాటించారు.అభివృద్ధి, పనులు చేసిన వారిని ప్రజలు మరచిపోరని అన్నారు. అభివృద్ధి చేస్తే ప్రజలు పట్టం కడతారని అనడానికి తానే నిదర్శనమని గుర్తుచేశారు. పెన్షన్ల పంపిణీ వలంటరీ వ్యవస్థ ఉంటేనే సాధ్యమవుతుందని జగన్ ప్రభుత్వంలో చెప్పారని.. కానీ కూటమి ప్రభుత్వంలో వలంటరీ వ్యవస్థతో పనిలేకుండానే ఫించన్లు పంపిణీ చేసి చూపించామని గుర్తుచేశారు. సినరీస్ సెస్‌ను బలోపేతం చేసి స్థానిక సంస్థలకు నిధులు వచ్చేలా చంద్రబాబు కృషి చేస్తున్నారని అన్నారు. స్థానిక సంస్థలను బలోపేతం చేయడానికి చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నారని వివరించారు.వచ్చే ఐఏబీ సమావేశంలోపు పూర్తి స్థాయిలో ఆయకట్టు వివరాలు సేకరిస్తామని తెలిపారు. పోలవరాన్ని త్వరలో పూర్తి చేసి ఏపీని సస్యశ్యామలం చేసేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో అన్నమయ్య డ్యామ్, సోమశిల డ్యామ్ కింది భాగాలు కొట్టుకుపోతే దిక్కులేకుండా పోయిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థలకు ఇంకా రెండున్నారేళ్లు సమయం ఉందని... రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వం సోమశిల హైలెవల్ కెనాల్ పనులను నిలిపివేసిందని మంత్రి నారాయణ (ఓతినితిబబివతీ ఔజీతీజీఎజీనిజీ) తెలిపారు. శనివారం నాడు జెడ్పీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం అనంతరం మీడియాతో మంత్రి నారాయణ మాట్లాడారు. జిల్లాలో అన్ని సమస్యలపై చర్చించామని అన్నారు. 1950 ఆయకట్టు ఆధారంగానే నీటి విడుదల జరుగుతుందని తెలిపారు. ఈ సమస్యను త్వరగా పరిష్కరిస్తామని చెప్పారు. జిల్లాలో స్టిల్ తీయకుండానే బిల్లులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయని.. వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని మంత్రి నారాయణ పేర్కొన్నారు.కండలేరు ఆయకట్టు 2.20 లక్షల ఎకరాలు 2019 వరకు ఉండగా, గత ఐదేళ్లలో ఒక్క ఎకరానికి కూడా ఆయకట్టు పెరగలేదని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలిపారు.

Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in

# ఎడిటోరియల్ న్యూస్



Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in

# సంపాదకీయం

## బడ్జెట్ సమావేశాలు ముగించారు !

కొత్త పార్లమెంట్ భవనం అందుబాటులోకి వచ్చి ఏడాది కావస్తోంది. కొత్త భవనంలో పాత విధానాలతోనే కార్యక్రమాలు సాగుతున్నాయి. సరైన చర్చలకు ఆస్కారం కలగడం లేదు. బడ్జెట్ సమావేశాలు కూడా యథాలాపంగా సాగాయి. పెద్దగా చర్చలు సాగలేదు. బడ్జెట్ క్రతువును ముగించేలా నిర్ణయాలు జరిగాయి. మమ అనిపించి పార్లమెంట్ సమావేశాలు ముగించారు. ఎప్పుడూ నాలుగైదు రోజులు ముందే సమావేశాలు ముగుస్తున్నాయి. దేశం ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలు వారికి కానరావడం లేదు. బంగ్లాదేశ్‌లో ఊచకోతలపైనా చర్చించలేదు. కనీసం చర్చించివుంటే..ప్రపంచం దృష్టికి దాష్టీకాలను తీసుకుని వచ్చే అవకాశం ఉండేది. ఇకపోతే ప్రధాన సమస్యలపైనా చర్చ చేయలేదు. సభ్యులు లేవనెత్తిన సమస్యలను ఎప్పటిలాగే తిరస్కరించారు. ఓ రకంగా చెప్పాలంటే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టాక చరిత్ర సృష్టించే నిర్ణయాలు తీసుకుంటుందని ఆశించారు. కానీ అలాంటి దేమీ కనిపించలేదు. జిఎస్టీపై ప్రశ్నలు లేవనెత్తితే ..అది ప్రజల సమస్యగా భావించి చర్చించాల్సిన ప్రభుత్వం విపక్షాలను ఎండగట్టేలా సమాధనం చెప్పిన తీరు జాతి మరువదు. మూడోదఫాలో మరింత సమర్థంగా,మరింత ఉత్సాహంగా పనిచేస్తానన్న మోడీ వచనాలు ఎక్కడా ప్రతిఫలించలేదు. దేశంలో అభివృద్ధి లక్ష్యంగా కార్యక్రమాలు సాగుతున్నాయన్న నమ్మకం కలిగించలేకపోయారు. ప్రజల సమస్యలను విస్తృతంగా చర్చించాలి. ఇందుకు విపక్షాలకు అవకాశం ఇవ్వడం ద్వారా సమస్యలప చర్చ జరిపి ఉంటే బాగుండేది. విపక్షాలు కూడా ఉపన్యాసాలకు, రాజకీయ వ్యాఖ్యలకు అలవాటు పడ్డారు. అందువల్ల సమస్యలను గుర్తించ చర్చించాలన్న ఆలోచన లేకుండా సాగుతున్నారు. ఇకపోతే దేశహితం కోసం మరిన్ని కఠిన చట్టాలను రూపొందించాలి. చర్చల్లో ప్రజలను భాగస్వామ్యం చేయాలి. ఎన్నికల్లో అక్రమాలు నిరోధించేలా నిర్ణయాలు రావాలి. అయితే బడ్జెట్ సమావేశాల్లో మరిన్ని నిర్ణయాల కోసం ప్రజలు ఎదురు చూసినా ఫలితం దక్కలేదు. తిరంగా యాత్రను ప్రారంభించారు. ప్రజల్లో దేశభక్తి లేక కాదు. ప్రజల్లో ఉన్నంతగా నేతల్లోనూ భక్తి రావాలి. ప్రజల జీవన ప్రమాణాలు పడిపోకుండా చూడాలి. వారు అప్పుల్లో కూరుకుపోకుండా బతికేలా నిర్ణయాలు ఉండాలి. కానీ అలాంటి ప్రయత్నాలు కానరావడం లేదు. అలాగే పార్లమెంట్ సీట్ల సంఖ్యను పెంచడం... గవర్నర్ వ్యవస్థను రద్దు చేయడం కూడా అత్యవశ్యకమే. గవర్నర్ వ్యవస్థ ఈ మధ్యకాలంలో రాజకీయాంగా దుమారం రేపుతోంది. అలాగే ఖజానాపైనా భారీగా భారం పడుతోంది. గవర్నర్ వ్యవస్థలేని రాజ్యాలను నడుపుకోవాల్సి ఉంది. అలాగే ఎప్పుడో 50 ఏళ్ల క్రితం ఉన్న జనాభాకు అనుగుణంగా పార్లమెంట్ సీట్లు ఉన్నాయి. 542 సీట్లతోనే కొనసాగిస్తున్నాం. ఈ క్రమంలో లోక్‌సభ, రాజ్యసభలతో పాటు, అసెంబ్లీల్లో సీట్ల సంఖ్య పెరగాల్సి ఉంది. వాటిని ప్రస్తుత జనాభాకు అనుగుణంగా పెంచు కోవాల్సిందే. కనీసం వేయి సీట్లు ఉంటేనే ఇప్పుడున్న జనాభాకు తగిన ప్రాతినిధ్యం దక్కదు.140కోట్లు ఉన్న జనాభాకు అనగుణంగా పార్లమెంట్ సీట్లను పెంచుకోవాలి. అలాగే దేశానికి అనవసర వ్యవస్థగా ఉన్న గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలి. పంచాయితీల్లో ఎంపిటిసిలు,జడ్పీటీసిల వ్యవస్థను ఎత్తేయాలి. పార్లమెంట్, అసెంబ్లీ సీట్లను దేశ, రాష్ట్రాల జనాభాకు అనుగుణంగా పునర్వ్యవస్థీకరణ జరగాలి. ఒకేదేశం, ఒకే చట్టం కోసం కసరత్తు జరుగుతున్న వేళ ఇలాంటి కీలక నిర్ణయాలు కూడా జరగాలి. ఇలాంటి అంశాలపై పార్లమెంటులో చర్చించివుంటే బాగుండేది. ఇకపోతే ఎపిలో కాకినాడను ఆనుకుని ఉన్న యానాంను పాండిచ్చేరిలో కాకుండా ఎపిలో విలీనం చేయడమే మంచిది. దీంతో ప్రజలకు కూడా పాలనా కేంద్రం దగ్గర కాగలదు. దీనిపై పాలకులు ఎందుకనో డిమాండ్ చేయడం లేదు. ఇలాంటి అసమానతలను చర్చిస్తే మంచిది. ఇందుకోసం పార్లమెంటులో చర్చించాలి. వ్యవస్థల ద్వారా మేలు జరగాలి. ఉపయోగం కలగాలి. అంతేకానీ గుదిబండగా మారరాదు. అలాగే ఆర్థిక భారంగా కూడా మారరాదు. దేశంలో ప్రస్తుత రాజకీయ వ్యవస్థ వల్ల దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పటిష్టమైన ఎన్నికల విధానం కూడా అవసరం ఉంది. ఇవన్నీ చర్చించడం ద్వారా నవ భారతానికి శ్రీకారం చుట్టాలి. స్వాతంత్ర్యోత్సవాలు జరుపుకుంటున్న వేళ ఇవన్నీ చర్చిస్తే మంచింది. అలాగే మహిళల ప్రాతనిధ్యం పెంచే మహిళా బిల్లును కూడా ఆమోదింప చేయడం, కోల్డ్‌స్టోరేజీకి పంపడం జరిగింది. మొన్నటి ఎన్నికల నుంచే దీనిని అమలు చేసివుంటే మహిళలకు న్యాయం జరిగివుండేది. 370 ఆర్టికల్‌ను రద్ద చేయడం లాంటి సాహసోపేత నిర్ణయాలు తీసుకున్న మోడీ ప్రభుత్వానికి ఈ నిర్ణయాలు ఏమంత పెద్దవి కాక పోవచ్చు. గవర్నర్ వ్యవస్థను రద్దు చేయడం ద్వారా ఆదర్శ రాజకీయాలకు శ్రీకారం చుట్టాలి. ఇకపోతే పార్లమెంట్ వర్షకాల సమావేశాలు శుక్రవారంతోముగిశాయి. లోక్ సభ వాయిదా పడిన వెంటనే స్పీకర్ ఓం బిర్లా తేనిటి విందు ఇచ్చారు. టీ పార్టీకి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, విపక్ష నేత రాహుల్ గాంధీ, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ సా, కిరణ్ రిజిజు, రామ్మోహన్ నాయుడు, పీయూష్ గోయల్, చిరాగ్ పాశ్వాన్, ఎంపీలు సుదీప్ బందోపాధ్యాయ, కనిమోళి తదితరులు హాజరయ్యారు. ఆ ఫొటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. స్పీకర్ తేనిటి విందుకు హాజరైన ప్రధాని మోదీ, రాహుల్ గాంధీ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఎప్పుడూ ఉప్పు, నిప్పుగా ఉండే వీరు కలిసి ఫొటోలకు ఫోజిచ్చారు. వాస్తవానికి లోక్ సభ ఆగస్ట్ 12వ తేదీన వాయిదా పడాలి. సభా వ్యవహారాలు పూర్తయినందున సమావేశాలు ముగించామని స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. ఈసారి సభకు ఎక్కువ మంది సభ్యులు హాజరయ్యారని వివరించారు. సమావేశంలో బడ్జెట్ బిల్లుకు ఆమోదం లభించింది. జమ్ముకశ్మీర్ విభజన బిల్లు, ఇండియన్ ఎయిర్ క్రాఫ్ట్ బిల్లులకు కూడా సభ ఆమోదం లభించింది. వక్ఫ్ బిల్లుపై జెపిసిని వేశారు. ఇంతకు మించి ఈ సమావేశాల్లో పెద్దగా ప్రయోజనం చేకూర్చే అంశాలు లేవు.

## ప్రమాదానికి గురైన టిఫిన్ సెంటర్, కూల్ డ్రింక్ షాపులను పరిశీలించిన ఎమ్మెల్యే,

అన్నమయ్య జిల్లా ( రైల్వే కోడూరు సూర్య వాస్తవం)
శుక్రవారం రాత్రి రైల్వే కోడూరు పట్టణంలో ప్రమాదవశాత్తు టిఫిన్ సెంటర్, కూల్ డ్రింక్ షాపులకు షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగింది.ఈ ప్రమాదానికి గురైన వారిలో శవాకుల సిద్దయ్య టిఫిన్ సెంటర్,చంగయ్య కూల్ డ్రింక్ షాప్, సంజీవరెడ్డి కూల్ డ్రింక్ షాప్ లు షార్ట్ సర్క్యూట్ వల్ల వీరికి నష్టం వాటిల్లింది.ఆ షాపులలో సిలిండర్లు, ప్రజలు ఫ్రిడ్జ్ లు,గైండర్లు నిత్యావసర వస్తువులు తదితర సామాన్లు కాలిపోయాయి.వారికి దాదాపు 1.50 లక్షల రూపాయలు నష్టమైనట్లు వారు తెలిపారు.ఈ విషయం తెలుసుకున్న స్థానిక శాసనసభ్యులు స్థానిక ఎమ్మెల్యే అరవ శ్రీధర్ సంఘటన స్థలానికి చేరుకుని చేరుకొని, పరిస్థితులును పరిశీలించి సంబంధిత అధికారులు మాట్లాడి తగిన విధంగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, పిఏ రెడ్డయ్య, జనసేన నాయకులు తాతంశెట్టి నాగేంద్ర, పి సి ఎన్ బ్రదర్స్, మణి,వరికూటి నాగరాజు , గిద్దలూరు బాను,అరవ నాని, అంకిపల్లి మధు,ఎన్ రామయ్య, షేక్ గౌస్ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## సచివాలయ ఉద్యో గులకు సంపూర్ణ సహకారం: రాష్ట్ర కార్యవర్గ భేటీలో విద్యాసాగర్..

సూర్యవాస్తవం, ఎన్టీఆర్ జిల్లా ప్రత్యేక ప్రతినిధి:-
రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామ వార్డు సచివాలయ దివ్యాంగ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఎ.పి.యన్.జి.ఓస్ అసోసియేషన్ అండగా ఉంటుందని పశ్చిమ కృష్ణా జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ తెలిపారు. దివ్యాంగ ఉద్యోగులను 2023లో విడుదల చేసిన జి.ఓ ప్రకారం ఫీల్డ్ విధుల నుండి విముక్తి కల్పించేలా కృషి చేస్తామని





ఎం.డి.జాని పాషా రాష్ట్ర అధ్యక్షుడు ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ తెలిపారు.
ఎ.పి.యన్.జి.జి.ఓస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యాలయంలో దివ్యాంగ ఉద్యోగుల ప్రతినిధి పి.అశ్వర్థప్ప ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన గ్రామ వార్డు సచివాలయ దివ్యాంగ ఉద్యోగుల రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిధులుగా హాజరైన ఎ.పి.యన్.జి.జి.ఓస్ అసోసియేషన్ పశ్చిమ కృష్ణా జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ,దివ్యాంగ ఉద్యోగులకు కన్వేయన్స్ అలవెన్సు పెంపుదలకు సంభందించి ఎ.పి.యన్.జి.జి.ఓస్ అసోసియేషన్ తరపున పూర్తి స్థాయిలో కృషి చేస్తామని,దివ్యాంగ ఉద్యోగుల సంక్షేమం కోసం ఉద్యోగులు కోరిన విధంగా సంక్షేమ నిధి గురించి ప్రభుత్వం ద్రుష్టికి తీసుకొని వెళ్తామని,అలాగే సంఘం యొక్క ఆవశ్యకత గురించి వివరించారు. మరో ముఖ్య అతిధిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.జాని పాషా మాట్లాడుతూ గ్రామ వార్డు సచివాలయ దివ్యాంగ ఉద్యోగుల హక్కులను 2016 చట్ట ప్రకారం పరిరక్షణ కల్పించడం కోసం కృషి చేస్తామని తెలిపారు.అదేవిధంగా క్షేత్ర స్థాయిలో అవుట్ డోర్ విధులనుండి దివ్యాంగ ఉద్యోగులను విముక్తి కల్పించి కార్యాలయాలలో అంతర్గత విధులలో మాత్రమే నియమించేలా 2023 ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం కృషి చేస్తామని,అలాగే రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థలో ఉద్యోగులకు మేలు చేసేలా చేపట్టిన మార్పులను స్వాగతిస్తున్నామని,గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులను వివిధ శాఖలలో ఉన్న ఖాళీలలో పదోన్నతులు కల్పించి అర్హత ప్రకారం అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం ఆలోచన చేయాలని సైతం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షులు పి.అశ్వర్థ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.కాశీ విశ్వనాధ్,రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.రామాంజనేయులు,అదనపు కార్యదర్శి ప్రేమ్ సుధాకర్ గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.రోజా ప్రకాష్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యస్.కె.సుభాని,యన్.రాజేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## వక్ఫ్ సవరణ బిల్లును జె.పి.సి కు పంపించిన సీఎం నారా చంద్రబాబు

### మహ్మద్ ఫతావుల్లాహ టీడీపీ మైనార్టీ నేత,
### -ఎంపి కేశినేని శివనాథ్, ఎంపి హరీష్ మాధూర్ కు కృతజ్ఞతలు

సూర్యవాస్తవం,విజయవాడ, ప్రతినిధి:-:
ఎన్డీయే కూటమిలో తెలుగు దేశం పార్టీ వున్నా కూడా ముస్లిం సమాజానికి నష్టం కలిగించే, వక్ఫ్ బోర్డ్ ను బలహీన పరిచి నిర్వీర్యం చేసే వక్ఫ్ బిల్లు ను జె.పి.సి (పార్లమెంటరీ జాయింట్ కమిటీ) కు పంపించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేశారని టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఫతావుల్లాహ్ తెలిపారు. వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లు-2024 లోని దాదాపు 44 సెక్షన్ల పై అభ్యంతరం వ్యక్తం చేస్తూ..వాటిపై పార్లమెంట్ లో చర్చ జరగాలని కోరుతూ గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్



కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహ్మద్ ఫతావుల్లాహ్ మాట్లాడుతూ ఇటువంటి ప్రమాదకరమైన బిల్లును అడ్డుకోవాలని పార్లమెంట్ లో విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), అమలాపురం ఎంపి హరీష్ మాధూరు ను జమాతే ఇస్లామి సంస్థ పెద్దల బృందంతో కలిసి వక్ఫ్ బోర్డ్ బిల్లు అమల్లోకి వస్తే జరిగే నష్టాలను వాళ్ళ దృష్టికి తీసుకొని వెళ్లడం జరిగిందన్నారు. ఆ ఇద్దరు ఎంపీలు తెలుగుదేశం పార్టీ రీసెర్చ్ కమిటీ సభ్యులతో మాట్లాడి ఈ విషయాన్ని సీఎం నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచన మేరకు ఈ బిల్లును జాయింట్ పార్లమెంట్ కమిటీ కి పంపించాలని పార్లమెంట్ లో మాట్లాడిన టిడిపి పార్లమెంట్ సభ్యులకి కి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో పార్లమెంట్ లో జగన్ నాయకత్వంలో వైసిపి ఎంపిలు 22 మంది ఎన్.ఆర్.సి కి పూర్తి గా మద్దతు తెలిపారు. వక్ఫ్ బిల్లు విషయంలో మాత్రం జగన్ మోహన్ రెడ్డి మొసలి కన్నీరు కార్చుతున్నాడని ఎద్దేవా చేశారు. ఎన్.డి.ఎ కూటమిలో తెలుగుదేశం పార్టీ వున్నా కూడా వక్ఫ్ బిల్లు పై జె.పి.సి (పార్లమెంటరీ జాయింట్ కమిటీ) కు పంపించిన ఘనత టిడిపి సొంతమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముస్లిం సమాజానికి ఎప్పుడు అండగా వుంటారని, అన్యాయం జరుగుతుంటే సహించరని తెలిపారు.

**అమల్లోకి వస్తే వక్ఫ్ బోర్డ్ నిర్వీర్యం**

భారతదేశంలో అత్యధిక ఆస్తులు కలిగిన మూడు సంస్థల్లో వక్ఫ్ బోర్డు ఒకటన్నారు. ఏ ప్రజాస్వామ్య వ్యవస్థలోనైనా సవరణ చేస్తే అది ఆ సంస్థకు బలం చేకూరే విధంగా ఉండాలే తప్ప బలహీనపరిచే విధంగా ఉండకూడదన్నారు. వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లు అమల్లోకి వస్తే భారతదేశపు వక్ఫ్ ఆస్తులకు రక్షణ లేకుండా పోతుందని, వక్ఫ్ బోర్డు నిర్వీర్యంగా మారుతుందన్నారు.
అదే విధంగా వక్ఫ్ బోర్డ్ ఆస్తుల గురించి సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చే వక్ఫ్ సర్వే కమీషన్ ను రద్దు చేసి ఆ అధికారాలు కలెక్టర్లకు అప్పచెప్పటం జరుగుతుందన్నారు. కలెక్టర్లకు ఆ అధికారం అప్పగిస్తే నిష్పక్షపాతంగా సర్వే జరగదని వక్ఫ్ ఆస్తులపై కలెక్టర్ రాజ్ అవుతుందని..అందుకే ఆ సెక్షన్ ను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. వక్ఫ్ సర్వే కమీషన్ కొనసాగించాల్సిందిగా డిమాండ్ చేశారు.
గతంలో సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్ లో ఇద్దరు ముస్లిం లోక్ సభ సభ్యులు, రాజ్య సభ సభ్యులు గానీ వుండేవారు. ఇప్పుడు ఇద్దరు మహిళలను సభ్యులుగా పెట్టడం పై అభ్యంతరం లేకపోయినా ..ఆ మహిళలు ముస్లిమ్స్ అయి వుండాలని కోరారు. అదే విదంగా రాష్ట్ర వక్ఫ్ బోర్డు కమిటీ సభ్యుల్లో కూడా ఇద్దరు ముస్లిమేతర సభ్యులు ఉండాలని ఒక సెక్షన్ పెట్టడం జరిగింది. దాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. స్టేట్ వక్ఫ్ బోర్డు సీఈవో కి డిప్యూటీ సెక్రటరీ లెవెల్ ఉండాలి..ఆ అధికారి ముస్లిం అయి ఉండాలి. కానీ కొత్త సవరణ చట్టంలో ఈ పదవికి సంబంధించి ముస్లిం అనే పదాన్ని ఎత్తివేయడం జరిగింది. ఈ సెక్షన్ పై అభ్యంతరం తెలిపారు. రాష్ట్రాల వక్ఫ్ బోర్డ్ కమిటీ లకు వక్ఫ్ ఆస్తుల యాజమాన్య హక్కు నిర్ణయించే అధికారాన్ని కూడా తీసివేయటాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా వక్ఫ్ బోర్డుపై రాష్ట్ర ప్రభుత్వాలకు ఉన్న అధికారాలను కూడా తొలగించడం జరిగిందని చెప్పారు. భారతదేశ చరిత్రలో వక్ఫ్ బోర్డు ప్రైవేటు వ్యక్తుల ఆస్తులు గానీ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆస్తిని గాని, తమ ఆస్తిగా ప్రకటించిన దాఖలాలు ఎక్కడ కూడా లేవని, కానీ వక్ఫ్ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేసిన కేసులు వేల సంఖ్యలో ఉన్నాయని తెలిపారు. అలాగే కొన్నిచోట్ల ప్రభుత్వాలు కూడా వక్ఫ్ బోర్డ్ స్థలాలను తమ సొంత స్థలంగా ప్రకటించుకున్న దాఖలాలు ఉన్నాయన్నారు.

**మత పెద్దలతో చర్చ జరపాలి**

ఈ ఇలాంటి పరిస్థితుల్లో వక్ఫ్ బోర్డ్ సవరణ చట్టాన్ని మరింత బలం చేకూరే విధంగా సవరణలు చేయాలే తప్ప బలహీనపరిచే విధంగా వుండకూడదని భావిస్తున్నట్లు ప్రకటించారు. వక్ఫ్ సవరణ బిల్లు పై జాయింట్ పార్లమెంటరీ కమిటీ ముస్లిం మేధావులతో, ముస్లిం జాతీయ అతిపెద్ద సంస్థలైన ముస్లిం పర్సనల్ లా బోర్డు, జమాతే ఇస్లామి హింద్, అలాగే తబ్లీగి జమాత్ , అహ్లె హదీస్, దేవ్ బంద్ సంస్థ, బరేల్వి సంస్థల సలహాలు సూచనలు కూడా తీసుకోవాలని మహ్మద్ ఫతావుల్లాహ్ డిమాండ్ చేశారు. ఈ మీడియా సమా వేశంలో మౌలానా అబ్దుల్ సత్తార్, మౌలానా నసీమ్ అహ్మద్, మౌలానా అమీరుల్ హఖ్, ఎమ్.డి.నూరుద్దీన్, షేక్ ఆషా, అబ్దుల్ కరీమ్, ఎమ్.డి ఇర్ఫాన్, మహ్మద్ జాహేద్, తమీమ్ అన్సార్, బడేషా, ఫిరోజ్, రియాజ్, సలార్, వాజీద్ ఖాన్, గౌస్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్

తిరుపతి సూర్యవాస్తవం ప్రతినిధి
తిరుపతి పార్లమెంటు పరిధిలోని ప్రజల సమస్యలు పరిష్కారానికి ప్రజా దర్బార్ నిర్వహించి, తద్వారా వారి సమస్యలను పరిశీలిస్తున్నామని టిడిపి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్ తెలిపారు. ఈ మేరకు శనివారం రేణిగుంట రోడ్డు లోని టిడిపి పార్లమెంటు కార్యాలయంలో ప్రజల నుంచి వినతల స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్లమెంటు కమిటీ నేతలు పాల్గొని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, పరిష్కారం అయ్యే వాటిని పరిష్కరించి, మిగిలిన వాటిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ముఖ్యంగా శెట్టిపల్లి ప్రజల భూములు సమస్యలను ఆ ప్రాంతం ప్రజలు నాయకులు నరసింహ యాదవ్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి గతంలో తాను గూడా చైర్మన్ గా ఉన్నప్పుడు జీవో వచ్చిందని, ఆ సమస్యను అప్పటి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి ఎమ్మెల్యే ద్వారా తుడా పరిధిలో మీ సమస్యను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.
ఊట్ల సురేంద్ర నాయుడు మాట్లాడుతూ గత 70 ఏళ్ల సమస్యను 2019 తెలుగుదేశం ప్రభుత్వ జీవో ఇచ్చిందని, కానీ అప్పటినుంచి వైసిపి ప్రభుత్వం హయాంలో వారి సమస్య పరిష్కరించలేదన్నారు. కూటమి ప్రభుత్వం మీకు అండగా నిలుస్తూ త్వరలోనే శెట్టిపల్లి భూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎ.రాధాకృష్ణ, ఎన్. శ్రీనివాసులు, కంచి రాజేంద్రన్, గజేంద్ర, వెంకటేశులు, మోహన్ రాజు, రామరాజు, కిషోర్, వెంకటేశులు, సుబ్బరాయులు, మమాల్యాద్రి, వాసు, మునికృష్ణ, దేశమ్మ, అమ్ములు, బాలమ్మ, మునిరాజా, చౌడామణి పాల్గొన్నారు.

## సూపర్ 6 పథకాల అమలు ఎప్పుడు

**తల్లికి వందనం పథకానికి మళ్ళీ వెన్నుపోటు.**
**డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి.షేక్ సైదా.**

పొదిలి,సూర్య వాస్తవం
సూపర్ 6 పథకాలను ఎప్పటినుండి అమలు చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ నేతలు డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి,షేక్ సైధాలు ప్రశ్నించారు.
శనివారం దర్శి లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈసారి ఎన్నికల్లో టిడిపి కూటమి అధికారం లోకి వచ్చేటందుకు సూపర్ 6 పథకాలు ప్రధాన కారణం అన్నారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చి2నెలలు కావచ్చింది.ఈ 6 పథకాలలో ఒక్క సామాజిక పథకం మాత్రమే అమలు అయింది.మిగతా 5 పథకాలు అమలు కాలేదు.అవి 1.నిరుద్యోగ యువతకు నెలకు రు 3వేల





నిరుద్యోగ భృతి. 2.తల్లికి వందనం పథకం క్రింద స్కూలుకు వెళ్ళే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ 15,000లు. 3.ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా 20,000 ఆర్థిక సాయం. 4.ప్రతి మహిళకు నెలకురూ1500(19సంవత్సరాల నుంచి 59 సంవత్సరం వరకు) ప్రతి ఇంటికీ ఏడాదికిఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం. 5.బిసి,ఎస్సీ,ఎస్టీ,ముస్లిం మైనారిటీలకు 50 ఏళ్లకే ఫించన్. ఈ 5 పథకాలు అమలు కాలేదు. తల్లికి వందనం పథకానికి సంబంధించి ప్రభుత్వం పదేపదే మాట తప్పుతోంది.స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి అని మ్యానిఫెస్టోలో పేర్కొంది.9-7-2024 న విడుదల చేసిన జీవో29 లో విద్యార్థి బదులు తల్లి అని పేర్కొంది..దీనిపై విమర్శలు రాగానే పొరపాటు జరిగింది.ప్రతి విద్యార్థికి ఇస్తామని ప్రభుత్వం చెప్పింది.ఇప్పుడేమో వచ్చే విద్యా సంవత్సరం నుండి అమలు చేస్తామని చెబుతోంది.ఇది మోసం. మాట తప్పడం అని తులసి రెడ్డి, కాంగ్రెస్ నేత సైదా ధ్వజమెత్తారు. తల్లికి వందనం పథకాన్ని ఈ విద్యా సంవత్సరం నుండే అమలు చెయ్యాలని,మిగతా పథకాలను ఎప్పటినుండి అమలు చేస్తారో స్పష్టత ఇవ్వాలని తులసి రెడ్డి, సైద డిమాండ్ చేశారు. మీడియా సమావేశం లో జిల్లా కిసాన్ సెల్ నాయకులు గాలి వెంకట్రామిరెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు బాబు, గోరంట్ల కోటేశ్వరరావు, ముల్లా జిలాని, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రెహనాబాను. షేక్ మస్తాన్ వలి, కాంగ్రెస్ నేతలు శ్రీయుతులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న,సుబ్బరాయుడు,వినయ్, తదితరులు పాల్గొన్నారు.

## పిచ్చికుక్క స్వైర విహారం

### 27మందిపై పిచ్చికుక్క దాడి

అన్నమయ్య జిల్లా సూర్యవాస్తవం
రాయచోటి బస్టాండ్ సమీపంలో శనివారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. కుక్క దాడిలో ముగ్గురు చిన్నారులు సహా సుమారు 27 మందిని గాయపరిచినట్లు బాధితులు వాపోయారు. ఒకరి పరిస్థితి విషయంగా ఉండడంతో కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. వీటిపై అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు

**డాక్టర్ సలహా.. కుక్క కరిస్తే ఏం చేయాలి?**

ధారగా పడుతున్న నీటితో 15%ఎఅఅ% గాయాన్ని కడగాలి. ఇలా చేస్తే కుక్క లాలాజలం శరీరంలోకి ప్రవేశించదు. గాయమైన చోటును యాంటిసెప్టిక్ లోషన్తో శుభ్రం చేయాలి. ఆ తర్వాత డాక్టర్ దగ్గరకి తీసుకెళ్లి టీటీ ఇంజక్షన్ వేయించాలి. కరిచిన చోటును మూసి ఉంచొద్దు. నీరు, రక్తం కారుతున్నా అలాగే వదిలేయాలి. వైద్యుల సూచన మేరకు యాంటీ రేబిస్ టీకాను అవసరమైన (3లేదా5) మోతాదుల్లో తీసుకోవాలి.





## గ్రామ పంచాయతీలు, సర్పంచ్‌ల వ్యవస్థ బలోపేతం

### కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది: పవన్ కళ్యాణ్



అమరావతి,ఆగస్ట్10(సూర్యవాస్తవం): గ్రామ పంచాయతీలు , సర్పంచ్‌ల వ్యవస్థ బలోపేతానికి తమ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, కీలకమైన గ్రామీణ వ్యవస్థకు జీవం పోయాలన్నదే తమ తపన అని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఆర్థికంగా గ్రామ పంచాయతీలను పరిపుష్టంగా చేయాలనే సంకల్పంతోనే గ్రామ సభల నిర్వ హణ, జల్‌జీవన్‌మిషన్ నిధుల వ్యయంపై పల్స్ సర్వే, స్వాతంత్య, గణతంత్ర వేడుకల నిర్వహణకు పంచాయతీలకు నిధుల పెంపు నిర్ణయాలను తీసుకోవడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈమేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు కోసం గ్రామ సభలను రాష్ట్రంలోని 13,326 గ్రామ పంచాయతీల్లో ఒకేసారి నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు. జాతీయ మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గ్రామాల్లో ఏ పనులు చేయాలి? దేనికి ప్రాధాన్యం ఇవ్వాలి? ఎలాంటి పనులకు ఆమోదం తెలపాలి? అనే విషయాలనే గ్రామసభల్లో చర్చించి నిర్ణయం తీసుకుంటారన్నారు. ఉపాధి నిధులతో కొత్తకళ తీసుకురావడం, ఆయా గ్రామాల్లో ఉన్న సౌకర్యాల కల్పన, మౌలిక వసతుల పెంపు వంటి విషయాను గ్రామసభల్లో చర్చించి నిర్ణయం తీసుకుంటారని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. గ్రామసభల్లో ఆయా గ్రామాలకు ఏయే పనులు అవసరమో గుర్తించి వాటిని వెంటనే ఉపాధి పథకంలో చేపట్టేలా చొరవ తీసుకుంటామన్నారు. జల్‌జీవన్‌మిషన్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందనిగత ఐదేళ్లలో జల్‌జీవన్‌మిషన్ పథకంలో రూ.4వేలకోట్లు ఖర్చు పెట్టినట్లు అధికారులు చెబుతున్నారని, అయితే వాటి ప్రతిఫలాలు మాత్రం క్షేత్రస్థాయిలో అందినట్లు దాఖలాల్లేవన్నారు. జల్‌జీవన్‌మిషన్ పనులపై వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు జరిగిన పనులు ,ఖర్చుచేసిన నిధులపై వివరాలు తెలుసుకునేందుకు పల్స్ సర్వే పేరుతో ఓ సర్వేనిర్వహించాలని అధికారులను ఆదేశించినట్లు డిప్యూటీ సిఎం పేర్కొన్నారు.
రాష్ట్ర మంతా జరిగే ఈ సర్వేలో వెలుగుచూసేఅంశాలను ప్రజల ముందు పెట్టి ,జల్‌జీవన్‌మిషన్ నిధులను ,పథకాన్ని సమర్థంగా ఎలా ఉపయోగించుకోవాలనే దానిపై నిర్ణయం తీసుకుంటామన్నారు. గ్రామ సర్పంచ్‌ల ఆత్మగౌరవం తగ్గకుండా చూస్తామని, దేశం కోసంపనిచేస్తున్న సైనికులు, పారిశుద్ధ్యకార్మికులు సత్కరించుకునేలా కార్యక్రమాలను నిర్వహించాలనిసర్పంచ్‌లను కోరుతున్నట్లు పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులను డిస్కమ్‌లకు తీసుకోవడంతో పంచాయతీల ఆర్థిక పరిపుష్టి కోల్పోయాయన్నారు.కనీసం బ్లీచింగ్ పౌడర్‌కొనడానికి కూడా డబ్బులులేవని సర్పంచ్‌లు పలుమార్లు తమ వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు ఆయన తెలిపారు. స్థానిక సంస్థలకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచి గ్రామీణప్రాంతాల సర్వతోముఖాభివృద్ధి దిశగా అడుగులు వేయాలని తమ కూటమి ప్రభుత్వం బలంగా భావిస్తోందని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.

# గ్రామస్తుల చొరవతో స్మశాన వాటికకు దారి ఏర్పాటు

శాంతిపురం మండలం ఆగస్టు 10 సూర్యవాస్తవం

దశాబ్దాలుగా శ్మశాన వాటిక కు దారి లేక ఇబ్బంది పడుతున్న రాళ్ళబూదుగూరు ప్రజలకు శనివారం గ్రామ పెద్దలు మరియు గ్రామస్తులు చొరవతో పరిష్కారం లభించింది. దీంతో సర్పంచ్ లక్ష్మి మురుగేష్ సహకారంతో తాత్కాలికంగా మట్టి రోడ్డును శ్మశాన వాటిక కు ఏర్పాటు





చేశారు. త్వరలోనే ప్రభుత్వ తోడ్పాటుతో శాశ్వత సిమెంటు రోడ్డు పనులను కూడా చేపడతామని ఆమె తెలిపారు. రాళ్ళబూదుగూరు గ్రామ ప్రజలు ఊరిలో ఎవరైనా చనిపోతే వారిని శ్మశాన వాటికకు తీసుకువెళ్లి ఆఖరి సంస్కారాలను కూడా చేయలేక చాలా ఇబ్బందులకు గురయ్యే వారు. చనిపోయిన వారికి తిథులు,తద్దినాలు నిర్వహించి వారి సమాధుల వద్దకు వెళ్లి పూజా కార్యక్రమాలను కూడా నిర్వహించలేని స్థితిలో ఉండేది అంతే కాదు కనీసం ఒక ద్విచక్ర వాహనం కూడా స్మశానానికి వెళ్లలేని దుస్థితి ఉండేది. దీంతో శ్మశానానికి దారి ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు రహదారి సమస్య ఇప్పటికి తొలిగిందని సాధ్యమైనంత త్వరగా సిమెంటు రోడ్డు వేసే విధంగా నాయకులు చొరవ చూపాలని గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి మురుగేష్, నాయకులు ఆర్.ఎస్ మణి, పి. జి.జయరాజు, బి. యం.కుమార్, బసవరాజు, సురేష్, వాజిద్, సుబ్రమణి వార్డు సభ్యులు చంద్రకళసురేష్, పూజహారతి,గోపినాథ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# విశ్రాంత ఉద్యోగులకు పెండింగ్ ఇంక్రీమెంట్ల ఇప్పించండి

తిరుపతి సూర్య వాస్తవం ప్రతినిధి

సౌత్ సెంట్రల్ రైల్వే డివిజన్ పరిధిలో అర్హులైన విశ్రాంత ఉద్యోగులకు పెండిగ్ ఇంక్రిమెంట్లను ఇవ్వాలని ఇండియన్ రైల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.మీరయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యూనియన్ నాయకులతో కలిసి మాట్లాడారు. ఏడో వేతన సంఘం సిఫారసుల మేరకు 2016 సంవత్సరం నుండి అమలు చేయాల్సిన వేతన సవరణను 2017లో అమలు చేసి ఒక ఏడాది అరియర్లా ఫెండింగ్లో ఉ




ంచారన్నారు. 18 నెలల డీఏలను కేంద్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రైల్వే ట్రేడ్ యూనియన్ గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలని, ఆ ఎన్నికలు రైల్వే బోర్డు ఫరిధిలో కాకుండా సెంట్రల్ లేబర్ కమీషనర్ ఆధ్వర్యంలో జరపాలని డిమాండ్ చేశారు. ట్రేడ్ యూనియన్ ఎన్నికలకు డిపాజిట్లు రద్దు చేయాలని యూనియన్ ప్రధాన కార్యదర్శి పులివర్తి రవీంద్ర నాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్. మనోహరం పాల్గొన్నారు.

# టిటిడి పాలకమండలిలో నటుడు సుమన్ కు అవకాశం కల్పించండి

తిరుపతి సూర్య వాస్తవం ప్రతినిధి

చలన చిత్ర రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సాధించుకున్న నటుడు సుమన్ టిటిడి పాలకమండలిలో అవకాశం కల్పించాలని సుమన్ యువసేన రాష్ట్ర అధ్యక్షులు నారాయణ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

శనివారం ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు విజ్ఞప్తి చేశారు. తెలుగు ప్రేక్షకులకు చిరస్థాయిగా గుర్తిండుపోయో పాత్రలను నటుడు సుమన్ పోషించారన్నారు. అన్నమయ్య చిత్రం యావత్ ప్రపంచంలో ఉన్న తెలుగు వారందరిని అలరించిన



చిత్రమని, అందులో వెంకటేశ్వర స్వామిగా నటుడు సుమన్ వైవిధ్యబరితమైన నటనను ప్రదర్శించారన్నారు. టిటిడి పాలకమండలిలో వివిధ రంగాల నుండి ఎంతో మంది పోటీపడుతుంటారని, చిత్ర పరిశ్రమ నుండి సుమన్ కు అవకాశం ఇవ్వలని అభిమానులుగా రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సుమన్ అభిమానులు సురేంద్ర నాయుడు, మాధవ్, నాగవర్ధన్, హేమంత్ పాల్గొన్నారు.

# క్రీడల్లో గీతం ప్రభంజనం

తిరుపతి సూర్య వాస్తవం ప్రతినిధి

చిన్న వయసు నుంచే వై సాయి ముఖేష్ యాదవ్ క్రీడల్లో రాణిస్తూ ప్రభంజనం సృష్టిస్తున్నారని గీతం కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక భవాని నగర్ గీతం జూనియర్ కళాశాలలో ఇంటర్ సిఇసి చదువుతున్న వై ముఖేష్ సాయి యాదవ్ భూటాన్ లో జరిగిన బాక్సింగ్ క్రీడ పోటీలలో అండర్ 17 ఆషియన్ ఛాంపియన్ షిప్ లో గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ మేరకు శనివారం ఆ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వై ముఖేష్ సాయి యాదవ్ ఇప్పటివరకు 16 గోల్డ్ మెడల్స్ సాధించారని తెలిపారు. మరిన్ని పథకాలు సాధించి దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపల్ బివి గోపీనాథ్ విద్యార్థికి అభినందనలు తెలుపుతూ గీతం కళాశాల చదువుతోపాటు క్రీడల్లో ప్రోత్సస్తుందని తెలిపారు.



# పారిశుద్ధ్యానికే తొలి ప్రాధాన్యత

## కుప్ప మున్సిపల్ కమిషనర్ వి. శ్రీనివాసరావు

కుప్పం ఆగస్టు 10 సూర్యవాస్తవం

కుప్పం మున్సిపాలిటీలో పారిశుద్ధ్యానికి తొలి ప్రాధాన్యత ఇస్తున్నామని మున్సిపల్








కమిషనర్ వి. శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని రైల్వే స్టేషన్ రోడ్డు, బస్ స్టేషన్, రాజావారి పార్కు, ఇతర స్థలాలలో అపారిశుద్ధ్యం నెలకొన్న చోట చెత్తను తొలగించి బ్లీచింగ్ పౌడర్ ను చల్లించారు. ప్రతిరోజు పట్టణ మొత్తం కలియ తిరుగుతూ పారిశుద్ధ్య కార్మికులు, ఉద్యోగులను పరుగులు పెట్టిస్తున్నారు. అపారిశుద్ధ్యం కారణంగా దోమలు, ఎలుకలు, పెరిగి ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయని వారు వ్యాధుల బారిన పడకుండా చూడటం తమ ప్రధాన కర్తవ్యమని ఆయన మీడియాకు తెలిపారు. కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని డ్రైనేజీలలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని పూర్తిగా తొలగించారు. ఒక నెలలోపు చెత్త లేని మున్సిపాలిటీగా తయారు చేస్తామని ఆయన తెలిపారు. దీనికోసం సుమారు 15 ట్రాక్టర్లు,9 చెత్త సేకరణఆటోలు ఏర్పాటు చేశారు. కార్మికులు, మున్సిపల్ ఉద్యోగులు కుప్పం ను స్వచ్ఛమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రజలు కూడా ఇష్టం వచ్చిన చోట చెత్తను వేయకుండా చెత్త సేకరణ వాహనాలు వచ్చినప్పుడు ప్రత్యేకమైన చెత్త డబ్బాలలో ఉంచి వారికి అందజేయాలన్నారు.

# ప్రభుత్వం ఏర్పాటులో విశ్రాంతి ఉద్యోగుల పాత్ర కీలకం : ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి సూర్య వాస్తవం ప్రతినిధి

ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటలో ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగులు పాత్ర కీలకమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. శనివారం విశ్రాంతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఎల్ఐసి రోడ్డులోని ఆ సంఘం కార్యాలయంలో ఎమ్మెల్యే




ఆరణి సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విశ్రాంతి ఉద్యోగులు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును ఘనంగా సన్మానించారు. అయితే తనకన్నా పెద్దలైన రిటైర్డ్ ఉద్యోగులను సన్మానించడం సముచితమని, విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కేఆర్ శంకర్ ను ఎమ్మెల్యే శాలువ కప్పి సన్మానించారు. ఎమ్మెల్యే చర్యను హర్షిస్తూ రిటైర్డ్ ఉద్యోగులు పెద్ద ఎత్తున కరతాళధ్వనులతో తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. శేషజీవితాన్ని రిటైర్డ్ ఉద్యోగులు ప్రశాంతంగా గడపాలని ఎమ్మెల్యే ఆరణి ఆకాంక్షించారు. ఎన్డీఏ ప్రభుత్వ ఏర్పాటులో రిటైర్డ్ ఉద్యోగులు, ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకంగా నిలిచిందని ఆయన అన్నారు. ప్రస్తుత ఉద్యోగులకు రిటైర్డ్ ఉద్యోగులకు మధ్య పూర్తి వ్యత్యాశం ఉందని ఆయన చెప్పారు. మీరంతా ఉద్యగాన్ని బాధ్యతతో ఎటువంటి ఒత్తుడులు లేకుండా చేస్తే ప్రస్తుత ఉద్యగోల్లో రాజకీయాలు ఉన్నాయని నేతల ఒత్తిడి ఎక్కువుగా ఉందని ఎమ్మెల్యే చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ వ్యవహారశైలితో ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగలు ఎన్నో అవస్థలు పడ్డారని ఆయన తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే జీతాలను ఒకటవ తేదీకే ఇస్తోందని ఆయన చెప్పారు. రిటైర్డ్ ఉద్యగులకు మూడు నెలలకు ఒకసారి అన్ని వైద్యపరీక్షలు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. తమకు కేటాయించిన స్థలంలో అక్రమంగా పెన్షర్ల సంఘం పేరిట దౌర్జన్యంగా భవనాన్ని నిర్మించారని ఎమ్మెల్యే దృష్టికి రిటైర్డ్ ఉద్యోగులు తీసుకొచ్చారు. దీనిపై అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టిడిపి రాష్ట్ర నాయకులు బుల్లెట్ రమణ, మునిశేఖర్ రాయల్, రమణరాజు, జనసేన నాయకులు రాజా రెడ్డి, లోకేష్, బాబ్జి, రాజేష్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నేతలు వెంకటేశం శెట్టి, ఎస్ జీ మునికృష్ణయ్య, సిద్ధయ్య, గోపాల్, బి వెంకటరమణ, చింతకాయల కృష్ణయ్య, వెంకటరమణ పాల్గొన్నారు.

# పింఛన్ల పంపిణీ తప్ప మిగతా 5 పథకాలు అమలు కావడం లేదు

## సిపిఐ (యం యల్ ) లిబరేషన్ పార్టీ: జిల్లా నాయకుడు గాలి రవిరాజ్

నంద్యాల (సూర్య వాస్తవం, నంద్యాల జిల్లా)

రాష్ట్రంలో మేము అధికారంలోకి వస్తే సూపర్ 6 పథకాలు అమలు చేస్తామని,



టిడిపి కూటమి ఎన్నికల సందర్భంగా ప్రజలకు వాగ్దానం చేసిందని, అవి నమ్మి ప్రజలు ఓట్లు వేశారని, అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులైనా, సామాజిక పింఛన్ల పంపిణీ తప్ప, మిగతా ఐదు పథకాలు ఇంకా అమలు కావడం లేదని సిపిఐ (యం యల్) లిబరేషన్ పార్టీ జిల్లా నాయకుడు గాలి రవిరాజ్ అన్నారు. యువతకు సంబంధించి నెలకు 3000 రూపాయలు నిరుద్యోగ భృతి, తల్లికి వందనం పథకం కింద స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి 15,000 రూపాయలు, రైతులకు సంబంధించి ప్రతి రైతుకు ఏట 20,000 రూపాయలు ఆర్థిక సాయం , ప్రతి మహిళకు నెలకు 1500 (19 సంవత్సరాల నుండి 59 సంవత్సరాలు వరకు) ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం, మైనార్టీలకు 50 సంవత్సరాలకే పెన్షన్ వంటి పథకాలను హామీ ఇచ్చారని అన్నారు. ఖజానా చూస్తే ఖాళీగా ఉందని, ప్రభుత్వం శ్వేత పత్రం పేరుతో, సాగు పత్రాలు విడుదల చేసి పలాయన వాదం పాటిస్తుందని అన్నారు. ఖజానా ఖాళీగా ఉండేది, రాష్ట్రం అప్పులు కుప్ప అయిన విషయం తెలిసే టిడిపి కూటమి సూపర్ సిక్స్ పథకాలను హామీ ఇచ్చిందని ఆయన అన్నారు. ఈ పథకాలను తప్పించుకోవడం కుదరదని, కచ్చితంగా అమలు చేసి తీరాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు

# ఎమ్మెల్యే కెఈ.శాంబాబును కలిసిన ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు ...

పత్తికొండ టౌన్ (సూర్య వాస్తవం)

పత్తికొండ ఆగస్టు 10 పత్తికొండ నియోజకవర్గ శాసనసభ్యులు కెఈ. శ్యాంబాబును కలిసిన ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ యూనియన్



డిస్టిక్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.గౌస్.డివిజన్ ప్రెసిడెంట్ ఏ.ఉసేని.డివిజన్ వైస్ ప్రెసిడెంట్ సాలే భోఖారి కోశాధికారి జెఎం.డి.ఆలీ లు శనివారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నూతనంగా గెలిచిన తెలుగుదేశం పార్టీ పత్తికొండ నియోజకవర్గ శాసనసభ్యులు కెఈ.శ్యామ్ బాబును మర్యాదపూర్వకంగా కలిసి పూలదండలు వేసి శాలవలతో సత్కరించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మైనార్టీలకు అభివృద్ధికి కృషి చేస్తానని ఆల్ మైనారిటీ ఎంప్లాయిస్ అసోసియేషన్ కు ఏది కావాలన్నా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫక్రుద్దీన్,జాకీర్ హుస్సేనే గౌరవ సభ్యులు ఉస్మాన్ భాష.తదితరులు పాల్గొన్నారు .

# కర్నూలు ప్రభుత్వాసుపత్రిని ఎయిమ్స్ తరహాలో అభివృద్ధి చేయండి

## ఆదోని ప్రభుత్వ వైద్య కళాశాలను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోండి

## కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి నడ్డాకి వినతిపత్రం అందజేసిన ఎం.పి బస్తిపాటి నాగరాజు

కర్నూలు (సూర్య వాస్తవం, కర్నూల్ జిల్లా)



కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని ఎయిమ్స్ తరహాలో అభివృద్ధి చేయడంతో పాటు ఆదోని ప్రభుత్వ వైద్య కళాశాల ను త్వరగా పూర్తి చేయాలని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డాను కర్నూలు ఎం.పి బస్తిపాటి నాగరాజు కోరారు.. ఢిల్లీలోని నడ్డా కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు...ఈ సందర్భంగా ఎం.పి నాగరాజు మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలతో పాటు, తెలంగాణా, కర్ణాటక జిల్లాల వాసులకు కర్నూలు ప్రభుత్వాసుపత్రి వైద్య సేవలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని, ఈ ఆసుపత్రిని ఎయిమ్స్ తరహాలో అభివృద్ధి చేస్తే రోగులకు మరింత మెరుగైన వైద్యం, మౌలిక సదుపాయాలు కలిపించేందుకు అవకాశం ఉంటుందన్నారు.. ఇక ఆదోని ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణానికి రూ.475 కోట్లు కేటాయించినప్పటికి ఇప్పటి వరకు కేవలం 50 శాతం పనులు మాత్రామే పూర్తి అయ్యాయన్నారు.. ఈ కళాశాల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేస్తే ఆదోని మండలంతో పాటు, ఎమ్మిగనూరు, పత్తికొండ, మంత్రాలయం, కోసిగి, ఆలూరు, కౌతాళం మండలాల వాసులకు అవసరమైన వైద్య సేవలను అందించవచ్చని నాగరాజు తెలిపారు.

# పత్తికొండ డివిజన్ అధికారులతో ఆర్డీవో సమీక్ష .....

పత్తికొండ టౌన్ (సూర్య వాస్తవం):

పత్తికొండ డివిజన్ పరిధిలోని మండలాలకు చెందిన తహశీల్దార్లు , డిప్యూటీ తహశీల్దార్‌లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, ఆర్ . డబ్లూ.ఎస్ సిబ్బందితో ప్రస్తుత నీటి పంపిణీ, పంపిణీలో సమస్యలు, ప్రతిపాదనలు, జే . జే.ఎమ్ స్కీమ్స్ గురించి ఆర్ . డి.ఓ రామ లక్ష్మీ సమీక్ష నిర్వహించారు. నీటి వనరులు, పైప్‌లైన్‌లు, ఫిల్టర్ బెడ్‌లు, క్లోరినేషన్‌పై ఏ.ఈ సిబ్బంది, తహశీల్దార్లు మరియు డిప్యూటీ తహశీల్దార్లకు ఆదేశాలు జారీ చేశారు. తహశీల్దార్లు ఎంపిడిఓతో కలిసి పని చేయాలని అన్ని మినీ వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ జరిగేలా చూడాలని, నీటి ద్వారా వచ్చే వ్యాధులు, త్రాగు నీరు కలుషితం కాకుండా చూడాలని ఆదేశించారు. వీఆర్వో, వీఆర్ఏలు మరియు మహిళా పోలీసులు గ్రామము లో జరుగుతున్న బాల్య వివాహాలు, తాండాలో బాల్య వివాహాల గుర్తించి ఎస్‌హెచ్‌ఓకు (పోలీసులకు) ముందస్తు సమాచారం అందించాలని ఆదేశించారు. బాల్య వివాహాలపై అవగాహన కల్పించడంలో మహిళా



పోలీసులు బాధ్యత వహించాలని సూచించారు. మరియు మండలంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ పాఠశాలలు, హాస్టళ్లను ప్రతి గురువారం మహిళా పోలీసులచే తనిఖీ చేయించి తహశీల్దార్‌కు నివేదిక సమర్పించాలని చర్యలు తీసుకోవాలని కోరారు. తదుపరి 100 రోజుల కార్యాచరణ బాగంగా తహశీల్దార్లు అందరు రికార్డు గది భద్రత, సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకోవాలని అన్ని మండల కార్యాలయాల్లో వాచ్‌మెన్‌లు ఉండేలా మరియు పీడీఎస్ (రేషన్ భియ్యం ) పంపిణీ 100% పంపిణి జరిగేల చర్యలు తీసుకోవాలని ఆర్ . డి.ఓ సూచించారు.

# సేవ చేసేందుకు అవకాశం కల్పించండి

తిరుపతి సూర్య వాస్తవం ప్రతినిధి

టిటిడి ఉద్యోగులకు సేవ చేసిన వారినే ఎంప్లాయిస్ బ్యాంక్ ఎన్నికల్లో గెలిపించాలని టిటిడి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్యక్షులు చీర్ల కిరణ్ పిలుపునిచ్చారు. శనివారం ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంప్లాయిస్ బ్యాంక్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న తమ ప్యానల్ అభ్యర్థులను ప్రకటించారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో టిటిడి ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణ కోసం శ్రమించిన గుంటూరు రేఖ, వంకీపురం



పవన్, మణికంఠ, సునీల్ కుమార్ యాదవ్లను బ్యాంక్ ఎన్నికల్లో ఉద్యోగులు ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల సంక్షేమం కోసం నిర్వహించిన అనేక పోరాట కార్యక్రమాల్లో వీరు పాల్గొన్నారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో టిటిడి ఉద్యోగ సంఘాల నాయకులు గోపి, కుమార్ రెడ్డి, వెంకటేశ్వరబాబు, ఉమాశంకర్, గుణ పాల్గొన్నారు.

# రెండు ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడ్డ కర్ణాటక మద్యం.

బంగారుపాళ్యం సూర్య వాస్తవం న్యూస్ ఆగస్టు 10.

చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం సదకుప్పం గ్రామం నందు ఎస్ ధనంజయ నాయుడు వయస్సు 54 సంవత్సరాలు తండ్రి (లేట్) ముంద్రత్నం నాయుడు ఇతని ఇంటి వద్ద కర్ణాటక మద్యం, ఏపీలోని మద్యం బాటిల్ లు అమ్ముచుండగా 90 ఎం.ఎల్ ఒరిజినల్ ఛాయిస్ 11 టెట్రా ప్యాకెట్లు, ఏపీ లోని మద్యం 180 బాటిల్ 3, కింగ్స్ వెల్ 3, రాయల్ ప్యాలెస్ 6, హెడ్ కానిస్టేబుల్ బాబు వీరి స్వగృహం నందు పట్టుకున్నారు. వీరిని బంగారుపాళ్యం పోలీస్ స్టేషన్ కు తీసుకొచ్చి కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా వేపనపల్లి గ్రామానికి చెందిన టి. సుజాత వయస్సు 42 సంవత్సరాలు, భర్త టి.సుధాకర్, ఈమె ఇంటి వద్ద ఏపీ మద్యం 180 ఎమ్మెల్ మల్బార్ వి ఎస్ ఓ పి 18 బాటల్స్, అమ్ముచుండగా బంగారు పాల్యం ఏఎస్ఐ మల్లప్ప నాయుడు చాకచక్యంగా పట్టుకొని వీరిని బంగారుపాళ్యం పోలీస్ స్టేషన్ కు తీసుకొచ్చి కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు. కర్ణాటక మధ్యాన్ని విక్రయించిన వీరిపై కఠిన చర్యలు ఉంటాయని బంగారు పాల్యం అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్ సిఐ యు లక్ష్మయ్య తెలిపారు.



# సంకీర్తన నగర కీర్తి ప్రతిష్టలకు దోహదం

తిరుపతి సూర్య వాస్తవం ప్రతినిధి

భక్తుల్లో మరింత భక్తి భావం పెంచుతూ తిరుపతి కీర్తి ప్రతిష్టలు పెరగడానికి నగర సంకీర్తన దోహదం చేస్తుందని బిజెపి జిల్లా కార్యదర్శి నరేష్ నగర సంకీర్తన మండలి సభ్యులు అన్నూరు భాస్కరాచారి అన్నారు. తిరుపతి నగరంలో భక్తి భావం మరింత పెరగాలని ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రజలు నివసించాలన్న సంకల్పంతో స్థానిక రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి నగర సంకీర్తన మండలి ఏర్పాటు చేసి నగరంలో ప్రతి శనివారం భజన మండలి కళాకారుల చేత సంకీర్తన గోష్టి నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం భజన



మండలి కళాకారులు సాంప్రదాయ వస్త్రాలతో స్థానిక గోవిందరాజు స్వామి ఆలయం నుంచి నాలుగు మాడ వీధుల్లో నగర సంకీర్తన చేపట్టారు. నగర సంకీర్తన అనంతరం భక్తులకు అన్న ప్రసాదాలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సుశీల, ముని కుమారి, పద్మావతి, జయమ్మ, కల్పన, ఉషారాణి, భారత్, పార్వతి, ధనలక్ష్మి, నిర్మలవాసు రెడ్డి, మునినాధారెడ్డి, కాస్స పద్మాభం, చంద్ర బాబు నాయుడు, కొండె చెంగారెడ్డి, శంభోల హరినాథ్, పొన్నాల జేజిరెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, పార్వతి, పద్మ, ఉషారాణి, కల్పన, జయమ్మ, మునికుమారి, సుశీల, మహాలక్ష్మి, నరసింహారెడ్డి, నాగరాజు, రాజశేఖర్ రెడ్డి, వాసు, సాయిరెడ్డి, కళాకారులు పాల్గొన్నారు.

# బలిజ వివాహ పరిచయ వేదిక

తిరుపతి సూర్య వాస్తవం ప్రతినిధి

బలిజ వివాహ పరిచయ వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బలిజ ఉద్యోగుల అభ్యుదయ సేవాసమితి చిత్తూరు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు



నీలం నరేంద్రనాథ్ పేర్కొన్నారు. శనివారం యూత్ హాస్టల్ లో "బలిజ ఉద్యోగుల అభ్యుదయ సేవా సమితి" (బీస్) కార్యవర్గ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నరేంద్రనాథ్ మాట్లాడుతూ శాసనసభ్యులు అరణి శ్రీనివాసులు ఆధ్వర్యంలో బలిజ వివాహ పరిచయ కార్యక్రమాన్ని త్వరలో నిర్వహిస్తామని తెలిపారు. చిత్తూరు ఉమ్మడి జిల్లాల్లో వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న బలిజ ఉద్యోగులు కులంతో సంబంధం లేకుండా అన్ని కులాలవారికి, మతాల వారికి వృత్తి పరంగా సహాయపడతామని తెలియజేశారు. ఈ సమావేశంలో కమిటీ జిల్లా గౌరవ అధ్యక్షులు సింగంశెట్టి మునిశంకరయ్య, శాశ్వత అధ్యక్షులు పగడాల సత్యనారాయణ నాయుడు, ప్రధాన కార్యదర్శి తోకల అశోక్ కుమార్, ఉపాధ్యక్షులు బి.ప్రభు రెడ్డి, పూల సురేష్, చంద్రశేఖర్, పుల్లా బాలాజీ, కె.జయప్రకాశ్, కె.వి వంశీ కృష్ణ , తోట మధుసూధన, అత్తిరాల మోహన్, జాయింట్ సెక్రటరీ కిషోర్ (సచివాలయం), ఇరివిశెట్టి వేంకటాద్రి, రామానాయుడు ధర్మేంద్ర,జి.పి రాజు (టెన్నిస్ చీఫ్ కోచ్), గుణశేఖర్, రవి కుమార్ (పంచాయతీ రాజ్), శ్యామ్ (పంచాయతీ రాజ్) మురళి ప్రసాద్ (టి.టి .డి) వెంకటేష్ (ఔట్సోర్సింగ్ జిల్లా అధ్యక్షులు) పాల్గొన్నారు .

Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in



## మున్నా నగర్ లో ఘనంగా ఎమ్మెల్యే దగ్గుబాటి పుట్టినరోజు వేడుకలు .....

అనంతపురం (సూర్య వాస్తవం):
అనంతపురం శాసనసభ్యులు దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ జన్మదిన సందర్భంగా 21 డివిజన్ మున్నా నగర్ లో ఎక్స్ ఆర్టీసీ గౌరవాధ్యక్షులు



మరియు టిడిపి నాయకులు తొండపునాడు రమేష్ రాయల్ మరియు టిడిపి నాయకులు రాయల మధు ఆధ్వర్యంలో 500 మందికి పైగా చీరలు పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు గురుమూర్తి , పావురాల శేఖర ,రవికుమార్, రాము, తరుణ్ శ్రీదేవి, నిర్మల, వలి కౌడికి, మధు, రుషివర్ధన్ ,వినోద్ జిలాన్, సుదర్శన్ ,రేవంత్ ,శశి, బాబావాలి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన తెలుగుదేశం పార్టీ మైనారిటీ మహిళా నాయకురాలు నేహా అయేషా ....

అనంతపురం టౌన్ (సూర్య వాస్తవం):
అనంతపురం అర్బన్ నియోజవర్గం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్



నేడు జన్మదినం తన క్యాంపు కార్యాలయం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో 37వ డివిజన్ కు చెందిన తెలుగుదేశం పార్టీ మహిళా నాయకురాలు నేహా అయేషా పూల మొక్కనీ అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేసి ఎమ్మెల్యే చేతుల మీదుగా రక్తదాన పత్రాన్ని అందుకున్నారు.

## హజ్ యాత్ర ముగించుకొని వచ్చిన నాయకుడికి సన్మానం ..

అనంతపురం (సూర్య వాస్తవం):



పవిత్ర స్థలమైన హజ్ యాత్ర ముగించుకొని అనంతపురానికి వచ్చిన షకీల్ షఫీ నీ ముస్లిం మైనార్టీ నాయకులు పూలమాల వేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐ. ఏం.ఏం మహబూబ్ బాషా, జకీర్, మైనారిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ఆరోపణలకు సమాధానం చెప్పకుండా.. బెదిరింపు వైఖరి సరైనది కాదు..

### డిసిఓ మురళీకృష్ణ పై ఏపీ మాదిగ విద్యార్థి సంఘం డిఆర్ఓ కు ఫిర్యాదు..

అనంతపురం ఆగస్టు 10 టౌన్ (సూర్య వాస్తవం )
అనంతపురం బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల సీట్ల భర్తీ విషయంలో తనపై వచ్చిన ఆరోపణలకు సరైన సమాధానం చెప్పకుండా ప్రశ్నించిన విద్యార్థి సంఘాలను, దళిత నాయకులను, పాత్రికేయులను బెదిరించే విధంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొనడం



దేనికి సంకేతం అని ఆంధ్రప్రదేశ్ మాదిగ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నగేష్ ప్రశ్నించారు. డి సి ఓ మురళీకృష్ణ చేస్తున్న తాటాకు చెప్పులకు బెదిరే ప్రసక్తే లేదన్నారు. మెరిట్ లిస్ట్ ద్వారా భర్తీ అయిన వారి వివరాలు, ఆ తర్వాత భర్తీ చేసిన సీట్ల వివరాలను కోరితే ఎందుకు ఉలిక్కి పడుతున్నారు అన్నారు. డి సి ఓ పై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 16న కలెక్టరేట్ వద్ద భారీ ధర్నాకు పిలుపునిస్తే అది చట్టారీత్యా నేరం ఎట్లా అవుతుందనే విషయం ఆ అధికారికి తెలియకపోవడం దురదృష్టకరమన్నారు. అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ సొంత నిర్ణయాలు తీసుకుంటున్న డి సి ఓ వల్ల ఎస్సీ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. డి సి ఓ గురించి జిల్లా కలెక్టర్కు వివరించి తగు చర్యలు తీసుకోవాలని వారు తపాలా ద్వారా డిఆర్ఓ కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగేష్ ,పకీరప్ప, మధు, శాంత కుమార్ ,చైతన్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే మా లక్ష్యం: జిల్లా ఎస్పీ

-పోలీస్ కంట్రోల్ రూంలో నిర్వహిస్తున్న అన్ని విభాగాలను మరింత బలోపేతం చేయండి
-ప్రజలకు మెరుగైన సేవలందించడమే జిల్లా పోలీసుశాఖ లక్ష్యం
-పోలీస్ కంట్రోల్ రూం, డయల్ 100, సైబర్ క్రైం, తదితర విభాగాలను విజిట్ చేసిన జిల్లా ఎస్పీ
-జిల్లా కేంద్రంలో ఉన్న సిసికెమేరాలను కమాండ్ కంట్రోల్ ద్వారా వీక్షించి పలు సూచనలు చేసిన ఎస్పీ
జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ

అనంతపురం క్రైం (సూర్య వాస్తవం):
జిల్లా పోలీస్ కంట్రోల్ రూంలో నిర్వహిస్తున్న అన్ని విభాగాలను మరింత బలోపేతం చేయాలని... ప్రజలకు మరింత మెరుగైన సేవలందించడమే జిల్లా



పోలీసుశాఖ లక్ష్యమని జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ పేర్కొన్నారు. జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ లో నిర్వహిస్తున్న పోలీస్ కంట్రోల్ రూం, డయల్ 100, సైబర్ క్రైం, తదితర విభాగాలను జిల్లా ఎస్పీ శనివారం నాడు విజిట్ చేశారు. ఆయా విభాగాల పని తీరు, నిర్వహణపై సమీక్ష చేశారు. వీటి నిర్వహణలో ఏవైనా లోటుపాట్లు ఉంటే సరిచేయాలనే ఉద్దేశ్యంతో ఈ విభాగాలలో పని చేస్తున్న ప్రతీ సిబ్బందితో ముఖాముఖి మాట్లాడారు. జిల్లా కేంద్రంలో ప్రజల భద్రత, నేరాల నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణల కోసం ఏర్పాటు చేసిన సిసికెమేరాలను కమాండ్ కంట్రోల్ ద్వారా వీక్షించి పలు సూచనలు చేశారు. అనంతపురం నగరంతో పాటు అన్ని మున్సిపల్ పట్టణాలలోని శివారు ప్రాంతాలు సైతం కవర్ అయ్యేలా సిసికెమేరాలను



సిద్ధం చేసి నిఘా ఉంచాలన్నారు.
ప్రజలు ఇళ్లకు తాళం వేసి ఊళ్లకు వెళ్లే సమయంలో లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం జిల్లాలో ఏవిధంగా నడుస్తుందో, ఎన్ని కెమేరాలు పని చేస్తున్నాయో అడిగి తెలుసుకోవడంతో పాటు మరింత మెరుగ్గా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ ఆర్ విజయభాస్కర్ రెడ్డి, ఎస్బీ సి.ఐ ఇందిర, పోలీస్ కంట్రోల్ రూం సి.ఐ దేవానంద్, సైబర్ సెల్ సి.ఐ షేక్ జాకీర్ లు వెళ్లారు

## కర్నూల్ అరుణ కుమారికి కళా రత్నఅవార్డు

కర్నూల్ (సూర్య వాస్తవం):
కర్నూల్ పట్టణానికి చెందిన ప్రముఖ పౌరాణిక నాటక మహిళా కళాకారుని కే ఎన్ అరుణకుమారి పాండిచ్చేరిలో జరిగిన కార్యక్రమంలోఓ యూనివర్సిటీ వారిచే అఖిల భారత రత్న అవార్డుఅందుకున్నారు.ఈ సందర్భంగా అరుణ కుమారి బాలనటిగా నాటక రంగ ప్రవేశం గావించి పౌరాణిక నాటక రంగంలో వివిధ స్త్రీ పాత్రలో నాటక ప్రదర్శన గావించి సబికులను రంజింప చేస్తుంటారు,కళాకారుల కుటుంబంలో జన్మించిన అరుణ కుమారి బాలనటిగా రంగ ప్రవేశం చేసి సాంఘిక జానపద పౌరాణిక నాటకాలలో తన ప్రదర్శన గావించి వివిధ అవార్డులు అందుకున్నారు ఈమె కళా నైపుణ్యతను గుర్తించిన కళాక్షేత్రాలు. స్వచ్ఛంద సంస్థలు యూనివర్సిటీ వారు ఇప్పటికే నట రాణి.ఉత్తమ నటి.డాక్టరేట్,అశ్వం, సతీ సావిత్రి అవార్డులు అందుకున్న అరుణ కుమారికి ప్రస్తుతం ప్రముఖ యూనివర్సిటీ వారు అఖిలభారత రత్న అవార్డు అందజేసి సత్కరించారు ఈ సందర్భంగా పాండిచ్చేరిలో యునైటెడ్ నేషనల్ ఇంటర్నేషనల్ ఫేస్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ యూనివర్సిటీ ప్రొఫెసర్లు. వైస్ ఛాన్సర్లు.రిజిస్ట్రర్ల చేతుల మీదుగా అఖిల భారత కళా రత్న అవార్డు అందించి సత్కరించారు.జాతీయస్థాయిలో 15మంది నాటక కళాకారులకు అఖిల భారత కళా రత్న అవార్డులు అందజేయగా అందులో కర్నూలుకు కి చెందిన అరుణ కుమారి కూడా కళా రత్న అవార్డు అందుకోవడం హర్షించదగ్గ విషయమని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.కొన్ని సంవత్సరాలుగా పౌరాణిక. జానపద. సాంఘిక నాటక కళా రంగంలో వివిధ రకాల పాత్రలు ధరించి తన కళా నైపుణ్యతను చాటుకుంటున్నా నని తన కళను



యూనివర్సిటీ వారు గుర్తించి అఖిల భారత కళా రత్న అవార్డు అందించి సన్మానించడం జీవితంలో మరపురాని ఘట్టంగా నిలిచిపోతుందని అరుణ కుమారి తెలిపారు.

## నూతన ఆర్టీసీ బస్సులను ప్రారంభించిన మంత్రి భరత్

కర్నూలు (సూర్య వాస్తవం)
రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ లోని సమస్యలను అంచల వారీగా ప్రణాళిక బద్ధంగా పరిష్కరిస్తుందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి



టి.జి.భరత్ పేర్కొన్నారు.శనివారం స్థానిక కర్నూలు-1 డిపో గ్యారేజీలో 4 కొత్త బస్సులను పాణ్యం శాసనసభ్యులు గౌరు చరితారెడ్డితో కలిసి రాష్ట్ర మంత్రి టి.జి.భరత్ జెండా ఊపి ప్రారంభించి అనంతరం బస్సు నడిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ..ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఆర్టీసీలోని సమస్యలను అంచల వారీగా ప్రణాళిక బద్ధంగా పరిష్కరిస్తుందన్నారు. కర్నూలు జిల్లాలో ఎమ్మిగనూరు నుంచి కర్నూలు, ఎమ్మిగనూరు నుంచి హైదరాబాద్, ఆదోని నుంచి కర్నూలు, కర్నూలు నుంచి శ్రీశైలంకు 4 బస్సులు, గత నెలలో ఆరు బస్సులను మొత్తం 10 బస్సులను ప్రారంభించుకోవడం జరిగిందన్నారు.కర్నూలు జిల్లాలోని ప్రజల సౌకర్యార్థం రద్దీగా ప్రయాణించే రోడ్లలో ప్రణాళిక బద్ధంగా కొత్త బస్సులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కూడా కల్పిస్తామని మంత్రి అన్నారు. రద్దీని దృష్టిలో పెట్టుకొని ముందుగా అన్ని రూట్లలో బస్సుల సంఖ్యను పెంచుతున్నట్లు చెప్పారు. కర్నూలు బస్టాండ్‌లో ప్రజల సౌకర్యాలను ఇంకా అభివృద్ధి పరిచేలా చర్యలు చేపడతామని మంత్రి అన్నారు. పాణ్యం శాసనసభ్యులు గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కర్నూలు జిల్లాలోని ఆర్టీసీని ప్రణాళిక బద్ధంగా అంచల వారీగా అభివృద్ధి చేస్తుందన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం గత నెలలో 6 బస్సులు ఇప్పుడు 4 బస్సులు మొత్తం పది బస్సులను ప్రారంభించడం జరిగిందన్నారు.

## ఓటమిని జీర్ణించుకోలేక బ్లాక్ మెయిల్ రాజకీయం చేస్తున్న వైఎస్.జగన్

ప్రొద్దుటూరు, (సూర్య వాస్తవం):
మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఇటీవలి సార్వత్రిక ఎన్నికలలో తన పార్టీ ఘోర పరాజయాన్ని జీర్ణించుకోలేక బ్లాక్ మెయిల్ రాజకీయం చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ బిసి సెల్ రాష్ట్రకార్యదర్శి సుంకర వేణుగోపాల్ విమర్శించారు. శనివారం ఆయన మాట్లాడుతూ
గత వైసిపి పాలనలో దాడులు, దౌర్జన్యాలు, భూకబ్జాలు, ఇసుక దోపిడీలతో అక్రమార్జనలకు పాల్పడి ప్రజలను జలగల్లా పీల్చి పిప్పిచేస్తూ, మరోవైపు అప్పులు చేసి వారికి సంక్షేమ పథకాలు ఇస్తున్నామని మభ్యపెట్టడంతో ఐదేళ్ళ విసిగివేసారిన ప్రజలు తెలుగుదేశం కూటమికి తిరుగులేని మెజారిటీ యిచ్చి అధికారంలో కూర్చబెట్టడంతో ఈ ఓటమిని జీర్ణించుకోలేని జగన్ ప్రజాతీర్పును గౌరవించకుండా, ప్రజాసమస్యలను గాలికొదిలేసి, రాష్ట్రంలో లేకుండా ఢిల్లీ గల్లీల్లో తిరుగుతూ హైదరాబాదు, బెంగుళూరు ప్యాలెస్ లలో కాలాక్షేపం చేస్తూ ప్రతిపక్ష హోదా కావాలని, 900 మంది సెక్యూరిటీ కావాలని ప్రభుత్వాన్ని, కోర్టులను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ తరుణంలో ఇతని ప్రవర్తన నచ్చని తనతో వున్న 11 మంది వైసిపి ఎమ్మెల్యేలు, ఇతర ద్వితీయశ్రేణి నాయకులు, కార్యకర్తలు కూడా రాజీనామాలు చేస్తూ ఇతర పార్టీల వైపు తొంగిచూస్తున్నారని, కాబట్టి ఇంట్లో కూర్చుని ప్రెస్ మీట్లు పెట్టకుంటూ, పబ్లిక్ లో బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడకుండా అసెంబ్లీకి వచ్చి గత ఐదేళ్ళలో వైసీపీ పాల్పడిన విధ్వంస నిర్వాహకాలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో



టిడిపి కడప పార్లమెంటరీ తెలుగు వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు గోమేధికమ్ సుదర్శన్, కడప పార్లమెంటరీ బిసి సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పి.ఎస్.ఎస్. సుబ్బరాజు, తెలుగు యువత నాయకులు ఆర్.మహేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## శ్రావణ మాసం మొదటి శనివారం సందర్భంగా ఆలయాలలో పూజలు

ప్రొద్దుటూరు, (సూర్య వాస్తవం):
శ్రావణ మాసం తొలి శనివారం సందర్భంగా పట్టణంలోని ఆలయాలలో స్వామివార్లకు, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. పట్టణంలోని బొల్లవరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో, పాత మార్కెట్ లోని శ్రీ లలితా దేవి, రతనాల వెంకటేశ్వర స్వామి (అన్నా చెల్లెలు) ఆలయంలో, శ్రీ మహాలక్ష్మి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి వారి ఆలయంలో, స్థానిక పాతమార్కెట్లో లోని ఆంజనేయస్వామి ఆలయంలో, బుడ్డాయపల్లె హనుమంతుల వారి విగ్రహం వద్ద, వివిధ ప్రాంతాల లోని హనుమంతుల వారి ఆలయాలలో వేకువజామున స్వామివారి మూలవిరాటు పంచామృతాభిషేకం కుంకుమార్చనలు నిర్వహించి ప్రత్యేకంగా తమల పాకులు, వడమాల, వివిధ రకాల పూలతో గజమాలలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించేందుకు ఉదయం నుంచి బారులు తీరారు. కాయాకర్పూరాలను సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందచేశారు.



## రైల్వే కోడూరులో దళితులు అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన,

అన్నమయ్య జిల్లా (రైల్వే కోడూరు సూర్య వాస్తవం)
విజయవాడ నడిబొడ్డున ఉన్న అత్యంత వైభవ పేతంగా నిర్మించిన అంబేద్కర్ విగ్రహ సముదాయంలో అంబేద్కర్ పేరును తొలగించడం అత్యంత బాధాకరమైన విషయమని రైల్వేకోడూరులోని దళిత సంఘాలు స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద



నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దళితుల ఆత్మ గౌరవం కోసం భావితరాల స్ఫూర్తిని దృష్టిలో ఉంచుకొని అంబేద్కర్ విగ్రహాన్ని అత్యంత వైభవ పేతంగా నిర్మించారని దీనిని జీర్ణించుకోలేని కొంతమంది అల్లరి మూకలు పథకం ప్రకారం అంబేద్కర్ పేరుని తొలగించడం దారుణమని వారు తీవ్రస్థాయిలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా కొంత మంది విగ్రహం వద్ద శిలాఫలకాన్ని తొలగించిన వారిపై కఠిన చర్యలు తీసుకుని భవిష్యత్తులో ఎటువంటి దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దమ్ము రఘు, రమణ, బుల్లెట్ శివ,మారేళ్ళ రాజేశ్వరి, విజయ భ్భాస్కర్, కొప్పుల కొప్పల శంకరయ్య, మహేష్ ,రమణహా మోందపాటి శంకరయ్య తోపాటు రైల్వేకోడూరు మండలానికి చెందిన దళితులు పాల్గొన్నారు.

## కార్యకర్తల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు మంత్రులతో టిడిపి కేంద్ర పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్.....

కడప సూర్య వాసం ప్రతినిధి
ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిరోజు ఏర్పాటు చేయడం



అభినందనీయమని కడప మాజీ డిప్యూటీ మేయర్ ఆరిఫుల్ల, టిడిపి ఆహ్వాన కమిటీ సభ్యుడు హసన్ భాష పేర్కొన్నారు
మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో వారు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి గ్రీవెన్స్ లో సెల్ లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రవీణ్ వద్దకు ప్రజలను పంపించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అటు ప్రభుత్వం నడుపుతూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్న చంద్రబాబు కార్యకర్తల సమస్యలను కూడా తీర్చేందుకు ప్రతిరోజు ఒక్కొక్క మంత్రి ఆధ్వర్యంలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసి వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తుండడంతో కార్యకర్తల్లో మనోధైర్యం పెరికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించేందుకు తోడ్పాటు అవుతాయని వారు పేర్కొన్నారు గత ఐదేళ్లలో కార్యకర్తలు ఎన్నో ఒడిదుడుకులు సమస్యలు ఎదుర్కొన్నారని వారి సమస్యలు పరిష్కరించేందుకు చంద్రబాబు ఎల్లవేళలా కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారానికి ఒకరోజు ఆయన కూడా ప్రజల , కార్యకర్తల నుంచి పార్టీ కార్యాలయంలో అర్జీలు స్వీకరించడం తో కార్యకర్తల సమస్యలు తీరుతున్నాయని ఆయన వివరించారు పార్టీకి కర్తలే వెనుముక్కలని వారి సమస్యల పరిష్కారానికి తామంతా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రొద్దుటూరు వేదికగా క్రీడా పోటీలు నిర్వహించడం గర్వకారణం

ప్రొద్దుటూరు, (సూర్య వాస్తవం):
శ్రీసరస్వతి విద్యాపీఠం అనంతపురం సేవా సమితి వారు ప్రొద్దుటూరు వేదికగా క్రీడా పోటీలు నిర్వహించడం గర్వకారణమని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి సూచించారు. శనివారం స్థానిక వైఎంఆర్ కాలనీలోని సరస్వతి విద్యామందిరం నందు శ్రీసరస్వతి విద్యాపీఠం అనంతపురం సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన




ఆటల పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శని, ఆదివారాల్లో ఈ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ నందు నిర్వహించే ఈ పోటీలకు రాయలసీమ లోని పలు ప్రాంతాల నుండి సుమారు 600మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొనడం ఆనందకరమన్నారు. ఈ పోటీలు ప్రొద్దుటూరు వేదికగా నిర్వహించడం గర్వకారణమని సరస్వతి విద్యాపీఠం అనంతపురం వారికి కృతజ్ఞతలు తెలిపారు.
విద్యార్థులు కూడా క్రీడా పోటీలలో రాణించడం వలన ఉద్యోగ అవకాశాలు కూడా వుంటాయని, కావున చదువుతో పాటు క్రీడలలో కూడా రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సరస్వతి విద్యాపీఠం సంస్థ నాయకులు మెట్టుపల్లె రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత హ్యాండ్ ఎంబ్రాయిడరీ వర్క్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రొద్దుటూరు, (సూర్య వాస్తవం):
సంస్కృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వికసిత ఫౌండేషన్ సహకారంతో మహిళలకు ఉచిత హ్యాండ్ ఎంబ్రాయిడింగ్ (మగ్గం వర్క్) కు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి తెలిపారు.
సూపర్ బజార్ లోని సాయిదత్త హాస్పిటల్ ఎదురుగా ఉన్న సంస్థలో శిక్షణ ఇస్తామని, 45 రోజుల కోర్సుకు ఆసక్తి కలిగిన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని వికసిత ఫౌండేషన్ చైర్మన్ లక్ష్మీదేవి తెలియజేశారు. దరఖాస్తుల నమోదుకు 9154195061, 9642471600 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

# పల్లేటి కులశేఖర్ మరణం

## తెలుగు నాటకరంగానికి తీరని లోటు

ప్రొద్దుటూరు, (సూర్య వాస్తవం): రైల్వే కోడూరు కు చెందిన సుప్రసిద్ధ నాటక రచయిత బహుముఖ ప్రజ్ఞాశాలి, కళారత్న పల్లేటి కులశేఖర్ మృతి తెలుగు



నాటక రంగానికి తీరని లోటు అని కడప జిల్లా రచయితల సంఘం జింకా సుబ్రహ్మణ్యం నేడు ఒక ప్రకటనలో తీవ్ర సంతాపం తెలిపారు. శుక్రవారం రాత్రి 10 గంటలకు గుండెపోటుతో మరణించిన వార్త దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. కులశేఖర్ సాహిత్యంలోని అన్ని ప్రక్రియలో రచనలు చేశారని, 66 నాటకాలను రచించి పదిసార్లు ఉత్తమ రచయితగా నంది అవార్డులను పొంది తాను రచించిన నాటకాలకు 88 మంది నంది అవార్డులను కైవసం చేసుకున్నారని, బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన కులశేఖర్ ఆరు మంది ముఖ్యమంత్రులచేత ముగ్గురు గవర్నలచే సత్కారం పొందారని, రేడియో, టివి, సినిమా రంగాలలో అపురూపమైన ప్రతిభను కనబరిచిన పల్లేటికుల శేఖర్ మన జిల్లా వాడు కావటం గర్వకారణం అన్నారు.

# దేశంలో పెరుగుతోన్న సైబర్ నేరాలు

## బాధితుల్లో మహిళలే ఎక్కువ

కడప బ్యూరో సూర్యవాస్తవం

టెక్నాలజీ ఎంతగా అభివృద్ధి చెందుతుందో మోసాలు కూడా అదే స్థాయిలో పెరిగాయి. ముఖ్యంగా ఇంటర్నెట్ వాడకం పెరగడం దీనికి కారణమని చెబుతున్నారు. ఆన్ లైన్ బ్యాంకింగ్, మొబైల్ ఫోన్ల ద్వారా చెల్లింపులు చేస్తున్నప్పుడు చాలా మంది సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కుతున్నారు. ఆధార్ కార్డు, పాన్ కార్డు డేటా స్టీలింగ్ ఆన్ లైన్ ఆర్థిక నేరాలకు పాల్పడుతూ బాధితుల ఖాతాలను మోసగాళు ఖాళీ చేస్తున్నారు. మోసపోయే వారిలో చదువుకున్న వారు కూడా ఉన్నారు. పోలీసులు, సీబీఐ, బ్యాంకు ఉద్యోగుల పేర్లతో పోన్లుచేయడం బాధితులను బెదిరించి డబ్బులు ఖాతాల్లోకి మళ్లించుకోవడంవంటి సైబర్ నేరాలు ఇటీవల భారీగా పెరిగాయి. ముఖ్యంగా సోషల్ మీడియా ద్వారా కూడా ఎక్కువగా మోసం చేస్తున్నారు. యూట్యూబ్ వీడియోలకు లైక్ లు కొడితే డబ్బులు ఇస్తామని చెప్పి చాలా మందిని సైబర్ నేరగాళ్లు మోసం చేస్తున్నారు. నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో 2022 నేరాలకు సంబంధించిన గణాంకాలను వెల్లడించింది. గతం కంటే క్రైం రేటు తగ్గినప్పటికీ సైబర్ క్రైం గణనీయంగా పెరిగిందని వివరించింది. ఇందులో 65 శాతం ఆన్ లైన్ మోసాలకు సంబంధించినవేనని పేర్కొంది. సైబర్ క్రైం బాధితుల్లో అన్ని వర్గాలు ఉ న్నవారు ఉన్నప్పటికీ ఎక్కువగా మహిళలే ఉన్నారని వివరించింది. బాధితుల్లో 25 శాతం మహిళలే వివరించింది. వైట్ కాలర్ నేరాలుగా చెప్పుకునే సైబర్ ఆర్థిక నేరాలు దేశవ్యాప్తంగా 11.1 శాతం పెరిగాయని వివరించింది. 2022లో 1 లక్షా 93 వేల కేసులు నమోదయ్యాయి.

# సబ్ రిజిస్టర్ ఆఫీస్ లో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అకస్మిక తనిఖీ

## ఫీజు వసూళ్లపై మండిపడ్డ ఎమ్మెల్యే

## అవినీతికి పాల్పడితే ఉద్యోగాలు ఉండవు

మైదుకూరు సూర్య వాస్తవం

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని సబ్ రిజిస్టర్ ఆఫీస్ నందు ఆకస్మిక తనిఖీ చేసిన మైదుకూరు ఎమ్మెల్యే పుట్ట సుధాకర్ యాదవ్ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటినుండి సబ్ రిజిస్టర్ ఆఫీస్ లో ఎలాంటి అవకతవకలకు పాల్పడిన ఏసీబీకి ఫిర్యాదు చేసి మీ అవినీతిని బయటపెడతానుప్రజలకు





రైతులకు ఎలాంటి అసౌకర్యం కలవకుండా రిజిస్టర్ చేసి పంపించాలని ఆదేశించారు. ఇక్కడ ఒక స్టాంప్ రైటర్ అన్ని నేనే చూసుకుంటా, ప్రజల దగ్గర డబ్బులు వసూలు చేస్తున్నారు. అని నా దృష్టికి వచ్చింది. అందుకే సబ్ రిజిస్టర్ ఆఫీస్ లో ఆకస్మిక తనిఖీ చేశారు.సబ్ రిజిస్టర్ ఆఫీసులో సౌకర్యాలు చాలా తక్కువగా ఉన్నాయని తొందర్లో మంచి బిల్డింగ్ చూసి అక్కడికి మారుస్తాము అని ప్రవేట్ భవనం నుండి ప్రభుత్వ భవనానికి మార్చేలా చేస్తామని ప్రతిపాదనను సిద్ధం చేయాలని అధికారులను సూచించిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలపడం జరిగింది.

# 12 నుంచి వైవీయూ డిగ్రీ ఇన్స్టంట్ పరీక్షలు

కడప బ్యూరో సూర్యవాస్తవం

వైవీయూ డిగ్రీ ఇన్స్టంట్ పరీక్షలు ఈ నెల 12 నుంచి ప్రారంభమవుతాయని



వైవీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొ. ఎన్ ఈశ్వర్ రెడ్డి తెలిపారు. పరీక్షలన్నీ వైవీయూ క్యాంపస్ లో మాత్రమే నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు చదువుతున్న కళాశాలల నుంచి హాల్ టికెట్లు తీసుకోవాలన్నారు. పరీక్ష ప్రాంభమయ్యే అరగంట ముందే క్యాంపస్ లోని ఏపీజే అబ్దుల్ కలాం సెంట్రల్ లైబ్రరీ పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

# డి సి ఎల్ ఏసీ ఫంక్షన్ హాల్ యాజమాన్యం సహకారంతో నిరాశ్రయులకు అన్నదానం చేపట్టిన శ్రీ వెంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్. ఏపీ శివ, జాన్ సెక్రెటరీ. భూమిరెడ్డి రవి కళ్యాణ్

మైదుకూరుసూర్య వాస్తవం

మైదుకూరులోని వనిపెంట రోడ్ లో ఉన్నటువంటి విజయ్ హాల్ పక్కన ఉన్న దండు చెన్నమ్మ, లక్ష్మయ్య గారి డి సి ఎల్, ఏ సి ఫంక్షన్ హాల్ వారి సహకారంతో ఫంక్షన్లలో మిగిలిన ఆహారాన్ని ఇతరులకు ఉ



పయోగపడాలని దాతృత్వంతో యాజమాన్యం ఫోన్ ద్వారా శ్రీ వెంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఏపీ శివ, జాయిన్ భూమిరెడ్డి రవి కళ్యాణ్ కు సమాచారం అందించగా అక్కడ ఉన్నటువంటి ఆహార పదార్థాలను సిపిఐ కాలనీ లో ఉన్నటువంటి నిరాశ్రయులకు మరియు నంద్యాల రోడ్ లో గుడిసెలో ఉన్నటువంటి నిరాశ్రయులకు ఆహార పదార్థాలు పంపిణీ చేయడం జరిగింది.వారికి సేవ చేయడం ఎంతో ఆనందదాయకమని ఇటువంటి సేవా కార్యక్రమానికి సహకరిస్తున్న వారి కుటుంబానికి శ్రీ వెంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపడం జరిగింది. శ్రీ వెంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్ మైదుకూరు లో అనేక కార్యక్రమాల ద్వారా సమాజసేవలో భాగంగా ముందు వెళ్తుందని ఎక్కడైనా ఆహారం మిగిలి



ఉన్న సమాచారం తెలియజేస్తే రోడ్ల పైన ఉన్న నిరాశ్రయులకు మరియు అనాథ ఆశ్రమాలకు వారి కుటుంబం పేరుతో వారికి పంపిణీ చేయడం జరుగుతుందని జీవకోటి ఆకలితో అలమటిస్తుందని వీలైనంతవరకు సహాయం చేయడంలో ముందడుగు వేయాలని అలాగే వేస్ట్ పండ్లు కూరగాయలు దాన ఉన్న సమాచారం అందిస్తే మూగజీవాలకు ఆహారం తీర్చే వాళ్ళం అవుతామని సమాచారం అందివ్వడానికి 7702936047, 7901060708 ఈ నెంబర్లకు వివరాలు అందించగలరని శ్రీ వెంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తెలియజేయడం జరిగింది.

# త్వరలో రిజిస్ట్రేషన్ విలువల పెంపు సీఎం చంద్రబాబు నిర్ణయం

కడప బ్యూరో సూర్యవాస్తవం

రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ విలువలు పెంచే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ మేరకు సీఎం చంద్రబాబు సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నారు. అలాగే గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల విధానాన్ని రద్దుకు ఆమోదం తెలిపారు. రిజిస్ట్రేషన్ల శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ విలువలను త్వరలో పెంచేందుకు సూత్రప్రాయంగా నిర్ణయించారు. కనిష్టంగా 10 శాతం నుంచి గరిష్ఠంగా 20 శాతం వరకు రిజిస్ట్రేషన్ విలువలు పెంచనున్నారు. సాధ్యమైనంత వరకు 10 శాతం నుంచి 15 శాతం మధ్యనే పెంపుదల ఉండొచ్చు. శాస్త్రీయంగా అధ్యయనం చేశాకే ప్రాంతాలవారీగా రిజిస్ట్రేషన్ విలువల పెంపుపై నిర్ణయాలు జరుగుతాయి. ఈ ప్రక్రియకు కనీసం 45 రోజుల సమయం పడుతుంది. పెంపు ప్రతిపాదనలను సీఎం చంద్రబాబుకు అధికారులు నివేదించాక అధికారిక నిర్ణయం వెలువడుతుంది. ప్రస్తుతం కొన్నిచోట్ల రిజిస్ట్రేషన్ విలువలు ఎక్కువగాను, బహిరంగ మార్కెట్ విలువను తక్కువగాను ఉన్నాయి. వీటిని సరిదిద్దుతారు. నివేదికలు అందిన తర్వాత సీఎం చంద్రబాబు ఆమోదం : వాస్తవానికి పట్టణ ప్రాంతాల్లో ఏటా ఆగస్టు 1న, గ్రామీణ ప్రాంతాల్లో రెండేళ్లకోసారి రిజిస్ట్రేషన్ విలువలు పెంచుతారు. వైఎస్సార్సీపీ పాలనలో 2019లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 10 నుంచి 20 శాతం అలాగే 2020లో ఎంపిక చేసిన పట్టణాల్లో 10 నుంచి 20 శాతం, 2022లో జిల్లా కేంద్రాల్లో 20 శాతం, 2023లో జాతీయ రహదారులు, ఎంపిక చేసిన ప్రదేశాల్లో 20 శాతం వరకు విలువలు పెంచారు. నివేదికలు అందిన తర్వాత సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపిన మేరకు రిజిస్ట్రేషన్ విసువల పెంపునకు అనుగుణంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లాలకు ఆదేశాలు వెళ్తాయి. గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు రద్దు గ్రామ సచివాలయాల్లో వైఎస్సార్సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రిజిస్ట్రేషన్ల విధానం రద్దుకు చంద్రబాబు ఆమోదం తెలిపారు. ఈ విధానానికి క్రయ, విక్రయదారుల నుంచి స్పందన తక్కువగా ఉంది. గడిచిన రెండేళ్లలో సుమారు 3 వేల 700 గ్రామ సచివాలయాల్లో ఈ విధానం ప్రారంభించగా ఇప్పటివరకూ 5 వేల రిజిస్ట్రేషన్లే జరిగాయి. వీటి వల్ల అదనంగా ఖర్చు, మానవ



వనరుల వృథాతో పాటు సాంకేతిక సమస్యలు ఉన్నాయని అధికారులు సీఎంకు నివేదించారు. నిధుల విడుదలకు చంద్రబాబు అంగీకారం ఎంపిక చేసిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దే విధానానికి చంద్రబాబు స్వస్తి పలికారు. ప్రస్తుతం ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో క్రయ, విక్రయదారులకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు 10 కోట్ల రూపాయలు అవసరమని ఐజీ శేషగిరి బాబు ప్రతిపాదించగా నిధుల విడుదలకు సీఎం అంగీకారం తెలిపారు.

# స్వాస్థ్య ఆసుపత్రి సేవలు సద్వినియోగం యోగించుకోండి..

## హాస్పిటల్ వ్యవస్థాపకులు ముంతాజ్ అలీ ...

మదనపల్లె క్రైమ్ సూర్య వాస్తవం న్యూస్ :

సత్సంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడపబడుతున్న స్వాస్థ్య ఆసుపత్రి ఉచిత సేవలను అవసరమైన ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని స్వాస్థ్య హాస్పిటల్ వ్యవస్థాపకులు డాక్టర్ ముంతాజ్ అలీ.. డైరెక్టర్ డాక్టర్



వెంకటరమణ కోరారు. శనివారం బెంగళూరు వైదేహి హాస్పిటల్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ దుర్గాప్రసాద్ ఆయన బృందంతో మదనపల్లె నక్కలదిన్నె తండాలోని స్వాస్థ్య హాస్పిటల్ లో ఉచిత గుండె పరీక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగ వారు మాట్లాడుతూ..స్వాస్థ్య ఆసుపత్రిలో ఉచిత సేవలను అవసరమైన ప్రతి ఒక్కరూ ఉచితంగా ఉపయోగించుకోవాలన్నారు. గుండె పరీక్షా శిబిరాన్ని స్థానికులే కాకుండా చుట్టుపక్కల ప్రజలు సైతం సద్వినియోగ పరచుకుంటున్నా రన్నారు. ఆస్పత్రిలో ప్రతిరోజు జనరల్ మెడిసిన్, ఎముకలు, గర్భిణీ స్త్రీలు, దంత, ఫిజియో థెరపీ విభాగాలు 24 గంటలు పనిచేస్తున్నాయన్నారు. ఇక్కడ



ఓపికార్డుకు సైతం డబ్బు చెల్లించినవసరం లేదని, హాస్పిటల్లో బెడ్ చార్జీలు పూర్తిగా ఉచితమని, ఫిజియోథెరపీ సేవలు కూడా ఉచితంగా అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బెంగళూరు వైదేహి హాస్పిటల్ డాక్టర్ల బృందం మరియు స్వాస్థ్య హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# తెలుగుగంగ ఎస్ఆర్-2కుకృష్ణా జలాలు విడుదల

## -కలెక్టర్ శివశంకర్ లోతేటి - ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్

దువ్వూరు, సూర్య వాస్తవం :

దువ్వూరు మండలం చల్లబసాయపల్లె గ్రామ సమీపంలో ఉన్న తెలుగు



గంగ ఉపజలాశయం 1నుండి ఉపజలాసయం 2 కు నీళ్లు వదిలారు. శనివారం జిల్లా కలెక్టర్ లోతేటి శివ శంకర్, శాసన సభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ కృష్ణా జలాలకు సాంప్రదాయబద్ధంగా వేద పండితులతో పూజా కార్యక్రమాలు నిర్వ హించి, జలహారతి ఇచ్చి తెలుగు గంగ ఎస్ ఆర్ 1డ్యామ్ నుంచి ఎస్ ఆర్ 2 కు నీళ్లు వదిలారు. ఈ సందర్భంగా కలెక్టర్ ,ఎమ్మెల్యే మాట్లాడుతూ కృష్ణా జలాల రాకతో ఈ ప్రాంతం సస్య శ్యామలం అవుతుందని అన్నారు. ఎస్సార్ 2 నుంచి బ్రహ్మ సాగర్ వారం రోజులకు కృష్ణాజలాలు చేరుకుంటాయని తెలిపారు.

రైతులకు మేలు చేసే ప్రభుత్వం చంద్రబాబు ప్రభుత్వం అని సుధాకర్ యాదవ్ అన్నారు. అలాగే మైదుకూరు మండలంలోని చెరువులకు,దువ్వూరు మండలంలోని చింతకుంట చెరువుకు సీఎంపి హెడ్ రెగ్యులేటర్ ద్వారా బటన్ నొక్కి నీటిని వదిలారు.ఈ చెరువుల ద్వారా వేల ఎకరాలు భూములకు సాగునీరు అందుతుందని తెలిపారు. చల్లబసాయిపల్లె గ్రామానికి చెందిన ఒక రైతు తన పొలంలో ఉన్న తెలుగ కాలువకు ప్రభుత్వం నుంచి డబ్బులు రాలేదని కాల్వను మట్టితో పూడ్చివేశారు. ఆకాలువ ద్వారా వందల ఎకరాలు గత 20 సంవత్సరాల నుంచి నీరు కట్టుకుంటున్నారు. చల్లబాసాయిపల్లె మాజీ సర్పంచ్ సంఘన లక్ష్మీనారాయణరెడ్డి ఆధ్వర్యంలో రైతులు కలెక్టర్ శివశంకర్ ,ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ ను కలిసి రైతు కాలువ ద్వారా నీటిని పారకుండా కాలువను మట్టితో పుర్చివేసిన విషయమును తెలియజేయగా, వెంటనే రైతుకుప్రభుత్వం నుండి డబ్బులు వచ్చేటట్లు పరిష్కారం చేస్తామని, కాలువ ద్వారా నీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ బోరెడ్డి వెంకటరమణారెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర ఉ పాధ్యక్షులు ధనపాల జగన్మోహన్,మైదుకూరు నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షులు కారపురెడ్డి సంజీవరెడ్డి, టిడిపి నాయకులు పాపినేని రాంబాబు,పి.ప్రతాప్ నాయుడు,అందే శ్రీనివాసులు, గంగిరెడ్డిగారి భాస్కర్ రెడ్డి, భూమిరెడ్డి జయరామిరెడ్డి, తెలుగు గంగ అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# కేసి. కెనాల్ రైతులకు నాణ్యత కలిగిన ఎర్ర జగిత్యాల రకం వడ్లను ప్రభుత్వమే అందజేయాలి: ఏవి. రమణ

మైదుకూరు సూర్య వాస్తవం

నాణ్యత కలిగిన ఎర్ర జగిత్యాల రకం వడ్లను ప్రభుత్వమే సరైన ధరకు రైతుకు అందజేయాలని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఏవి.రమణ మైదుకూరు మైదుకూరు నియోజకవర్గం లోని మండలాలలో రైతు నాయకులు రైతులతో కలిసి ప్రభుత్వాన్ని కోరారు. కేసీ.కాలువకు నీరు విడుదల కావడంతో ఆయకట్టు రైతులందరూ కూడా వరి నారు పోసుకుంటున్నారని అయితే వ్యాపారులు రైతులకు నాణ్యత భరోసా ఇవ్వకుండా



1400 రూపాయలు అమ్మ వలసినటువంటి టిక్కీ విత్తనపు వడ్లను 1650 రూపాయలకు అమ్ముతున్నారని దీనితో రైతు పొలంలో పైరును మొదటనే భయముతో మొదలు పెడుతున్నాడని కావున ప్రభుత్వం రైతుల భయం పోగొట్టేందుకు నాణ్యత కలిగిన ఎర్ర జగిత్యాల రకం వడ్లను సరైన ధరకు అందజేసి రైతు ఆదాయంతో పొలంలో పైరు పండించగలనని ధైర్యం ప్రభుత్వం కల్పించాలని కోరారు. అలాగే రాష్ట్రంలో ఏర్పడిన నూతన ప్రభుత్వం రైతులకు హామీ ఇచ్చిన 20వేల రూపాయల రైతు భరోసా రైతుకు అందచేయడం వల్ల రైతు పెట్టుబడికిఉపయోగించగలుగుతాడని కావున ప్రభుత్వం రైతులకు రైతు భరోసా అందజేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో రమణతోపాటు దువ్వూరు మండల నాయకులు ఖడిదం సీతారాముడు, అర్ధాకుల కృష్ణయ్య, కటారు రాఘవేంద్ర, నియోజకవర్గ రైతు నాయకులు రామాంజనేయరెడ్డి, అన్నవరం వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

# కడప జిల్లాలో ఈనెల చివరి వరకు చేపల వేట నిషేధం

కడప బ్యూరో సూర్యవాస్తవం

ఈనెల చివరి వరకు చేపల వేట నిషేధం అమలవుతుందని కడప జిల్లాలోని జలాశయాల్లో చేపలు పట్టరాదని మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ కె శాంతి పేర్కొన్నారు. చేపలు గుడ్లు పెట్టే సమయంలో వేట సాగిస్తే వాటి అభివృద్ధికి ఆటంకాలు ఏర్పడతాయని అందువల్ల జులై 1 నుంచి ఆగస్టు 31 వరకు చేపల వేటపై నిషేధం ఉ ంటుందని శనివారం ఆమె వివరించారు. ఎక్కడైనా చేపలు వేట కొనసాగిస్తే కేసులు పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# దారి కాసి దంపతులపై కోళ్ల దొంగల దాడి..

మదనపల్లె క్రైమ్ సూర్య వాస్తవం న్యూస్ :

కోళ్లను దొంగలించడమే కాకుండా.. గుట్టుగా వాటిని చంపి తినేసిన దొంగలు దారి కాసి దాడి చేసి తీవ్రంగా గాయ పరిచారు. మదనపల్లి మండలంలో శనివారం తీవ్ర కలకలం రేపిన ఘటనపై బాధితులు తాలూకా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు



వివరాలు ఇలా ఉన్నాయి.. అన్నమయ్య జిల్లా, మదనపల్లి మండలంలోని పొన్నేటి పాళ్యం గ్రామం, సవరంవారిపల్లెకు చెందిన దంపతులు శ్యామసుందర్, గాయత్రి పెంచుకొన్న సుమారు 20 కోళ్లను పోరుగింటికి చెందిన చంద్రశేఖర్ అతని అనుచరులు, దివాకర్, నీశాంత్ మరి కొందరు ఇటీవల దొంగలించి, చంపి గుట్టుగా తినేశారు. ఈ విషయం తెలుసుకున్న బాధిత దంపతులు గ్రామంలో పంచాయతి పెట్టాలని పెద్ద మనుషుల దృష్టికి కోళ్ల దొంగతనం తీసుకెళ్లారు. తమపైనే కోళ్ల దొంగతనం నిందలు మోపుతార అంటూ గ్రామానికి సమీపంలో దారి కాసి కర్రలతో దాడి చేసి కొట్టారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితులను కుటుంబీకులు చికిత్స కోసం వెంటనే మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు, ఘటనపై కేసు విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# విష సర్పాలకు దారి తీస్తున్న స్టేట్ బ్యాంక్, పిచ్చి మొక్కలు ఉన్న పట్టించుకోని అధికారులు

అన్నమయ్య జిల్లా (రైల్వే కోడూరు సూర్య వాస్తవం)

రైల్వే కోడూరు పట్టణంలోని ఆర్ఎస్ రోడ్డు నందు ఉన్న స్టేట్ బ్యాంకు కి వెనుక భాగంలో పూర్తిస్థాయిలో పిచ్చి మొక్కలతో బ్యాంకు కప్పి వేయబడింది, అయితే



పూర్తిస్థాయిలో ఏసీ మిషన్ లు కనిపించకుండా మొక్కలతో నిండిపోవడం గమనించిన స్థానికులు దీనిపై పలు రకాల విమర్శలను గుప్పిస్తున్నారు. ప్రధాన రహదారికి ఉన్న స్టేట్ బ్యాంకు పిచ్చి మొక్కలను తొలగించే వారే లేరా అంటూ, స్థానికులు తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నారు. ముఖ్యంగా ఈ పిచ్చి మొక్కలతో కిటికీల నుండి విష సర్పాలు లోపలికి వచ్చే సందర్భాలు కూడా ఉంటుందని స్థానికులు విమర్శిస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు చూసి చూడనట్టు వ్యవహరించడం అత్యంత బాధాకరమైన విషయమని స్థానికులు భావిస్తున్నారు. ఏది ఏమైనాపటికి పూర్తి స్థాయిలో పిచ్చి మొక్కలతో నిండిన బ్యాంకు బిల్డింగును మొక్కలును తొలగించాలని ఖాతాదారులు కూడా కోరుతున్నారు.

# ఆర్థిక సహాయం అందించిన ఎన్ ఆర్ ఐ కి ఘనంగా సన్మానం

అన్నమయ్య జిల్లా (రైల్వే కోడూరు సూర్య వాస్తవం)

రైల్వే కోడూరు పట్టణంలోని మెయిన్ పాఠశాలకు ముందు బాగాన ఇనుప గేటు ఏర్పాటు చేసుకొనుటకు ఎన్ఆర్ఐ అమెరికా ప్రకాష్ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం ఎన్నారై ప్రకాష్ కు ఉ పాధ్యాయులు హెడ్మాస్టర్ నారాయణ, మస్తాన్ భాష నరసింహులు, కిరణ్, రాజన్న లు ఘనంగా శాలువాతో పూలమాలతో





సత్కరించారు. అదేవిధంగా అమెరికా నుంచి వచ్చిన శుభ సందర్భంలో తన తోటి స్నేహితులకు బృందావన కాంప్లెక్స్ లో విందును ఏర్పాటు చేసి, చిరకాల జ్ఞాపకార్థకంగా గెట్ టు గెదర్ ప్రోగ్రాంను నిర్వహించారు.

Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in



## ఎస్ఎఫ్ఐ జిల్లా నూతన కమిటీ ఎంపిక

అధ్యక్ష కార్యదర్శులుగా అక్బర్, భగత్ రవి ఎన్నిక

తిరుపతి సూర్య వాస్తవం ప్రతినిధి

ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశం శనివారం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న ఆధ్వర్యంలో నిర్వహించి నూతన కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడు గా అక్బర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గా భగత్ రవి, జిల్లా ఉ





పాధ్యక్షులు గా వినోద్, తేజ, ఉమేష్, జిల్లా సహాయ కార్యదర్శిలుగా సుష్మిత (గర్ల్స్ వింగ్) నరేంద్ర, బాల, గురువయ్య, తొమ్మిది మందితో జిల్లా కార్యవర్గ సభ్యులు గా, 10 మంది జిల్లా కమిటీ సభ్యులు గా మొత్తం 19 మందిని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు గా ఎన్నుకున్నారు.

జిల్లా కార్యదర్శి భగత్ రవి మాట్లాడుతూ జిల్లా లోని విద్యా రంగం సమస్యలు పై విద్యార్థులను ఐక్యం చేసి పోరాటాలు ద్వారా అన్ని పరిష్కరించెందుకు కృషి చేస్తాం అని తెలిపారు. ఎస్వి పాలిటెక్నిక్ కళాశాల కు హాస్టల్ నూతన భవనం ఏర్పాటు చేసి విద్యార్థులు కోర్స్ పూర్తి అయిపోయే వరకు హాస్టల్ లో వసతులు కల్పించాలని, తిరుపతి నగరం లో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలనీ, టీటీడీ విద్యా సంస్థల లో నెలకొన్న సమస్యలు పై తీర్మానాలు చేసి వాటి కోసం ఎస్ఎఫ్ఐగా ఉద్యమం చెప్పడుతాం అని తెలిపారు.

## శంకరంబాడి ప్రజల హృదయాల్లో నిలిచారు

తిరుపతి సూర్య వాస్తవం ప్రతినిధి

తెలుగుజాతికి మా తెలుగు తల్లికి మల్లెపూదండ గేయాన్ని అందించిన శంకరంబాడి సుందరాచారి తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి అన్నారు. శంకరంబాడి సుందరాచారి జయంతిని పురస్కరించుకుని రాయలసీమ రంగస్థల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. లక్ష్మీపురం సర్కిల్లో గల



శంకరంబాడి సుందరాచారి విగ్రహాన్ని నీటితో శుద్ధి చేసి, పాలభిషేకం నిర్వహించి, పూలమాలలు అలంకరించి ఘనంగా నివాళులర్పించారు. గుండాల గోపీనాథ్ రెడ్డి మాట్లాడుతూ మా తెలుగు తల్లికి మల్లెపూదండ గేయాన్ని తెలుగు జాతికి అందించిన సుందరకవి శంకరంబాడి సుందరాచారి అని కొనియాడారు. నిరంతరం మా తెలుగు తల్లికి మల్లెపూదండ గేయం శంకరంబాడి సుందరాచారి విగ్రహం వద్ద వినిపించేదని, కానీ ప్రస్తుతం నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు దృష్ట్యా కొంతకాలంగా ఈ పాట వినిపించడం లేదని, పనులు పూర్తయిన వెంటనే తిరిగి శంకరంబాడి సుందరాచారి విగ్రహం వద్ద పరిసరాలను పచ్చదనంతో నింపి, గేయాన్ని నిరంతరం వినబడేలా ప్రజలకు చేరువ చేయాలని నగరపాలక సంస్థ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కొట్టే సుబ్రహ్మణ్యం రెడ్డి, టి సుబ్రహ్మణ్యం రెడ్డి, చంద్ర బాబు నాయుడు, పొన్నాల జేజిరెడ్డి, సురేష్ స్వామి, హనుమంతరావు పద్మనాభం రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.

## డిఎస్పి కి సన్మానం

తిరుపతి సూర్య వాస్తవం ప్రతినిధి

ఈస్ట్ డిఎస్పీగా బాధితులు స్వీకరించిన వెంకటనారాయణ ను రాష్ట్ర



పంచాయతీరాజ్ చాంబర్ ఉపాధ్యక్షులు సింగంశెట్టి సుబ్బరామయ్య ఆధ్వర్యంలో టిడిపి నేతలు సత్కరించారు. ఈ మేరకు శనివారం డిఎస్పి కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛని అందించి శాలువ కప్పి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. డిఎస్పిని సన్మానించిన వారిలో తెలుగుదేశం పార్టీ నాయకులు బుద్దె వెంకట్ రాయల్, సురేష్ రాయల్, జనసేనా నాయకులు నైనర్ జగదీష్, పోకల జనర్ధన్, డాక్టర్.హరి కృష్ణ ఉన్నారు.

## గ్రామపంచాయతీల్లో పంద్రాగస్టు వేడుకల నిర్వహణ ఖర్చు పెంపు చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్.

### జిల్లా జనసేన నాయకులు ఎం మహేష్ స్వేరో

ఐరాల సూర్య వాస్తవం న్యూస్. ఆగస్టు 10.

చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం ఐరాల మండలానికి చెందిన జిల్లా జనసేన నాయకులు మహేష్ స్వేరో శనివారం పత్రికా ముఖంగా మాట్లాడుతూ, పంచాయతీల్లో పంద్రాగస్టు వేడుకల నిర్వహణకి గతంలో ఎన్నడూలేని విధంగా గత 34 సంవత్సరాలుగా 100 నుంచి 250 మాత్రమే ఖర్చు చేయడం జరిగేదని, ఇటీవల జరిగిన సమీక్షలో ఉపముఖ్యమంత్రి పంచాయతీరాజ్ శాఖ మాత్యులు పవన్ కళ్యాణ్ మైనర్ పంచాయతీల్లో 10 వేలు, మేజర్ పంచాయతీ 25 వేల వరకు పంద్రాగస్టు నిర్వహణ ఖర్చులు పెంచడం అత్యంత గర్వించదగ్గ విషయం. వ్యవస్థలపైన,రాజ్యాంగం సంస్కృతి పైన మరింత అవగాహన పెంచే విధంగా నూతన ఆలోచన



విధానానికి శ్రీకారం చుట్టి,విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పెంపొందించేలా చేస్తున్న పవన్ కళ్యాణ్ కి హృదయపూర్వక అభినందనలు మహేష్ స్వేరో తెలియజేశారు.అలాగే భవిష్యత్ తరాలకి,విద్యార్థి లోకానికి పంద్రాగస్టు వేడుకల ద్వారా దేశభక్తిని,సమాజం పట్ల బాధ్యతను,వ్యవస్థల పట్ల అవగాహనను రెట్టింపు చేసేలా ప్రణాళికలు చేస్తున్న పవన్ కళ్యాణ్ కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు . ఆయన నాయకత్వంలో పనిచేస్తున్నందుకు ప్రతి ఒక్క జన సైనికుడు గర్వపడుతున్నామని మహేష్ స్వేరో తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ఐరాల మండల జనసేన నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# బీటెక్ విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం

తిరుపతి సూర్య వాస్తవం ప్రతినిధి

శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం,బేసిక్ సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగం, స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(బీటెక్) కోర్సులో నూతనంగా చేరిన విద్యార్థులకు మహిళ వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఇన్చార్జి,



ప్రొఫెసర్ వి ఉమా, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్ రజిని శనివారం ఓరియంటేషన్ ప్రోగ్రాంను నిర్వహించి శుభాకాంక్షలు తెలియజేశారు. స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ పి మల్లికార్జున్ ఇంజనీరింగ్ కోర్సుల వివరణాత్మక పాఠ్యాంశాల గురించి సమాచారాన్ని అందించిన ఆయన ప్రాథమిక కర్తవ్యం చదువుకోవడమే అని విద్యార్థులకు సూచించారు. విద్యార్థి వ్యవహారాల డీన్, ప్రొఫెసర్ జె.కాత్యాయిని క్యాంపస్ లో అందుబాటులో ఉన్న వివిధ ఇంక్యుబేషన్ కేంద్రాలు, అవకాశాల గురించి వివరించారు. విద్యార్థుల విజయాల ద్వారా విశ్వవిద్యాలయ సాధన, జాతీయ ర్యాంకింగ్ సాధ్యమవుతాయని ఐక్యూఏసీ డైరెక్టర్ ప్రొఫెసర్ త్రిపురసుందరి అన్నారు. ప్రొఫెసర్ ఆర్.శైలేశ్వరి కళలు సంగీతంలో విద్యార్థులను వినోద కార్యక్రమాలుగా సుసంపన్నం చేశారు.ప్రొఫెసర్. బి.జీవన జ్యోతి పరీక్షల నిబంధనలను వివరించారు. ప్రొఫెసర్ నాగరాజు లైబ్రరీ పాత్ర గురించి సమాచారం ఇచ్చారు.

ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ సారా సరోజిని విద్యార్థులను యోగా, ధ్యానం ఏరోబిక్స్, క్యాంపస్లో అందుబాటులో ఉన్న వెల్నెస్ సెంటర్ గురించి వివరించి, ఆరోగ్యమే సంపద అని పేర్కొన్నారు. ఆత్మరక్షణ పద్ధతుల గురించి కూడా చెప్పారు.మహిళా భద్రతా విభాగం సమన్వయకర్త ప్రొఫెసర్. టి.సీతా కుమారి సైబర్ భద్రత సాంకేతిక వినియోగంపై సమాచారం ఇచ్చారు.వార్డెన్. ఎస్ పి ఎం వి వి వసతి గృహాలు ప్రొఫెసర్ జి.సావిత్రి వారాంతంలో సెలవులు పంపే విద్యార్థులకు భద్రత అనుమతులకు సంబంధించిన మొత్తం సమాచారాన్ని ఇస్తారు. ఎన్ ఎస్ ఎస్ బృందం డా.డి .నీరజ కార్యకలాపాల ప్రాముఖ్యతను వివరించారు.స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సమన్వయకర్తలందరూ సి ఎస్ ఇ, ఇ సి ఇ, ట్రిపుల్ ఇ, మెక్ బి ఎస్, హెచ్ వంటి వివిధ విభాగాలలో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, ప్రయోగశాల సౌకర్యాలు, పరికరాలు మరియు పరికరాల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ పి. మల్లికార్జున, బేసిక్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్ కోఆర్డినేటర్ జి.సుప్రియ, డాక్టర్ ఎన్.రమ జ్యోతి, బి ఎస్, హెచ్ ఫ్యాకల్టీ ఓరియంటేషన్ ప్రోగ్రామ్ను నిర్వహించారు. చివరగా, డా. వై.దేవసేన ధన్యవాదాలు ఓటు ప్రతిపాదించారు.

# ప్రగతిరథ చక్రం పరుగుపెట్టేదెప్పుడు

కుప్పం ఆర్టిసి తీరు రెండడుగులు ముందుకు వంద అడుగులు వెనక్కి

డొక్కు బస్సులతో సరి ప్రక్షాళన ఎప్పుడో మరి

కుప్పం ఆగస్టు 10 సూర్య వాస్తవం

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి సొంత నియోజకవర్గమైన కుప్పం ఆర్టీసీ డిపో అధికారుల పనితీరుకు నిదర్శనంగా ఉందీ ఈ చిత్రం ఎందుకంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీని లాభాల బాట పట్టిస్తామని మంత్రులు అధికారులు చెబుతుంటే కుప్పంలో మాత్రం అందుకు విరుద్ధంగా నడుస్తోంది. ఇటీవల ముఖ్యమంత్రి కుప్పం పర్యటన తర్వాత ఆర్టీసీ అధికారులు కదలిక వచ్చిందని అందరూ అనుకున్నారు అందుకు కారణం ఇటీవల పల్లె



ప్రాంతాలకు కొత్త బస్సులను స్థానిక ఎమ్మెల్సీ చేతుల మీదుగా ఆ పార్టీ నేతలు అధికారులు ఘనంగా ప్రారంభించారు. కానీ అంతరాష్ట్ర సర్వీసులను పట్టించుకోవడం మానేశారని స్పష్టమవుతుంది. ఇందుకు ఆర్టీసీ అధికారులను నిందించినా ఫలితాలు మాత్రం కనబడటం లేదు. ముఖ్యమంత్రి నియోజకవర్గంలో ఉన్న కుప్పం ఆర్టీసీ డిపోను మోడల్ బస్ స్టేషన్ గా తీర్చిదిద్దుతామని ఇటీవల నూతన సర్వీసులను కుప్పం డిపోలో ప్రారంభించిన సందర్భంగా మంత్రి మండపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. అయితే కుప్పం డిపో అధికారులు ప్రభుత్వ ఆశయానికి తూట్లు పొడుస్తున్నారు. ఒక్కరని కాదు,డిపోలో అధికారులందరూ తమ మధ్య సమన్వయం లేకుండా పనిచేస్తున్నారు. అంతర్ రాష్ట్ర బస్సు సర్వీసు పరిస్థితి ఎలా ఉంటే మిగిలిన బస్సుల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని స్థానికులు పెదవి విరుస్తున్నారు. చివరకు రాష్ట్ర ముఖ్యమంత్రికి చెడ్డపేరు వచ్చినా పర్వాలేదు కానీ తమకు నెల జీతం వస్తే చాలన్న ధోరణి లో వారున్నారు. డిపో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, టీఐ2, ఎంఎఫ్ ల పనితీరు నేటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉందనే విమర్శలు వినబడుతున్నాయి. ప్రజాప్రతినిధులు, ప్రజల కోరిక మేరకు బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్నా వాటిపై పర్యవేక్షణ లేదు. బస్సులు డిపో నుండి బయటకు వెళ్తే చాలు ఇక తమపని అయిపోయిందని చేతులు దులుపుకుంటున్నారు. ఎవరికివారే యమునాతీరే అన్న చందంగా వ్యవహరిస్తున్న ఆర్టీసీ అధికారుల తీరును ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ, కడ పిడి ల దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని స్థానికులు చెబుతున్నారు. మరో విచిత్రం ఏమంటే రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కుప్పం డిపోలో రాత్రి, పగలు అని తేడా లేకుండా డ్రైవర్లు, కండక్టర్లు ప్రతిరోజూ డ్యూటీ చేయాల్సిందే. దీంతో వారు అధికంగా విధులను నిర్వహిస్తూ సొమ్మసిల్లి పడిపోతున్న సంఘటనలు చాలా ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు కుప్పం ఆర్టిసి డిపో పై శ్రద్ధ పెట్టి అధికారులను ఒకే గాడిన పెట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు.

# ఘనంగా ముగిసిన ఏపీ మెడికాన్ సమావేశాలు

తిరుపతి సూర్య వాస్తవం ప్రతినిధి

శ్రీవెంకటేశ్వర వైద్య కళాశాలలో వైద్య విద్య అధ్యాపకులకు, వైద్య విద్యాబోధన విభాగం, రాష్ట్ర వైద్య విద్యా ఉపాధ్యాయుల సంఘంతో గత మూడు రోజులుగా నిర్వహించిన 14వ వార్షిక ఏపీ మెడికల్ సమావేశాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా వైద్య అధ్యాపకులకు నేషనల్ మెడికల్ కమిషన్,(న్యూఢిల్లీ) వారి సౌజన్యంతో, 2023-24 లో ప్రవేశ పెట్టిన నూతన వైద్య విద్య బోధనా విధానాలు, వైద్య పరీక్షలకు సంబంధించిన మార్పులు, చేర్పులను గురించి వైద్య విద్యలో కృత్రిమ మేధస్సులో ప్రముఖులు ఉపన్యాసాలు చేశారు. డా ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం విజయవాడ ఆంధ్ర ప్రదేశ్, కి అనుసంధానంగా ఉన్న ఎస్ వి.వైద్య కళాశాలలో ఈ సదస్సు 11 సంవత్సరాల ముందు నిర్వహించగా రెండవసారి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైద్య విద్య సంచాలకులు అకాడమిక్ డాక్టర్ జి రఘునందన్ ముఖ్యఅతిథిగా పాల్గొని సదస్సు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంలో పెను మార్పు వస్తున్నందువలన, ఎప్పటికప్పుడు నూతన వైద్య విద్య ను వైద్య అధ్యాపకులు తెలుసుకున్నట్లయితే, పేద రోగులకు మెరుగైన వైద్యం అందించడంలో ఆంధ్రప్రదేశ్ ముందుంటుందని తెలిపారు.

వైద్య విద్య బోధన గురించి సదస్సులో నూతన మార్పులను గురించి పాత పద్ధతుల ప్రాముఖ్యతను క్లుప్తంగా వివరించారు. ఇటువంటి కార్యక్రమాల వలన వైద్య విద్యా బోధనా పద్ధతులలో నూతన మార్పులు వలన కలిగే ప్రయోజనాలు అందరికీ తెలియజేయ గలుగుతున్నమని చెప్పారు. పేద రోగులకు మెరుగైన కార్పొరేటు వైద్యం అందించడానికి, ఇలాంటి సమావేశాలు ఎంతో అవసరము అని ఎస్ వి వైద్య కళాశాల అధ్యక్షులు డా"చంద్రశేఖరన్ తెలిపారు. ఈ సదస్సులో వివిధ ప్రాంతాల నుంచి, ఆంధ్రప్రదేశ్ నుండి సుమారు 400 మంది వైద్య అధ్యాపకులు, పీజీ విద్యార్థులు, అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు పాల్గొన్నారు. దేశ నలుమూలల నుండి ప్రఖ్యాతి గాంచిన డా.పియుష్ గుప్త, డా. విష్ణు భట్, డా.శంకర్ నచికేత్, డా.మహాలక్ష్మి సుమారు 25 మంది ఉపన్యాసాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డా"కిరీటి, డా.వెంకటేశ్వర్లు, డా.డి.ఎస్.ఎన్ .మూర్తి,



డా.ప్రతిభ స్రవంతి, డా"రామ దేవి, డా.ఉమా దేవి, డా. మాధవీలత, డా.శ్రీకాంత్ రెడ్డి, డా.ఫహీం, డా.భారతి, బోధన సిబ్బంది ఎస్ వి వైద్య కళాశాల పి ఆర్ ఓ. వీర కిరణ్ పాల్గొన్నారు.

## జీవన నైపుణ్యాలు ప్రగతికి సోపానాలు

తిరుపతి, సూర్య వాస్తవం ప్రతినిధి :

విద్యతో పాటు జీవన నైపుణ్యాలు నేర్చుకుంటే ఎంచుకున్న రంగాలలో ప్రగతి సాధించవచ్చని ప్రముఖ సైకాలజిస్ట్ ఎన్ బి సుధాకర్ రెడ్డి చెప్పారు. శనివారం





రేణిగుంట మండలం కరకంబాడి లోని రాస్ బాలాజీ బల వికాస కేంద్రంలో గ్రామీణ విద్యార్థులకు జీవన నైపుణ్యాలపై శిక్షణ చైల్డ్ ఫండ్ ఇండియా సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. తెలివి, జ్ఞానం, సామర్థ్యం, వికాసం పెంచుకుంటే నైపుణ్యాలు అలవాటు అవుతాయన్నారు. వికాస శిక్షకుడు డాక్టర్ వి.శ్రీధర్ మాట్లాడుతూ భావ వ్యక్తీకరణలో జాగ్రత్తలు పాటించాలన్నారు. సృజనాత్మకత చేసే పనికి వన్నె తెస్తుందన్నారు. చదవడంలో నైపుణ్యాలు నేర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి ఎస్ రమేష్ రెడ్డి, సమన్వయకర్త ఎన్ భారతి పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించిన పి ఎస్ మునిరత్నం

శాంతిపురం ఆగస్ట్ 10 సూర్యవాస్తవం

మండల పరిధిలోని గుడిశెట్టిపల్లిలో క్రికెట్ టోర్నమెంట్ను శనివారం టిడిపి కుప్పం నియోజకవర్గ ఇంచార్జ్ పి.యస్.మునిరత్నం ప్రారంభించారు,ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను పరిచయంచేసుకొని క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహ పరిచారు, అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి యువత చరవాణిలో క్రీడలు ఆడుతున్నారని అలా కాకుండా ప్రతి ఒక్కరూ





క్రీడలు మైదానంలో ఆడాలని కోరారు. క్రీడలు ఆడటం వల్ల మానసికంగా, శారీరకంగా, ఆరోగ్యంగా, ఉంటారన్నారు. ప్రతిఒక్కరూ క్రిడల్లో రాణించి మన ప్రాంతానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. క్రీడల్లో రాణిస్తే పై చదువుల తర్వాత ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విస్తరణ కమిటీ కార్య నిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు, నేతలు పి.గోపీనాథ్, సత్యేంద్రశేఖర్, డాక్టర్ వెంకటేష్,ఇ. విజయరామిరెడ్డి, ఉదయ్ కుమార్,ఆర్. ఎస్.మణి,రాజేంద్ర మరియు మహిళా నేతలు అనసూయ, సుగుణమ్మ, గుడిశెట్టిపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సమస్యలను పరిష్కరించండి

తిరుపతి సూర్య వాస్తవం ప్రతినిధి

శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని అధ్యక్షులు మన్నం ప్రేమ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వైయస్సార్ విద్యార్థి విభాగం యూనివర్సిటీ అధ్యక్షులు మన్నం ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ పరిపాలన భవనం వద్ద విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఇంజనీరింగ్ హాస్టల్ వార్డెన్ దామోదర్ రెడ్డి స్పందించి ఇంచార్జ్ విసి అప్పారావుతో మాట్లాడి మెస్ ఫీజులను తగ్గిస్తానని హాస్టల్ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమస్యలు పరిష్కారం కాకపోతే విద్యార్థి సంఘాలన్నీ కలుపుకొని యూనివర్సిటీ వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భారతీయ దళిత విద్యార్థి సేన కొండ యుగంధర్, ఏపీ వీహెచ్ఎస్ జిల్లా అధ్యక్షుడు రూకేష్ విద్యార్థి నాయకులు ముని, నరేష్, పవన్ ,మురళి, కళందర్, లిఖిత్ పాల్గొన్నారు.



# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద తవణంపల్లి మండల దళితుల నిరసన.



తవణంపల్లి సూర్య వాస్తవం న్యూస్ ఆగస్ట్ 10.

చిత్తూరు జిల్లా తవణంపల్లి మండల కేంద్రంలోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద తవణంపల్లి మండల నాయకులు శనివారం దీక్షకు పూనుకున్నారు. విజయవాడ నడి బొడ్డున నిర్మించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం నందు సామాజిక న్యాయవ్యవస్థ అనే పేరును తొలగించిన దుండగులను ఉద్దేశించి తవణంపల్లి మండల దళిత నాయకులు అంబేద్కర్ విగ్రహం నందు తీవ్రంగా ఖండించడం జరిగింది.

ఈ సందర్భంగా మొదటగా దళిత యువజన సేవా సంఘం నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి అనంతరం పూలమాలవేసి నివాళులు అర్పించి నిరసన వ్యక్తం తెలిపారు. అనంతరం దళిత కమిటీ సభ్యులు మాట్లాడుతూ కుల పునాదుల మీద దేనిని సాధించలేం, ఒక జాతిని నిర్మించలేం, పౌరుని నైతిక అభివృద్ధే నిజమైన దేశాభివృద్ధి అని లోకానికి చాటి చెప్పిన మహనీయులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని సభ్యులు తెలిపారు.భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 14 15 16 17 18 లో చట్టం ముందు ఎవరు అధికులు కారు, చట్టపరమైన అవకాశాలు అందరికీ సమానంగా ఉంటాయని వారు తెలిపారు.

ఆర్టికల్ 46 లో బలహీన వర్గాల అభివృద్ధికి, షెడ్యూల్డు కులాలు,తెగలవారికి, ప్రత్యేక సౌకర్యాలు రక్షణ కలిగించాలని ఆర్టికల్ లో రూపొందించ బడిందని అన్నారు. ఆర్టికల్ 49లో పురాతన కట్టడాలు, చారిత్రక కళాత్మక ప్రదేశాలు, కట్టడాలను ఒక జాతీయ ప్రాముఖ్యత కలవిగా గుర్తించి రక్షించుట ప్రభుత్వ బాధ్యత, అని జాతీయ ప్రాముఖ్యత గల ప్రదేశాలను కట్టడాలను గుర్తించి పార్లమెంటు తగిన శాసనాలను చేసి అవి పాడైపోకుండా ధ్వంసం కాకుండా తొలగించబడకుండా విదేశాలకు ఎగుమతి కాకుండా తగు చర్యలను తీసుకోవాలని, తెలిపారు. అనంతరం భారత రాజ్యాంగ నిర్మాత సామాన్య కుటుంబంలో పుట్టి తన ప్రశ్న పాఠవాలతో స్వయంకృషితో ఎదుగుతూ అత్యున్నత స్థానాన్ని అలంకరించిన అపర మేధావి గొప్ప మానవతావాది మహోన్నత విద్యావేత్త, బహుముఖ ప్రజ్ఞాశాలి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, అని కొనియాడారు.బానిసత్వం అంటరానితనం అశ్రుస్యతల నిర్మూలనకు అనగారిన వర్గాల హక్కుల పరిరక్షణకు స్వేచ్ఛ, సమానత్వం, కోసం పోరాడిన యోధులు ప్రపంచ రాజ్యాంగ చరిత్రలన్నింటినీ అవలోకించి మన దేశానికి అత్యుత్తమంగా రాజ్యాంగాన్ని రూపొందించిన మహనీయులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని అన్నారు.

రాజకీయాలకు అతీతంగా అంబేద్కర్ ఆలోచనలు ఆశయాలు ఉంటాయని అలాంటి ఆయన విగ్రహం నందు సామాజిక న్యాయవ్యవస్థ పేరును తొలగించడం చాలా సిగ్గుచేటు అని అలాంటి వారిని కఠినంగా శిక్షించాలని వారు తెలియజేశారు.ఇలాంటివి మరలా పునరావృతం అయితే జిల్లా రాష్ట్ర దేశవ్యాప్తంగా అతి భారీ ఎత్తున నిరసనలు చేపడుతామని కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ ఆవేదన వ్యక్తం చేశారు.ఈకార్యక్రమంలో అంబేద్కర్ దళిత సభ్యులు జగన్నాథం, షణ్ముగం,మురుగన్, ఉమా పరదేశి, మధు కుమార్, ఏకరాజ్ చిన్నయ్య, రీటా బాబు, సుధాకర్, అనంత కుమార్, మణిరాజ్, మునీంద్ర, గోవిందు, దళిత నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బాలకృష్ణ అన్‌స్టాపబుల్‌లో చిరంజీవి

బాలకృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న టాక్ షో 'అన్‌స్టాపబుల్'. ఇప్పటికే మూడు సీజన్లు పూర్తి చేసుకున్న ఈ షో కొత్త సీజన్ కోసం సిద్ధమవుతోంది. ఇప్పటికే దీనికి సంబంధించిన పనులు కూడా పూర్తయ్యాయి. కొత్త సీజన్ సరికొత్త సర్‌ప్రైజ్‌లతో సిద్ధమవుతోంది. ఇప్పటికే చిత్ర పరిశ్రమలోని కథానాయకులు, దర్శకులు, ఇతర ప్రముఖులతో సందడి చేసిన ఈ షో ఇప్పుడు మరింత జోష్‌తో సాగనుంది. ఈసారి ముఖ్య అతిథిగా అగ్ర కథానాయకుడు చిరంజీవి రాబోతున్నారు. అధికారికంగా ప్రకటన వెలువడటమే తరువాయి. చిరు పుట్టినరోజు సందర్భంగా ఈ ప్రకటన వెలువడవచ్చని టాక్ వినిపిస్తోంది. తెలుగు చిత్ర పరిశ్రమలో చిరంజీవి, బాలకృష్ణలది ప్రత్యేక స్థానం. మాస్ హీరోలుగా వాళ్లకున్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అలాంటి స్టార్‌లు ఒకే వేదికపై కనిపిస్తే, అభిమానులకు అంతకుమించిన వినోదం ఏముంటుంది. చిరుతో పాటు, మరో అగ్ర కథానాయకుడు నాగార్జున కూడా ఈ సారి పాల్గొంటారని తెలుస్తోంది. వీళ్లతో పాటు, మరికొన్ని సర్‌ప్రైజ్ ఉంటాయని తెలుస్తుంది. దీనిపై 'ఆహా' నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.



## ఊటీలో సూర్య చిత్రం షూటింగ్.. స్వల్పంగా గాయపడ్డ హీరో

దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో హీరో సూర్య తన 44 వ సినిమా చేస్తున్న సినిమా శరవేగంగా చిత్రీకరణను జరుపుకుంటోంది. తాజాగా ఈ సినిమా సెట్స్‌లో చిన్న యాక్సిడెంట్ జరిగినట్లుగా నిర్మాత పాండ్యన్ తెలియజేశారు. ఈ యాక్సిడెంట్‌లో హీరో సూర్యకు స్వల్ప గాయం అయిందని, వెంటనే హాస్పిటల్‌కు తీసుకెళ్లి చికిత్స చేయించామని నిర్మాత పాండ్యన్ తెలిపారు. ఈ యాక్సిడెంట్‌లో సూర్య తలకు గాయమైనట్లుగా ఆయన చెప్పుకొచ్చారు. సూర్య44 సినిమా సెట్స్‌లో చిన్న యాక్సిడెంట్ జరిగింది. హీరో సూర్య తలకు చిన్న గాయమైంది. ట్రీట్‌మెంట్ కూడా పూర్తయింది. అభిమానులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. త్వరలోనే మళ్లీ సూర్య యాక్టివ్‌గా షూటింగ్‌లో పాల్గొంటారు.. అని నిర్మాత రాజశేఖర్ కర్పూరసుందరపాండియన్ వెల్లడించారు. ప్రస్తుతం ఈ సినిమా ఊటీలో చిత్రీకరణ జరుపుకుంటోంది. ఇటీవల అండమాన్‌లో షూటింగ్ పూర్తి చేసుకుని.. మేకర్స్ ఊటీకి షెడ్యూల్ ప్రారంభించారు. ప్రస్తుతం సూర్య సేఫ్‌గా ఉన్నారని, డాక్టర్స్ ఆయనకు విశ్రాంతి అవసరమని చెప్పినట్లుగా తెలుస్తోంది. సూర్య44 సినిమా విషయానికి వస్తే.. గ్యాంగ్‌స్టర్ డ్రామా కోసం టాలెంటెడ్ ఫిల్మ్ మేకర్ కార్తీక్ సుబ్బరాజ్‌తో చేతులు కలిపారు. 2ఆ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై సూర్య, జ్యోతిక ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సహ నిర్మాతలుగా స్టోన్ బెంచ్ ఫిల్మ్స్ రాజశేఖర్ కర్పూరసుందరపాండియన్, కార్తికేయ సంతానం వ్యవహరిస్తున్నారు. రీసెంట్‌గా సూర్య బర్త్‌డేని పురస్కరించుకుని ఈ సినిమా నుంచి స్పెషల్ గ్లింప్స్‌ని విడుదల చేశారు. ఇందులో సూర్య బాడ్ యాష్‌గా కనిపించారు. గ్యాంగ్‌స్టర్‌గా అతని స్టాం÷-రగ్ స్క్రీన్ ప్రెజెన్స్ థ్రిల్లింగ్ రైడ్‌కు హామీ ఇచ్చినట్లుగా ఉంది. సూర్య సరసన పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తోన్న ఈ చిత్రంలో జోజు జార్జ్, కరుణాకరన్, జయరామ్ వంటి వారు ఇతర పాత్రలలో నటిస్తున్నారు.





## అభిమానులకు థాంక్స్ చెప్పిన మహేశ్ బాబు

తన అభిమానులను ఉద్దేశించి నటుడు మహేశ్‌బాబు ఆసక్తికర పోస్ట్ పెట్టారు. శుక్రవారం తన పుట్టినరోజుని పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలిపిన వారందరికీ ఆయన థాంక్యూ చెప్పారు. 'నిన్న నా పుట్టినరోజు సందర్భంగా మీరు పంపించిన సందేశాలు, చూపించిన ప్రేమాభిమానాలు చూసి ఆనందంతో ఉప్పొంగిపోయా. మీరందరూ ఈ స్పెషల్ డేని నాకు మరింత ప్రత్యేకంగా మారేలా చేశారు. ప్రతి ఏడాది మీరు నాపై చూపిస్తోన్న ప్రేమ, మద్దతుకు ధన్యవాదాలు. లవ్ యూ' అని ఆయన ట్వీట్ చేశారు. ప్రస్తుతం ఇది నెట్టింట వైరల్‌గా మారింది. దీనిపై ఆయన అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 'లవ్ యూ అన్నా' అంటూ కామెంట్స్ పెడుతున్నారు. మహేశ్‌బాబు పుట్టినరోజును పురస్కరించుకొని తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో ఆయన అభిమానులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అన్నదానం, ఇతర సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భారీ కటౌట్లు ఏర్పాటుచేసి కేకులు కట్ చేసి తమ ప్రేమను చాటుకున్నారు. మరోవైపు, మహేశ్ నటించిన 'మురారి' మూవీ రీ రిలీజ్ అయ్యింది. ఈసందర్భంగా ఆయా థియేటర్ల వద్ద సినీప్రియుల సందడి కనిపించింది. ఇక, సినిమాల విషయానికి వస్తే.. ఈ ఏడాది ఆరంభంలో 'గుంటూరుకారం'తో ప్రేక్షకులకు వినోదాన్ని అందించారు మహేశ్. ప్రస్తుతం ఆయన తన తదుపరి ప్రాజెక్ట్ కోసం సన్నద్ధమవుతున్నారు. రాజమౌళి దర్శకత్వంలో ఇది తెరకెక్కనుంది. మహేశ్ 29వ చిత్రమిది. భారతీయ చిత్ర పరిశ్రమలో ఇప్పటివరకూ చూడని సరికొత్త ప్రపంచాన్ని రాజమౌళి ఆవిష్కరించ బోతున్నారని రచయిత విజయేంద్రప్రసాద్ గతంలో ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే ఈ కథలో పలువురు విదేశీ నటులు కనిపించనున్నారు. భారతీయ భాషలతో పాటు, విదేశీ భాషల్లోనూ దీనిని అనువదించనున్నారు. దీనికి 'మహారాజ్' అనే టైటిల్‌ను అనుకుంటున్నట్లు టాక్. వెండితెరపై సరికొత్త లుక్‌లో మహేశ్ కనిపించనున్నారు.

## గ్లామర్ డోస్ పెంచిన ఐశ్వర్య

దక్షిణ భారత చిత్రపరిశ్రమలో ప్రతి ఒక్కరికీ బాగా పరిచయమున్న హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ .కెరీర్ ఆరంభంలో హోమ్లీ గర్ల్‌గా ముద్ర వేసుకున్న ఈమె.. ఇపుడు గ్లామర్ డోస్ పెంచి ప్రతి ఒక్కరినీ ఆశ్చపరుస్తున్నారు. పా. రంజిత్ దర్శకత్వంలో 2011లో వచ్చిన 'అట్టకత్తి' సినిమాలో ఒక మంచి పాత్ర ద్వారా ఐశ్వర్య రాజేష్ వెండితెరకు పరిచయమయ్యారు. ఆ తర్వాత 'పుత్తగం' సినిమాలో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు. 'రమ్మీ' సినిమాలో విజయ్ సేతుపతి సరసన నటించారు. అయితే, 'కాక్కాము÷-ట్టై' సినిమా ఆమె సినీ కెరీర్‌కు ఓ టర్నింగ్ పాయింట్‌లా నిలిచింది. ఫలితంగా కోలీవుడ్ సరిహద్దులను దాటి తెలుగు, మలయాళ భాషల్లో కూడా వరుస అవకాశాలను సొంతం చేసుకుంటున్నారు. మధ్య లేడీ ఓరియంటెడ్ పాత్రలను ఎంచుకుంటూ ముందుకు సాగుతున్నారు. 'ఫర్హానా'లో ఆమె ఒక ముస్లిం గృహిణిగా, ఇద్దరు పిల్లల తల్లిగా పోషించిన పాత్రకు ప్రశంసలు వచ్చాయి. సినిమాలే కాకుండా ఐశ్వర్య రాజేష్ సోషల్ మీడియాలో సైతం ఎంతో యాక్టివ్‌గా ఉంటారు. ఎప్పటికప్పుడు తన తాజా ఫొటోషూట్ ఫొటోలను షేర్ చేస్తూ ఉంటారు. అయితే ఎప్పుడూ కూడా లిమిట్ దాటింది లేదు. కానీ ఇటీవలికాలంలో ఆమెలో చాలా మార్పు కనిపిస్తోంది. ఈ మధ్య ఆమె స్పెషల్ ఫొటో షూట్‌ల పేరుతో ఎక్స్‌పోజ్ చేస్తూ, సోషల్ మీడియాలో ఫొటోలను షేర్ చేస్తున్నారు.








## 10 గంటల్లో 4.5 కిలోలు తగ్గిన అమన్ సెహ్రావత్..

కాంస్య పతక పోటీకి ముందు అమన్ సెహ్రావత్ బరువు కూడా వినేష్ ఫోగట్ లాగా చాలా ఎక్కువగా ఉంది. 57 కేజీల వెయిట్ విభాగంలో పోటీపడిన అమన్ సెమీఫైనల్‌లో ఓడిపోయినప్పుడు 4.5 కేజీల అధిక బరువుతో ఉన్నాడు.
అంటే, అతను సరిగ్గా 61.5 కిలోల బరువుతో ఉన్నాడు. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో పురుషుల 57 కిలోల బరువు విభాగంలో భారత రెజ్లర్ అమన్ సెహ్రావత్ కాంస్య పతకాన్ని సాధించి సరికొత్త చరిత్ర సృష్టించాడు. అమన్ సెహ్రావత్ కేవలం 21 సంవత్సరాల 24 రోజుల వయస్సులో ఒలింపిక్స్‌లో వ్యక్తిగత పతకాన్ని గెలుచుకున్న భారతదేశపు అతి పిన్న వయస్కుడైన అథ్లెట్‌గా నిలిచాడు. గతంలో ఈ రికార్డు పీవీ సింధు పేరిట ఉండేది. కాంస్య పతక పోరులో, అమన్ తన తొలి ఒలింపిక్స్‌లో ప్యూర్టో రికో రెజ్లర్‌ను 13-5తో ఏకపక్షంగా ఓడించి పతకాన్ని గెలుచుకున్నాడు. అయితే, అమన్‌కు ఈ పతకం రావడం వెనుక కథనం చాలా ఉత్కంఠ రేపుతోంది. నిజానికి కాంస్య పతకానికి ముందు అమన్ సెహ్రావత్ బరువు కూడా వినేష్ ఫోగట్ లాగానే చాలా ఎక్కువగా ఉంది. 57 కేజీల వెయిట్ కేటగిరీలో పోటీపడిన అమన్ సెమీ ఫైనల్లో ఓడిపోయినప్పుడు 4.5 కేజీల అధిక బరువుతో ఉన్నాడు. అంటే అతను సరిగ్గా 61.5 కిలోల బరువుతో ఉన్నాడు. దీంతో అమన్‌కు కాంస్య పతకం దక్కడం అనుమానంగా మారింది. అయితే, కేవలం 10 గంటల్లోనే అమన్ 4.5 కిలోల బరువు తగ్గాడు. జగ్మందర్ సింగ్, వీరేంద్ర దహియా శిక్షణ పొందిన ఆరుగురు సభ్యుల రెజ్లింగ్ జట్టు అమన్ బరువును 57 కిలోలకు తగ్గించగలిగింది. ఐతే కేవలం 10 గంటల్లోనే అమన్ 4.5 కిలోల బరువు ఎలా తగ్గాడోనని అంతా తెలుసుకోవాలని కోరుకుంటున్నారు. ముందుగా అమన్ సెహ్రావత్‌కు గంటన్నర మ్యాట్ సెషన్ ఇచ్చారు. ఇందులో నిలబడి కుస్తీ పట్టాలని సూచించారు. ఆ తర్వాత అమన్ సెహ్రావత్‌కు గంటపాటు వేడినీటి స్నానం చేశాడు. మధ్యాహ్నం 12 గంటల తర్వాత, వ్యాయామశాలలో ఒక గంట ట్రెడ్‌మిల్‌పై కసరత్తులు చేశారు. ఆ తర్వాత 30 నిమిషాల పాటు విశ్రాంతి ఇస్తారు. ఆ తర్వాత, అమన్‌కు మసాజ్, లైట్ జాగింగ్, అతని బరువు తగ్గించడానికి 15 నిమిషాల రన్నింగ్ సెషన్ ఇచ్చారు. అంతటితో ఆగకుండా ఒక్కరాత్రిలో పోరాడిన అమన్ బరువు తెల్లవారుజామున 4.30 నాటికి 56.9 కిలోలుగా మారింది. అంటే నిర్దేశించిన పరిమితి కంటే 100 గ్రాములు తక్కువగా చేసుకున్నాడు. అమన్ సెహ్రావత్ 10 గంటల్లో 4.5 కిలోల బరువు తగ్గాడు. ఎందుకంటే, భారత స్టార్ రెజ్లర్ వినేష్ ఫోగట్ అధిక బరువు కారణంగా అనర్హుడని మనందరికీ తెలుసు. వినేష్ 50 కిలోల ఈవెంట్‌లో ఫైనల్‌కు చేరి కనీసం రజత పతకాన్ని ఖాయం చేసుకున్నాడు. కానీ, ఫైనల్స్‌కు ముందు, అతను నిర్దేశించిన పరిమితి కంటే 100 గ్రాముల బరువు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించడంతో అతను పోటీ నుంచి అనర్హుడయ్యాడు. ప్రస్తుతం వినేష్ కేసు సీఏఎస్‌లో నడుస్తుండగా త్వరలోనే నిర్ణయం వెలువడే అవకాశం ఉంది.

## ఢిల్లీ ఎయిర్ పోర్టులో భారత హాకీ జట్టుకు ఘన స్వాగతం

పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకాన్ని గెలుచుకున్న భారత పురుషుల హాకీ జట్టు శనివారం స్వదేశానికి తిరిగి వచ్చింది. ఢిల్లీ విమానాశ్రయంలో భారత ఆటగాళ్లకు డప్పు వాయిద్యాలతో, పూల మాలలు వేసి ఘన స్వాగతం పలికారు. వేసి ఉదయం నుంచి భారత ఆటగాళ్ల కోసం విమానాశ్రయం లోపల అభిమానులు భారీ సంఖ్యలు వేచి ఉన్నారు. ఆటగాళ్లు ఎయిర్ పోర్ట్ నుంచి బయటకు భారత ఆటగాళ్లను ఉత్సాహపరిచారు. ఇదిలా ఉంటే.. పారిస్ ఒలింపిక్స్ నుంచి ఇండియాకు తిరిగి వచ్చిన తర్వాత భారత హాకీ జట్టు ఆటగాళ్లు ఢిల్లీ విమానాశ్రయం వెలుపల సంబరాలు చేసుకున్నారు. డప్పు చప్పుళ్లకు అనుగుణంగా స్టెప్పులు వేస్తూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా హాకీ ఇండియా జనరల్ సెక్రటరీ భోళనాథ్ సింగ్ మాట్లాడుతూ.. పారిస్ ఒలింపిక్స్ ముగింపు కార్యక్రమంలో జెండా బేరర్‌గా పీఆర్ శ్రీజేష్ ఎంపిక కావడం గురించి మాట్లాడారు. పిఆర్ శ్రీజేష్ ఒలింపిక్స్ ముగింపు కార్యక్రమంలో పతాకధారిగా అర్హుడని తెలిపారు. భారత ప్రభుత్వం, భారత ఒలింపిక్ కమిటీ అతనికి ఈ అవకాశాన్ని కల్పించినందుకు హాకీ ఇండియా తరుపున ధన్యవాదాలు తెలిపారు.



వరుసగా రెండు పతకాలు సాధించడం ఒక గొప్ప విజయం అని అన్నారు. తమ లక్ష్యం ఫైనల్ ఆడటం, కానీ అమిత్ రోహిదాస్‌ను సిట్ అవుట్ చేయడంలో రిఫరీ చేసిన పొరపాటు కారణంగా తాము ఓడిపోయామన్నారు. అందుకే తాము కాంస్య పతకంతో ఇక్కడకు వచ్చాము. లేకుంటే పతకం రంగు మారి ఉండేదని పేర్కొన్నారు. టోక్యో ఒలింపిక్స్ 2020లో భారత హాకీ జట్టు పతకాన్ని సాధించిన సంగతి తెలిసిందే.. మన్‌ప్రీత్ సింగ్ నాయకత్వంలో కాంస్య పతకాన్ని గెలుచుకుంది. పారిస్‌లో కూడా భారత్ కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. కాంస్య పతక పోరులో భారత్ 2-1తో స్పెయిన్‌ను ఓడించింది. అంతకుముందు సెమీస్‌లో జర్మనీ చేతిలో భారత్ 3-2 తేడాతో ఓటమి చవిచూడాల్సి వచ్చింది. 1980లో మాస్కో ఒలింపిక్స్ తర్వాత హాకీలో భారత్ స్వర్ణం సాధించలేదు. హాకీలో భారత్ ఇప్పటి వరకు ఎనిమిది స్వర్ణాలు, ఒక రజతం, నాలుగు కాంస్య పతకాలతో మొత్తం 13 పతకాలు సాధించింది. భారత పురుషుల హాకీ జట్టు 52 ఏళ్ల తర్వాత వరుసగా రెండు ఒలింపిక్స్‌లో పతకాలు సాధించింది. ఇంతకు ముందు 1968, 1972లో పతకాలు సాధించింది.

### నా కోచింగ్ కెరీర్‌లో అదే ఘోర పరాభవం: ద్రవిడ్

టీమిండియా విజయవంతమైన కోచ్‌లలో ఒకడిగా గుర్తింపు పొందాడు మాజీ కెప్టెన్ రాహుల్ ద్రవిడ్. టీ20 ప్రపంచకప్-2021 తర్వాత రవిశాస్త్రి స్థానంలో హెడ్‌కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన ఈ కర్ణాటక లెజెండ్ మార్గదర్శనంలో.. టీమిండియా అన్ని ఫార్మాట్లలో నంబర్ వన్‌గా ఎదిగింది. ద్వైపాక్షిక సిరీస్‌లలో వరుస విజయాలతో విమర్శకుల ప్రశంసలు దక్కించుకుంది. అయితే, టీ20 ప్రపంచకప్-2022(సెమీస్), ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్- 2021-23, వన్డే వరల్డ్‌కప్-2023(ఫైనల్) టోర్నీలో మాత్రం టైటిల్ గెలవలేకపోయింది. ఈ క్రమంలో ఒక సందర్భంలో ద్రవిడ్‌ను వెంటనే కోచ్‌గా తొలగించాలనే డిమాండ్లూ వచ్చాయి. అయితే, బీసీసీఐ మాత్రం అతడిపై నమ్మకం ఉంచింది. వరల్డ్‌కప్-2023 తర్వాత అతడి పదవీకాలం ముగిసినా.. టీ20 ప్రపంచకప్-2024 వరకు కోచ్‌గా కొనసాగాలని కోరింది. ఇందుకు అంగీకరించిన ద్రవిడ్‌కు ఘనమైన వీడ్కోలు లభించింది. ప్రపంచకప్-2024లో రోహిత్ శర్మ కెప్టెన్సీలోని భారత జట్టు చాంపియన్‌గా అవతరించింది. తద్వారా దాదాపు పదకొండేళ్ల విరామం తర్వాత మరోసారి భారత్‌కు ఐసీసీ టైటిల్ దక్కింది. అయితే, సొంతగడ్డపై వన్డే వరల్డ్‌కప్ ఓడిపోవడం మాత్రం ద్రవిడ్ కెరీర్‌లోని చేదు అనుభవం అని చెప్పవచ్చు. అయితే, రాహుల్ ద్రవిడ్ మాత్రం అన్నింటికంటే సౌతాఫ్రికా గడ్డ మీద ఓటమే.. తన కోచింగ్



కెరీర్‌లో ఎదురైన ఘోర పరాభవం అంటున్నాడు. ప్రొటీస్ జట్టును తమ సొంతదేశంలో ఓడించే అవకాశం చేజారడం ఎన్నటికీ మర్చిపోలేనన్నాడు. చిరస్మరణీయ విజయం సాధించే క్రమంలో జరిగిన పొరపాట్ల వల్ల భారీ మూల్యమే చెల్లించామని పేర్కొన్నాడు. ఈ మేరకు.. "నా క్రికెట్ కోచింగ్ కోరీర్‌లో అన్నింటికంటే ఘోర పరాభవం.. సౌతాఫ్రికా గడ్డపై టెస్టు సిరీస్ గెలవలేకపోవడం. సెంచూరియన్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో మేము విజయం సాధించాం. అదే జోరులో రెండో టెస్టును ఘనంగా ఆరంభించాం. కానీ సౌతాఫ్రికా అనూహ్య రీతిలో తిరిగి పుంజుకుని గెలుపును లాగేసుకుంది. మూడో టెస్టులోనూ అదే ఫలితం పునరావృతం చేసింది. మా జట్టులోని కొందరు సీనియర్లు అప్పుడు అందుబాటులో లేరు. రోహిత్ శర్మ కూడా గాయపడ్డాడు. అయినా.. రెండు, మూడో టెస్టుల్లో విజయానికి చేరువగా వచ్చాం. కానీ లక్ష్యాన్ని చేరుకోలేకపోయాం. అయితే, ఈ సిరీస్ ద్వారా ఎన్నో పాఠాలు నేర్చుకున్నాం. కోచ్‌గా ఎలా నన్ను నేను సంభాళించుకోవాలో తెలుసుకున్నా. అన్ని మ్యాచ్‌లు మనమే గెలవలేం. ఒక్కోసారి ఓటమే మనకు ఎంతో నేర్పిస్తుంది" అని రాహుల్ ద్రవిడ్ 2021-22 సిరీస్ నాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నాడు. స్టార్ స్పోర్ట్స్ షోలో ఈ వ్యాఖ్యలు చేశాడు. కాగా ద్రవిడ్ స్థానంలో టీమిండియా హెడ్‌కోచ్‌గా గౌతం గంభీర్ బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. ఇక గౌతీ హయాంలో తొలిసారిగా శ్రీలంక పర్యటనకు వెళ్లిన టీమిండియా టీ20 సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. అయితే, వన్డే సిరీస్‌లో మాత్రం 0-2తో ఆతిథ్య లంక జట్టు చేతిలో ఓటమిని చవిచూసింది. 27 ఏళ్ల తర్వాత తొలిసారి శ్రీలంకకు వన్డే సిరీస్‌ను సమర్పించుకుంది.

## పారిస్ ఒలింపిక్స్ లో విషాదం

ఒలింపిక్స్‌లో దేశానికి పతకం అందించాలనే ఓ రెజ్లర్ కల చెదిరింది. ప్రత్యర్థి అమాంతం ఎత్తి పడేయంతో ఊహించని విధంగా ఆమె గాయపడింది. మహిళల ఫ్రీ స్టయిల్ 76 కిలోల విభాగం 16వ రౌండ్‌లో రొమేనియా రెజ్లర్ కటలినా అక్సెంటే ( తీవ్ర గాయాలపాలైంది. శనివారం ఉదయం జరిగిన బౌట్ సమయంలో అమెరికా రెజ్లర్ కెన్నెడీ బ్లేడ్స్ ఆమెను అమాంతం ఎత్తి మ్యాట్ మీద పడేసింది. దాంతో, కటలినా మెడకు తీవ్ర గాయమైంది. ఊహించని పరిణామంతో షాక్ తిన్న ఆమెను ఒలింపిక్స్ సిబ్బంది స్ట్రెచర్ మీద తరలించి అత్యవసర వైద్యం అందించారు. యూరో చాంపియన్‌షిప్స్‌లో రెండుసార్లు కాంస్యం నెగ్గిన అక్సెంటే, అమెరికా కెరటం కెన్నెడీకి గట్టి పోటీనిచ్చింది. అయితే.. మొదటి రౌండ్‌లో 6-0తో ఆధిక్యం సాధించిన అమెరికా రెజ్లర్ ఆ తర్వాత రెచ్చిపోయింది. అక్సెంటీని వెనకనుంచి అదిమి పట్టుకొని అలానే వెనక్కి ఎత్తి కింద పడేసింది. దాంతో, అక్కడున్నవాళ్లంతా ఒకింత షాక్‌కు గురయ్యారు. మెడకు గాయంతో బాధపడుతున్న అక్సెంటీని ఒలింపిక్స్ సిబ్బంది స్ట్రెచర్ మీద తీసుకెళ్లి వైద్యం అందించారు. అయితే.. ఆమె ఆరోగ్యం ఎలా ఉంది? అనేది ఇంకా తెలియలేదు.




PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG,ON BEHALF OF IRS PUBLICATIONS.13-2-819-2 RAMBOW RESIDENCE,RTC BUS STAND ROAD. SRINIVASA NAGAR ANANTAPUR,ANDHRA PRADESH-515001. GSTIN:37AAJF15233N1ZY.TEL:7672042522.VIJ
ADDRESS:SHEETAL APARTMENT,TF2 DR NO:39-2-15/IE VIJAYAWADA-10.CHIEF EDITOR MD. SHAFEE AHAMED, MOB NO:9948461699.-EDITOR-M.IRSHAD BAIG.CELL: 918500425222 (FOUNDER- N.ARIF ALI).